SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 9
February-2023, Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

ఫిబ్రవరి 2023
వెల రూ.20/-
పుటలు-56



శ్రీనివాసమంగాపురం

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

2023 ఫిబ్రవరి 11 నుండి 19 వరకు

తిరుమల తిరుపతి దేవస్థానములు



## శ్రీనివాసమంగాపురం
## శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి
## బ్రహ్మోత్సవాలు

2023 ఫిబ్రవరి 11 నుండి 19 వరకు

**11-2-2023 శనివారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం

**12-2-2023 ఆదివారం**
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**13-2-2023 సోమవారం**
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం

**14-2-2023 మంగళవారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**15-2-2023 బుధవారం**
పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**16-2-2023 గురువారం**
పగలు: హనుమద్వాహనం
రాత్రి: గజవాహనం

**17-2-2023 శుక్రవారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**18-2-2023 శనివారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**19-2-2023 ఆదివారం**
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం

తిరుమల తిరుపతి దేవస్థానములు



## తిరుపతి
## శ్రీకపిలేశ్వరస్వామివారి
## బ్రహ్మోత్సవాలు

2023 ఫిబ్రవరి 11 నుండి 20 వరకు

**11-2-2023 శనివారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: హంసవాహనం

**12-2-2023 ఆదివారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**13-2-2023 సోమవారం**
పగలు: భూతవాహనం
రాత్రి: సింహవాహనం

**14-2-2023 మంగళవారం**
పగలు: మకరవాహనం
రాత్రి: శేషవాహనం

**15-2-2023 బుధవారం**
పగలు: తిరుచ్చిఉత్సవం
రాత్రి: అధికారనంది వాహనం

**16-2-2023 గురువారం**
పగలు: వ్యాఘ్రవాహనం
రాత్రి: గజవాహనం

**17-2-2023 శుక్రవారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: అశ్వవాహనం

**18-2-2023 శనివారం**
పగలు: రథోత్సవం
రాత్రి: నందివాహనం (మహాశివరాత్రి)

**19-2-2023 ఆదివారం**
పగలు: పురుషామృగవాహనం
రాత్రి: కల్యాణోత్సవం, తిరుచ్చిఉత్సవం

**20-2-2023 సోమవారం**
పగలు:
సూర్యప్రభవాహనంలో నటరాజస్వామి,
త్రిశూలస్నానం
రాత్రి: ధ్వజావరోహణం
రావణాసురవాహనం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** తం తథా కృపయా உ உ విష్టమశ్రుపూర్ణాకులేక్షణమ్
విషీదన్తమిదం వాక్యమువాచ మధుసూదనః ॥

(శ్రీమద్భగవద్గీత 02-సాంఖ్యయోగం- 01వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** తథా= అట్లు; కృపయా= కనికరముచేత; ఆవిష్టం= కూడుకొనియున్నవాడును; అశ్రుపూర్ణాకులేక్షణమ్= కన్నీటితో నిండిన వ్యాకులములైన నేత్రములు గలవాడును; విషీదన్తమ్= దుఃఖించుచున్నవాడునగు; తమ్= ఆ అర్జుననిగూర్చి; మధుసూదనః= శ్రీకృష్ణమూర్తి; ఇదంవాక్యమ్= ఈ (చెప్పబోవు) వాక్యమును; ఉవాచ= పలికెను.

**భావం:** ఆ ప్రకారముగ కనికరముతో కూడుకొని కంట నీరు పెట్టుకొనినవాడై వ్యాకులత్వము జెంది దుఃఖించుచున్న అర్జుననిజూచి శ్రీకృష్ణుడిట్లు పలికెను.

---

## శ్రీవేంకటేశుడపుడు దయ చూడగ

ఇన్నిటికి నీశ్వరేచ్ఛ- యింతే కాక
తన్నుదానే హరిగాచు- దాసుఁడైతేఁ జాలు.

ప్రకృతిఁబుట్టిన దేహి- ప్రకృత (తి?) గుణమే కాని
వికృతి బోధించబోతే- విషమింతే కాదా,
ఒక విత్తు వెట్టితే వే- రొకటేల మొలచును
ప్రకటమైన వట్టి- ప్రయాసమే కాక.

పాపానఁ బుట్టిన మేను- పాపమే సేయించుగాక
యేపునఁ బుణ్యముతోవ- యేల పట్టును,
వేపచేఁదు వండితేను- వెసనేల బెల్ల మవును
పై పై బలిమి సే సే- భ్రమ యింతేకాక.

ప్రపంచమైన పుట్టుగు- ప్రపంచమునకే కాక
ఉపమించ మోక్షమున- కొడఁబడునా?
ప్రపన్నుఁడైన వేళ- భాగ్యాన శ్రీవేంకటేశుఁ
డపుడు దయఁ జూడఁగ- నధికుఁడౌఁగాక !

(సంపుటం-3, సంకీర్తన-123)



*ఏది జరగవలెనన్నను భగవంతుని ఇచ్ఛ ననుసరించి జరగవలసినదే. ఆయనకు దాసుడగుటొక్కటే జీవుని కర్తవ్యము. అప్పుడు దయానిధియైన శ్రీహరి తానే వీనిని కాపాడగలడు.*

*దేహధారియైన ఈ జీవుడు భగవన్మాయాప్రభావముచే గల్గిన ప్రకృతినుండియే శరీరముతో జన్మించినాడు. వీనికి ప్రకృతిసహజములైన గుణములే ఉండును గాని ఇతరగుణములుండవు. ప్రకృతికతీతముగా ప్రవర్తించుమని వానిని మనము బలవంతము చేసినచో ఆశించిన ప్రయోజనము సిద్ధించకపోవుటే కాక అది విషమమైన పరిణామమునకే దారితీయును. ఒక చెట్టువిత్తు నాటినచో ఆ చెట్టే మొలుచునుగాని మరొకచెట్టు ఎట్లు మొలచును? ఒకవేళ అట్లు మొలిపించుటకు ప్రయత్నించినచో అది వట్టి ప్రయాసయే యగునుగాని ఫలముండదు గదా !*



*ఈ శరీరము పాపకర్మముచే బుట్టినది. ఇది మనచే తనకు సహజమైన పాపకర్మమునే చేయించును గాని పుణ్యమార్గము నెందు కనుసరించును? వేప చేదు వండినచో చేదుగనే ఉండునుగాని బెల్లమువలె తియ్యగా నెట్లుండును? కాన ఈ తనువును పుణ్యపథమున నడిపింపగలమని పూనుకొనుట భ్రమయేగాని మరేమియు గాదు సుమా!*

*మన జన్మము ప్రపంచప్రవృత్తికి సంబంధించినది. ఇది ప్రపంచ మాయాజాలమున మనలను తగిలించుటకే ప్రయత్నించును గాని మోక్షమున కంగీకరించునా? కావున జీవుడు భగవంతునెడల ప్రపన్నుడు కావలెను. అప్పుడు భాగ్యవశమున శ్రీవేంకటేశ్వరుడు వానిని దయజూచును. అంతట నతడు ముక్తుడై అధికుడగును. ఇంతకంటె వేరొక సులభోపాయము జీవునకు లేదు.*

*- డా॥ సముద్రాల లక్ష్మణయ్య*

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

## ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృతభాషలు)

'సప్తగిరి' పట్ల మీరు చూపిస్తున్న అభిమానం అనన్యసామాన్యం.
తి.తి.దే.కి, పాఠకులకు మధ్య వారధిలా ఉన్న సప్తవర్ణ 'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక.

సెప్టెంబరు, 2022 నుండి
'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక వెలలో మార్పు అమలులోకి వచ్చింది.
ఇది నూతన చందాదారులకు
మాత్రమే ఈ మార్పు వర్తిస్తుంది.



### చందా వివరాలు

విడిప్రతి- రూ.20/-
సంవత్సర చందా- రూ.240/-
జీవిత చందా(12 సం॥లకు మాత్రమే)- రూ.2400/-
విదేశాలకు సంవత్సర చందా- రూ.1030/-



శ్రీవారి అక్షరప్రసాదాన్ని
నెలనెలా అందుకోండి!

మీ ఇంటికే శ్రీవారు వచ్చిన
అనుభూతిని పొందండి!!

'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రికకు
చందాకట్టండి! చందాకట్టించండి!!

వివరాలకు: ప్రధాన సంపాదకుడు,
తి.తి.దే.ప్రెస్ ప్రాంగణం, కే.టి.రోడ్డు, తిరుపతి-517 507.
ఫోన్: 0877-2264363, 2264543




తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 53 ఫిబ్రవరి, 2023 సంచిక : 09


వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| ఓమ్ మహాలింగాయ నమః | డా॥ మైలవరపు లలితకుమారి | 07 |
| కల్యాణసంస్కృతి | డా॥ కోగంటి వేంకట శ్రీరంగనాయకి | 10 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 13 |
| ఆదిభిక్షువు ఆయుధాల పరమార్థం | డా॥ నల్లాన్ చక్రవర్తుల సుధామైథిలి | 14 |
| ధర్మరీతి! భీష్మనీతి!! | డా॥ పులిగడ్డ విజయలక్ష్మి | 16 |
| మహాశివరాత్రి జాగరణ విశిష్టత! | శ్రీ ఎల్.ప్రఫుల్లచంద్ర | 18 |
| మాఘమాసం నియమాలు | శ్రీ మహాభాష్యం నరసింహారావు | 19 |
| పురుషార్థాలు | డా॥ కె.సుధాకరరావు | 20 |
| శివపార్వతుల కల్యాణం | శ్రీమతి టి.వి.సుందరవల్లి శ్రీదేవి | 21 |
| ఉపనిషత్సారసంగ్రహం | డా॥ దేవులపల్లి పద్మజ | 22 |
| భిన్నభంగిమలో ప్రసన్నవేంకటేశ్వరస్వామి -తొండమనాడు | శ్రీ యస్.హేమంత్‌కుమార్ | 23 |
| నారికేళం | మాలతి | 25 |
| ద్వాదశజ్యోతిర్లింగాలు | | 28 |
| చెంచులక్ష్మి పరిణయగాథ | శ్రీ యం.వి.యస్.రామశేషు | 31 |
| రుద్రాభిషేకం | శ్రీ చాకిచర్ల నాగసుదర్శన్‌రావు | 34 |
| బ్రహ్మర్షి కపిలమహర్షి | డా॥ పి.లలితవాణి | 37 |
| తిరువాదనూర్ | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 39 |
| దర్శనమీయవా దేవా! | శ్రీ పాదిరాజు సుబ్బారావు | 41 |
| పరదేశంలో పరమవిష్ణులోకం అంగ్‌కోర్‌వాట్ | శ్రీ విద్వాన్ కె.సి.నాయుడు | 42 |
| మేడిపండు | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| వినదగు నెవ్వరు చెప్పిన..!! | శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి | 45 |
| కఠినహృదయం కరగదు (విశ్వదాభిరామం) | కీ.శే. విద్వాన్ కట్టానరసింహులు | 46 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 47 |
| మార్కండేయుడు (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ శ్రీస్వామి | 48 |
| చండీ ఉద్దాలకులు | శ్రీ అవసరాల లక్ష్మీపతిరావు | 50 |
| బాలవినోదం | | 51 |
| క్విజ్ (07) | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు, శ్రీనివాసమంగాపురం
వెనుకచిత్రం : శ్రీకామాక్షీదేవి సమేత శ్రీకపిలేశ్వరస్వామివారు, కపిలతీర్థం


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,


సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.


24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# ప్రణవోచ్చారణ చేద్దాం!!

**ఓమిత్యే కాక్షరం బ్రహ్మవ్యాహరన్ మనోహృది నిరుధ్యచ।**
**యః ప్రయాతి త్యజన్దేహం సయాతి పరమాం గతిమ్॥ (భగవద్గీత-08-13)**

పరబ్రహ్మనికి వాచకమైన 'ఓమ్' అను ఒక్క అక్షరాన్ని ఉచ్చరిస్తూ నన్ను ఎడతెగక చింతిస్తూ శరీరాన్ని వదులుతాడో అతడే మోక్షాన్ని పొందుతాడు. అన్ని మంత్రాలలో ఓంకారమే అనగా ప్రణవమంత్రమే శ్రేష్ఠమైంది. దీన్ని జపిస్తే చాలదు. ధ్యానం కూడా ఉండాలి. మంత్రోచ్చారణతోపాటు మంత్రార్థచింతనాన్ని కూడా కల్గి ఉండాలి. దీనిని నిరంతరం స్మరిస్తూనే ఉండాలి.

నిరంతరం ప్రణవాన్ని ధ్యానించడం పరాకాష్టకు చేరినప్పుడు ధ్యానం చేసేవ్యక్తి ధ్యానిస్తున్నవస్తువు రెండూ ఒక్కటౌతాయి. మనిషిలోని అణువణువునా దైవత్వం వ్యాపిస్తుంది. ఈ రకమైన ఆధ్యాత్మిక అనుభవాన్ని పొందడం సాధ్యమే. అయితే మన శరీరంలోని 'మనోమయకోశం'లో పేరుకుపోయిన వివిధరకాల సంస్కారాల ప్రాబల్యంవల్ల ఈ రకమైన ఆధ్యాత్మికఅనుభవం దీర్ఘసమయంపాటు కొనసాగదు. ఐతే, ఉన్నతదశకు పురోగమించిన ప్రణవజప సాధకులకు మాత్రం రాత్రీపగలూ అనే తేడా లేకుండా ప్రతిక్షణం వారి అంతరాంతరాళాల్లో ఓంకారం ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ఆవిధంగా వారు అత్యున్నతదశకు చేరుకోవడానికి దోహదపడుతుంది. కష్టాలకు క్రుంగకుండా, సుఖాలకు పొంగకుండా స్థిరచిత్తంతో తామరాకుమీద నీటిబొట్టులా స్థితప్రజ్ఞతతో వ్యవహరించడమే అత్యున్నతస్థితి. ఆ స్థాయికి చేరుకున్న వ్యక్తికే మరణభయముండదు. ఆత్మ ఒకశరీరంలోనుండి మరొకశరీరంలోకి ప్రవేశించడమేనన్న నిజం వీరికి ఉంటుంది.

'యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి'(10-25) అని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పాడు. ఈ కలియుగంలో శాంతిని, ఆనందాన్ని, తృప్తిని, అమరత్వాన్ని ఇచ్చే శక్తి ఈ జపయజ్ఞానికి ఉంది. ఈ జపయజ్ఞం అపరిమితఫలాన్ని ఇస్తుంది. ఈ జపయజ్ఞంవల్ల మానవునిచిత్తం శుద్ధపడి జన్మజన్మార్జితపాపాలను ప్రక్షాళనం గావిస్తుంది. బ్రహ్మజ్ఞానాన్ని కల్గిస్తే మోక్షప్రాప్తికి అత్యంతసహాయకారిగా ఉంటుంది. ఇది సాక్షాత్ భగవత్స్వరూపమే. భౌతికవిషయాలపై ఆసక్తి ఎక్కువైతే మనస్సు వ్యాకులత చెందుతుంది. దానికి మందు నామజపమే. భగవన్నామజపంవల్ల మనస్సుకు శాంతి లభిస్తుంది. ఈతిబాధలు తొలగిపోతాయి. నామజపం, మంత్రజపం సాధకుల సూక్ష్మశరీరంపైన, స్థూల శరీరంపైన మంగళకరమైన ప్రభావాన్ని చూపుతుంది. శరీరంలోని ప్రతిఅణువు ప్రశాంతతను పొందుతుంది. శాంతికి, శక్తికీ కేంద్రబిందువు భగవన్నామజపమే. ఏ విషయంగురించీ చింతన చేయకపోవడమే ధ్యానం. ఈ ధ్యానానికి మనోనిగ్రహం ఎంతో ముఖ్యం. వివిధయుగాల్లో యజ్ఞాలు, యాగాలుచేసి మోక్షాన్ని పొందారు. కానీ, ఈ కలియుగంలో మోక్షమార్గం ఒక్క నామధ్యానం మాత్రమే. ఇందులో సాధకులు తమ ఇష్టదైవాన్ని భక్తిశ్రద్ధలతో జపించడం, ధ్యానించడం. ఆ కోవకి చెందినవారే భక్తప్రహ్లాదుడు, భీష్ముడు మొదలైనవారు.

కాగా, ప్రస్తుతం కరోనా అనే వ్యాధి ప్రపంచమంతటినీ వణికిస్తోంది. కరోనా అనేకాక ఇంకా ఎన్నో భయంకరవ్యాధులతో ప్రజలు సతమతమౌతున్నారు. అలాంటి అనారోగ్యాలను ఎన్ని మందులు వాడినాకూడా తరిమికొట్టలేం. ఎందుకంటే అవన్నీ శరీరానికి వస్తున్నాయి. కాని మనసుకు కాదు. ఆ శారీరక అనారోగ్యంవల్లనే మానసికఅనారోగ్యంకూడా కల్గుతోంది. మానసికస్థితి సరిగా ఉండాలంటే మనం పైచెప్పినవిధంగా భగవన్నామ జపానికి, ధ్యానానికి ప్రాధాన్యమివ్వాలి. అలా భగవన్నామజపంతో మన మానసికచింతన మెరుగుపడినట్లైతే తద్వారా శారీరకఆరోగ్యంకూడా మెరుగవుతుంది. భగవంతునిసందర్శనకు దేవాలయాలకు వెళ్లినాకూడా మౌనంగా మనస్సులో ఏ ఆలోచనకు తావివ్వకుండా 'ఓం' అనే మంత్రంతో మన ఇష్టదైవాలను స్మరించుకోవాలి. అంతేగానీ, అన్యవిషయాలపై దృష్టి పెట్టకూడదు. ఆ ఓంకారనామజపమే మనమనస్సులోని మాలిన్యాలను తొలగిస్తుంది. తద్వారా శారీరకఆరోగ్యానికి అది కారకమౌతుంది. ఆ కోవలోనే పంచాక్షరీమంత్రం, అష్టాక్షరీమంత్రాలైన 'ఓం నమశ్శివాయ', 'ఓం నమో వేంకటేశాయ'లాంటి వాటిని నిరంతరమూ జపధ్యానాదులు చేసుకొంటున్నట్లైతే మనం పరిపూర్ణఆరోగ్యాన్ని పొందగలుగుతాం. ఆ దేవదేవుని కరుణాకటాక్షాలతో జీవితాల్ని సుఖమయం చేసుకుంటాం. కాబట్టి ఇంతకుముందు మనం జపధ్యానాలను పాటించకపోయినా ఫర్వాలేదు. కనీసం ఇప్పటికైనా మనం మన శారీరకఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే స్థిరనిశ్చయంతో 'ఓం'కార నాదప్రణవోచ్చారణకు స్వాగతం పలుకుదాం. ధ్యానిద్దాం. సుఖ సంతోషాలతో మనం వర్ధిల్లుతూ దేశసౌభాగ్యతలో మనంకూడా పాత్రులమవుదాం!

*ధ్యానిద్దాం! జపిద్దాం!! శ్రీవారి ఆశీస్సులు పొందుదాం!!!*

*లోకాస్సమస్తాస్సుఖినోభవంతు*



# ఓమ్ మహాలింగాయ నమః

- డా॥ మైలవరపు లలితకుమారి, 9959510422

శ్లో॥ ఆకాశం లింగం ఇత్యుక్తం పృథివీ తస్య పీఠికా ।
ఆలయం సర్వం దేవానాం లయనాత్ లింగముచ్యతే ॥

ఆకాశమే లింగం. భూమి దాని పీఠం. సమస్తదేవతలకు నిలయం. ఇందులోనే అంతాలయం చెందుతుంది. అందుకే ఈ సృష్టి సమస్తం శివమయం. సృష్టికి పూర్వం ఈ విశ్వమంతా నీటితో నిండి ఉన్నది. ఆ నీటినుంచి ఒక మహా తేజస్సు ఉద్భవించింది. ఆ తేజోమయరూపమే శివలింగంగా చెబుతారు. నిరాకారుడైన పరమాత్మను సేవించటమే లింగపూజ పరమార్థం.

భృగుమహర్షి శాపకారణంగా భూలోకంలో లింగ రూపంలో ఈశ్వరారాధన జరుగుతున్నది.

శివలింగాలు ఐదురకాలుగా మనకు గోచరిస్తుంటాయి. తనంతటతానుగా అవతరించినది స్వయంభూలింగం. ధ్యాన పూర్వకమైనది బిందులింగం. మంత్రపూర్వకమైనది ప్రతిష్ఠా లింగం. నాలుగవది చరలింగం. ఐదవది శివుని నిగ్రహరూప మైన గురులింగంగా పిలువబడుతున్నాయి.

శివాలయంలో మనం ప్రదక్షిణలు చేసేటప్పుడు ఏ దిక్కున ఆదిక్కు లింగరూపాన్ని స్మరించి నమస్కరించాలి. ఆలయంలోని లింగదర్శనం చేసుకొని ఆకాశంవైపు చూస్తూ ఓమ్ ఈశానాయ నమః అని నమస్కరించాలి. దిక్కులే అంబరములుగా గలిగిన దిగంబరుడైన ఈశ్వరుని అభిషేకాలతో అర్చించి నమస్కరిస్తే మనకోరికలన్నీ తీరుతాయి.

ఇవేకాక 1001 ముఖాలు కలిగిన లింగాన్ని ఆట్య లింగమని, 108 ముఖాలున్న లింగాన్ని సారోట్యలింగమని, అష్టోత్తరలింగమని పిలుస్తారు. ముఖాలు లేని లింగాన్ని అనాట్యలింగమంటారు. మనకు ముఖాలు లేని లింగాలే ఎక్కువ. ఐదుముఖాలున్న లింగాన్ని సర్వసమలింగమని అంటారు. నేపాల్ లోని పశుపతినాథ్ ఆలయం పంచముఖలింగరూపం. ఏ రూపంలో ఉన్న లింగంనైనా పూజించటానికి కావలసింది భక్తి శ్రద్ధలే. భక్తి, అభిషేకాలతో పూజిస్తే పరమేశ్వరుడు మన బాధలను పోగొడతాడు. అభిషేకమే పరమేశ్వరపూజలోని ప్రాముఖ్యత.

మనకు తెలిసిన పై లింగాలన్నీ శిలానిర్మితమైన లింగములే. అందులోకూడా నల్లరాతిలింగములే అధికం. ఈ శివలింగాలన్నింటికి పంచామృతములు, గంధ, చందన, పసుపు, కుంకుమ మొదలైనద్రవ్యాలతో అభిషేకాలు చేయడం సర్వ సాధారణం.

"ఈశ్వరో అభిషేక ప్రియః" అని అంటారు కదా! శివలింగంపైన ఒక దోసెడునీరు పోసినా మనకు అనంత ఐశ్వర్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మిక. ఈశ్వరుడు ఐశ్వర్యప్రదాత. శివం అంటే సంతోషాన్ని కలుగజేసేది అని అంతరార్థం.

పైన చెప్పబడిన లింగములే కాక మనకు తెలీని శివలింగరూపాలు అనేకం ఉన్నాయి. వాటిలో దాదాపు ముప్పై రకాల శివలింగాలు ముఖ్యమైనవి, అపురూపమైనవిగా పేర్కొంటారు. అనేకరకాల అభిషేకపదార్థాలతో లింగములకు అర్చనలు

చేసి అనంతఫలితాలు పొందినట్లుగా పురాణాల్లో వర్ణించ బడింది. ఏ పదార్థంతో చేసిన లింగాన్ని పూజిస్తే ఏఏ ఫలితాలు కలుగుతాయో తెలుసుకుందాం.

**గంధలింగం-** రెండుభాగాలు కస్తూరి, నాలుగుభాగాలు గంధం, మూడుభాగాలు కుంకుమ కలిపి తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే శివసాయుజ్యం లభిస్తుంది.

**పుష్పలింగం-** నానావిధ సుగంధపుష్పాలతో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే రాజ్యాధిపత్యం కలుగుతుంది.

**నవనీతలింగం-** వెన్నతో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే కీర్తి, సౌభాగ్యాలు కలుగుతాయి.

**రజోమయలింగం-** పూలపుప్పొడితో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే విద్యాధరత్వం సిద్ధించడమేకాక శివసాయుజ్యాన్ని కూడా పొందగలం.

**ధాన్యలింగం-** యవలు, గోధుమలు, బియ్యపుపిండితో తయారు చేసిన శివలింగాన్ని పూజిస్తే సంపదలవృద్ధి మాత్రమేకాక సంతాన, సౌభాగ్యంకూడా కలుగుతుంది.

**తిలపిష్టోత్థలింగం-** నువ్వులపిండితో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే ఇష్టసిద్ధి కలుగుతుంది.



**లవణజలింగం-** హరిదళం, త్రికటుకం, ఉప్పులతో కలిపి తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే వశీకరణశక్తి లభిస్తుంది.

**భస్మమయలింగం-** భస్మంతో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే సర్వసిద్ధులు కలుగుతాయి.

**శర్కారామయలింగం-** పంచదారతో తయారుచేసిన శివ లింగాన్ని పూజిస్తే సుఖప్రదమైన జీవితం కలుగుతుంది.

**సద్యోత్థలింగం-** ఈ లింగాన్ని పూజిస్తే ప్రీతి కలుగుతుంది.

**వంశాంకురమయలింగం-** వెదురుమొలకలతో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే వంశవృద్ధి కలుగుతుంది.

**కేశాస్థిలింగం-** వెంట్రుకలు, ఎముకలతో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే శత్రునాశనం జరుగుతుంది.

**పిష్టమయలింగం-** పిండితో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే చక్కనివిద్య వస్తుంది.

**దధిదుగ్ధలింగం-** దీనిని పూజిస్తే కీర్తిప్రతిష్ఠలు కలుగుతాయి.

**ఫలోత్థలింగం-** ఫలాలతో తయారుచేసిన లింగాన్ని పూజిస్తే అన్నింటా ఉత్తమఫలితాలనందిస్తుంది.

**ధాత్రిఫలజాతలింగం-** దీనిని అర్చిస్తే ముక్తి కలుగుతుంది.

**దుర్వాకాండజలింగం-** గరికతో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే అపమృత్యుభయాన్ని తొలగిస్తుంది.

**కర్పూరజలింగం-** కర్పూరరజంతో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే ముక్తి కలుగుతుంది.

**ముక్తాలింగం-** ముత్యంతో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే ఇష్టసిద్ధిని కలిగిస్తుంది.

**సువర్ణనిర్మితలింగం-** బంగారంతో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే ముక్తిని కలిగిస్తుంది.

**రజతలింగం-** వెండితో తయారుచేసిన శివలింగాన్ని పూజిస్తే సర్వసంపదలను కలిగిస్తుంది.

**ఇత్తడి-కంచులింగం-** ముక్తిని ప్రసాదిస్తుంది.

**ఇనుము-సీసపులింగం-** శత్రునాశనం చేస్తుంది.

**అష్టధాతులింగం-** ఇది చర్మరోగాలను నివారిస్తుంది. సర్వసిద్ధి ప్రదం.

**వైదూర్యలింగం-** శత్రునాశనం చేయటమే కాక దృష్టిదోషాలను కూడా హరిస్తుంది.

**స్ఫటికలింగం–** సర్వసిద్ధికరం, అనుకున్న కార్యాలను సఫలీకృతం చేస్తుంది.

**సీతాఖండలింగం–** పటికబెల్లంతో తయారు చేసిన శివలింగాన్ని పూజిస్తే ఆరోగ్యసిద్ధి కలుగుతుంది.

**మరకతలింగం–** ముదురుఆకుపచ్చ రంగులో కల మరకతశివలింగాన్ని పూజిస్తే సర్వవ్యాధులు తొలగి ఆరోగ్యం సిద్ధిస్తుంది.

**పాదరసలింగం–** పాదరసంతో తయారు చేసిన శివలింగాన్ని పూజిస్తే అన్నిరకాల దోషాలనుంచి విముక్తి కలుగుతుంది. అనారోగ్యబాధలు తొలగిపోతాయి. వివాహప్రయత్నాలు సఫలమవుతాయి. దోషాలనుంచి విముక్తి కలుగుతుందని శాస్త్రాల్లో ఉంది.

ఇంతేకాక ఎవరు ఏ లింగాన్ని పూజిస్తే ఏఏ ఫలితాలు కలుగుతాయో మనపురాణాలు పేర్కొన్నాయి. బ్రహ్మవేత్తలు రస లింగాన్ని, క్షత్రియులు బాణలింగాన్ని, వ్యాపారస్తులు స్వర్ణలింగాన్ని, ఇతరులు శివలింగాన్ని పూజిస్తే సత్ఫలితాలు కలుగుతాయి. స్ఫటికలింగాన్ని ఎవ్వరైనా పూజించవచ్చు అన్నవిషయాన్ని లింగపురాణం వివరించింది.

శివశక్తులసమ్మేళనమే శివలింగరూపం. అందువల్ల ప్రచండమైన ఊర్జస్సు ఉద్భవిస్తుంది. దానివల్ల కలిగే ప్రతికూల ఫలితాలు మనపై పడకుండా ఉండేందుకు శివలింగంపై జలధారను పోస్తుండాలి. ఆ ధారనుంచి సూక్ష్మమైన ఓంకారం ఉద్భవిస్తుంది. ఇదే నిర్గుణబ్రహ్మ. ఇలా జీవుడు మంత్రపూర్వక ధారాభిషేకంద్వారా నిర్గుణ బ్రహ్మను తెలుసుకుంటాడు.

ఇవేకాక ద్వాదశజ్యోతిర్లింగాలని, పంచభూతలింగాలని, పంచారామాల లింగాలని పరమేశ్వరునికి అర్చన అభిషేకా



**శివలింగానికి ఐదు ముఖాలుంటాయి. నాలుగుముఖాలు నాలుగుదిక్కులని చూస్తుంటే, ఐదవముఖం ఊర్ధ్వముఖమై ఆకాశంవైపు చూస్తుంటుంది. ఈ ఐదుముఖాలకి ఐదుపేర్లున్నాయి. అవి-**

**1)సద్యోజాతలింగం (పశ్చిమదిక్కు)**
**2)తత్పురుషలింగం (తూర్పుదిక్కు)**
**3)అఘోరలింగం (దక్షిణదిక్కు)**
**4)వామదేవలింగం (ఉత్తరదిక్కు)**
**5)ఈశానలింగం (ఆకాశం)**

దులు చేస్తూ ఈశ్వరకృపకు పాత్రులవుతున్నారు. పవిత్రమైన భారతదేశంలో కొన్నివేల శివలింగాలను మనం దర్శించుకోవచ్చు. ఈశ్వరుడు ఐశ్వర్యప్రదాత. విభూతిధారణం వైభవాలను కలిగిస్తుంది. ఈశ్వరుడికి ప్రీతిపాత్రమైన రుద్రాక్షధారణచేయటం "యద్యత్కర్మితత్తదఖిలంశంభోత వారాధనం" అంటే మనం చేసే ఏ పనైనా ఈశ్వరుని సేవే అవుతుంది.

వందే శంభుముమాపతిం సురగురుం వందే జగత్కారణం
వందే పన్నగభూషణం మృగధరం వందే పశూనాం పతిమ్।
వందే సూర్యశశాంకవహ్ని నయనం వందే ముకుందప్రియం
వందే భక్తజనాశ్రయం చ వరదం వందే శివంశంకరమ్॥

**"ఓమ్ నమఃశివాయ"–** న మ శి వా య మంత్రం ఓంకారంతో ప్రారంభమవుతుంది. "ఓమ్ మహా బీజాక్షరం". దీనినుంచి మిగిలిన అక్షరాలన్నీ ఆవిర్భవించాయని పెద్దలు చెబుతారు. ఈ మంత్రాల్లో ఉన్న అక్షరాలకు అర్థం, పరమార్థం రెండూ ఉన్నాయి. ఈ పంచాక్షరాలను పంచభూతాలని కూడా అంటారు. "న" అంటే భూమి, "మ" అంటే నీరు, "శి" అంటే నిప్పు, "వా" అంటే గాలి, "య" అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అర్థంకు కొందరు పెద్దలు నిర్వచనం చెప్పారు. ఈ మంత్రం ఆధ్యాత్మికంగా ఉపయోగపడుతుందని, ఈ మంత్రంవల్ల నాడులు పరిశుభ్రపడి, మనస్సు ప్రశాంతం అవుతుందని పండితులు చెబుతారు.

"లోకాస్సమస్తా స్సుఖినోభవన్తు".

# కల్యాణ సంస్కృతి



– డా॥ కోగంటి వేంకట శ్రీరంగనాయకి, 98661-08214

కల్యాణాద్భుత గాత్రాయ కామితార్థప్రదాయినే ।
శ్రీమద్వేంకటనాథాయ శ్రీనివాసాయ తే నమః ॥

శ్రీనివాసమంగాపురంక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి ఫిబ్రవరిమాసంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. అందులో వివిధవాహనసేవలు, రథోత్సవం, చక్రస్నానం మొదలైన ఉత్సవాలు జరుగుతాయి. ముఖ్యంగా ఇక్కడ చెప్పుకోదగ్గ విశేషమేమంటే ప్రతిరోజూ మధ్యాహ్నం 01.00 గం॥ల సమయంలో శ్రీదేవిభూదేవిసమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి కల్యాణమండపంలో కల్యాణోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవానికిగాను ఎందరో భక్తులు హాజరై స్వామివారి కృపాకటాక్షసిద్ధిని పొందుతుంటారు. ముఖ్యంగా కల్యాణోత్సవానంతరం ప్రసాదించబడే శ్రీవారి కల్యాణకంకణాలను అవివాహితులు ధరించినట్లైతే వారికి త్వరలోనే వివాహం జరుగుతుందని ప్రతీతి. స్వామివారి కల్యాణానికి అంతటి ప్రాశస్త్యం ఉంది మరి.

అలాంటి పరంపరలోనే మానవాళికికూడా 'కల్యాణం'ను ఒక ప్రధానఘట్టంగా మన పూర్వీకులు ఏర్పాటు చేయడం జరిగింది. మంచి విలువలతో కూడిన జీవనవిధానాన్ని ఆచరించేలా చేయగలిగే కార్యక్రమం ఈ 'కల్యాణం' ఘట్టం మాత్రమేనని చెప్పకతప్పదు. మానవజీవితంలో ముఖ్యపాత్ర వహించే ఈ 'కల్యాణఘట్టం', 'సంస్కృతీ సంప్రదాయం' మరియు 'అర్థం–పరమార్థం' గురించి తెలుసుకుందాం...

కల్యాణం, వివాహం, పరిణయం, ఉద్వాహం, పాణిగ్రహణం ఇలా అనేకనామాలతో కల్యాణవైభవం వినబడుతున్నది. కల్యాణం అంటే శుభం. ఇది షోడశసంస్కారాలలో ఒకటి. ఇది వాళ్ళ వాళ్ళ సంప్రదాయాలనిబట్టి, శాఖలనిబట్టి భిన్న భిన్నం ప్రక్రియద్వారా జరుగుతూన్నా దీని పరమార్థం ఒకటే.

వివాహం అంటే విశేషంగా వహించేది. తన బాధ్యతతోపాటు తనను చేసుకొన్న వ్యక్తి బాధ్యతని విశేషంగా స్వీకరించటం. వహ= ప్రాపణే అనే ధాతువుకి 'వి' అనే ఉపసర్గని చేరిస్తే 'వివాహం' అనే పదం ఏర్పడుతుంది. అంటే కన్యని వివాహంచేసి మరొకఇంటికి పంపించటం. గృహస్థధర్మాన్ని చక్కగా నిర్వహించటం. మనకు నాలుగు ఆశ్రమాలున్నాయి. ఈ నాలుగింటిలో గృహస్థాశ్రమం ఒకటి. దీన్ని పొందాలంటే వివాహం తప్పనిసరి. గృహస్థాశ్రమధర్మాన్నే గార్హస్థ్యమని కూడా అంటారు.

అనాథలకు, కుంటివారికి, గ్రుడ్డివారికి, బ్రహ్మచారులకు, బిచ్చగాండ్రకు, తంగేటిచెట్టునందు పెట్టబడిన తేనెపట్టువంటివాడు, ఇంటివెనుక ఫలించిన కల్పవృక్షంవంటివాడు, సమీపమందలి మేరుపర్వతంవంటివాడు, తొడపై ఉన్న రూకల పెట్టెవంటివాడు, నీళ్ళులేని ప్రదేశమందలి మడుగు, బాటసారులకు చలువపందిరివంటివాడు, ఆకటివేళల ఫలించిన పైరువంటివాడు గృహస్థు. కావున 'ఓ! భూసురోత్తమా గృహస్థధర్మానికి సాటిలేదు' అని పెద్దనగారు ఈ గార్హస్థ్యధర్మాన్ని ఎంత గొప్పగానో కీర్తించారు.

పరిణీయతే ఇతి పరిణయః పరిణయం అన్నా ఇక్కడనుండీ తీసుకొనివెళ్ళేది అనే అర్థం. వివాహానికి దీనికి అర్థం ఒకటే అయినా కన్య ఇక్కడినుండి అక్కడకి వెళ్ళేవరకే. అర్థం పరిమితం. ఉద్వాహం, అధికబాధ్యత, వివాహం కానంతవరకూ బాధ్యతలేకుండా ప్రవర్తించినా వివాహంతర్వాత స్త్రీ పురుషులిద్దరూ విశేషమైన బాధ్యతని స్వీకరించవలసిందే.

'పాణిగ్రహణం' చేతిని పట్టుకోవటం. ఇది సుక్షత్రియ సంప్రదాయం. సీతారాములది పాణిగ్రహణం. జనకమహా రాజు కల్యాణమంటపంలో 'పాణిం గృహ్ణీష్వ పాణినా' అని సీతమ్మవారిచేతిని రామచంద్రమూర్తి చేతికప్పగించాడు. ఆనాటి నుండి పాణిగ్రహణం అనే పదం ప్రసిద్ధిని పొందింది.

'కల్యాణం అంటే శుభమ్'. "కల్యాణ వితనోతు" అని ఆశీర్వచనం చేస్తారు. అంటే కేవలం పెళ్ళి అని మాత్రమే అర్థం కాదు. అనేక శుభపరంపరలు అని అర్థం. శంకరభగవత్పాదులు వ్రాసిన కనకధారాస్తవంలోకూడా "కల్యాణ మావహతు మే కమలాలయాయాః" అని లక్ష్మీదేవి శుభపరంపరలని అనుగ్రహించాలి అనే అర్థంలోనే ఈ పదం కనిపిస్తుంది.

లోకంలో కల్యాణం, వివాహం అనే రెండుపదాలు బాగా ప్రసిద్ధిని పొందాయి. వివాహాలు ఎనిమిదివిధాలని స్మృతి గ్రంథాలు చెబుతున్నాయి. (1)బ్రాహ్మం (2)దైవం (3)ఆర్షం (4)ప్రాజాపత్యం (5)ఆసురం (6)గాంధర్వం (7)రాక్షసం (8)పైశాచం. ఈ ఎనిమిదివిధానాల్లో మొదటి నాల్గింటిని ధర్మశాస్త్రాలామోదించాయి. చివరి నాల్గింటినీ ఆమోదించలేదు.

ఈ ఎనిమిదివిధాలైన వివాహాలు యాజ్ఞవల్క్యస్మృతిలో కనిపిస్తాయి. ఇవేకాక హిందూసంప్రదాయంలో స్వయంవరం అనే మరొకటి ఉంది. ఇది రామాయణ, భారత, భాగవతాల్లో కనిపిస్తుంది.

ఈ ఎనిమిదివివాహాల్లో ప్రస్తుతం శాస్త్రబద్ధంగా, సంప్రదాయబద్ధంగా జరుగుతున్నవి కొన్ని మాత్రమే.

కల్యాణమనేది ఒక సంస్కారం. కల్యాణం తరువాత వధూవరులిద్దరిలో దాదాపు మంచిమార్పురావటానికి అవకాశం ఉంటుంది. వివాహమంటే మూడుముళ్ళు, ఏడడుగులు మాత్రమే కాదు. దానికి చాలా విశిష్టమైనప్రక్రియ ఉంది.

కల్యాణం కమనీయ కోమల కరైరార్ద్రాక్షతారోపణం
కన్యాదాన పురస్సరం సురుగురోర్విప్రాశిషానుగ్రహం ।
బాహ్యేఃకంకణ బంధనం దశ గుణం మాంగల్య సూత్రాన్వితం
సీతారాఘవ యోర్వివాహే సమయే దేయాదిదం మంగళమ్ ॥
సుముహూర్తే సావధానాః సులగ్నే సావాధానాః .......

అను ఈ శ్లోకం దేవుడివివాహంలో, మానవుల వివాహంలో వినపడుతుంది. మానవులవివాహాలకి, దైవవివాహాలకి కొంచెం భేదం ఉంటుంది. మంత్రభాగంకూడా కొంత వేరే. ఇందులో మళ్ళీ పాంచరాత్రాగమంప్రకారం మానవులపెళ్ళి వేరుగా ఉంటుంది. వైఖానసాగమంప్రకారం వేరుగా ఉంటుంది. స్మార్తాగమంప్రకారం వివాహవిధి వేరుగా ఉంటుంది బ్రాహ్మణులకి వేదమంత్రాలతో అయితే బ్రాహ్మణేతరులకి పురాణోక్తంగా ఉంటుంది. మంత్రాలు బ్రాహ్మణులకున్నంతగా ఉండవు.

లోకంలో పెళ్ళి అంటే కంకణంకట్టి, మూడుముళ్ళు వెయ్యటమే అని కొంతమంది భావిస్తారు. కేవలం అంతమాత్రమే కాదు. ఏ వధువునైనా వరుడికి కాళ్ళుకడిగి కన్యని ఉదక పూర్వకంగా ధారాదత్తం చెయ్యాలి. దాన్నే కన్యాదానం అంటారు. వివాహంలో అదొకభాగం, 'కన్యాదాన ముహూర్తః సుముహూర్తోస్తు' అని బ్రాహ్మణులు ఆశీర్వచనం కూడా చేస్తారు.

పూర్వకాలంలో కన్యని వివాహమాడుసమయంలో తప్ప వధూవరులు ముందుగా ఒకళ్ళనొకళ్ళు చూసుకోవటం, మాట్లాడటం ఉండేది కాదు. అందుకనే వధూవరులమధ్య తెరపట్టి సుముహూర్తసమయంలో అఘోరచక్షుషీ.... అనే మంత్రంతో వధువుని తన రెండుకళ్ళతో భర్తకి ప్రాణశక్తిని పెంచే చూపులతో చూడమని పురోహితులు చెబుతారు. అది కూడా ముందుగా ఆజ్ఞాచక్రముండే భ్రుకుటిని తరువాత నుదుటిని ఆ తరువాత మొత్తం ముఖాన్ని చూడాలి.

ఆ తరువాత సూత్రధారణ. ఇది పురుషుడి భాగ్యం మీద, స్త్రీ సౌభాగ్యంమీద ఆధారపడి ఉంటుంది. పురుషుడు మంగళసూత్రాన్ని చేతపట్టుకొని–

మాంగల్యం తంతునానేన మమ జీవన హేతునా।
కంఠే బధ్నామి సుభగే! త్వం జీవ శరదాంశతమ్॥



ఓ సౌభాగ్యవతీ! శుభకరాలైన ఈ దారాలతో నేను నీ మెడలో బంగారంతో కూడిన సూత్రాన్ని కడుతున్నాను. ఇది నా జీవనానికి ప్రధానహేతువు. నీవు సౌభాగ్యవతివై వందశరత్తులు జీవించు అని అర్థం. వధువు సౌభాగ్యవతిగా జీవిస్తే వరుడు వందసంవత్సరాలు జీవించినట్లేగా. అందుకని వివాహంవల్ల పురుషుడి ఆయుర్దాయం పెరగటానికికూడా ఎంతో అవకాశముంటుంది.

ముహూర్తసమయానికి కొంచెంముందు వరుడిచేత ప్రమాణం చేయిస్తారు. ఇప్పుడు వధువుచేతకూడా చేయిస్తున్నారు. **“ధర్మేచ అర్థేచ కామేచ త్వయైషా నాతి చరితస్యా”** అని వధువు తండ్రి కోరుతాడు. ధర్మంలో, అర్థంలో, కామంలో నీవు మా అమ్మాయిని అతిక్రమించి చరించకూడదని మామగారు కోరితే వరుడు ‘నాతిచరామి’ అంటాడు. నేను అతిచరించను అని ప్రమాణం చేస్తాడు. అలా చేసినతరువాతే జీలకర్ర బెల్లం వధువుశిరస్సుపై వరుడు, వరుడిశిరస్సుపై వధువు ఉంచటం జరుగుతుంది. ఇది వధూవరులిద్దరూ కలిసిమెలిసి ఒకరినొకరు అతిచరించకుండా ఉండటానికి చెప్పే మంత్రం. ఈ విధంగా నిజంగా సమాజం ఉంటే ధార్మికప్రవృత్తికి లోటుండదు.

ఆ తర్వాత సప్తపది. ఏడడుగులు నడిచినంతమాత్రం చేత, ఏడుమాటలు మాట్లాడినందువల్ల సఖ్యం ఏర్పడుతుందని శాస్త్రం. ఆ ఏడడుగులు మంత్రపూర్వకంగా పురోహితులు వేయిస్తారు. దీనివల్ల వధూవరులమధ్య స్నేహబంధం పెరుగుతుంది. “అందుకే సఖ్యం సాప్త పదీనం” అని పెద్దలంటారు.

కల్యాణంలో ముఖ్యమైన ఘట్టం తలంబ్రాలు. తలపై పోసుకొనే ధాన్యాన్ని తలంబ్రాలు అంటారు. ఈ తలంబ్రాలనే అక్షతారోపణం అంటారు. అక్షతం అంటే మొక్కపోనిది అని అర్థం. పూర్వకాలంలో ముత్తైదువులు ఏమాత్రం విరగని బియ్యాన్ని ఏరి తలంబ్రాలకి సిద్ధం చేసేవాళ్ళు. ఇందులోకూడా ప్రదేశాలని బట్టి సంప్రదాయంలో తేడాలుంటాయి. కొంతమంది ముత్యాల తలంబ్రాలని ముత్యాలుపొయ్యకుండా తెల్లనిబియ్యాన్ని పోసుకొంటారు. కొంతమంది శుభకరమని పసుపుకుంకుమ పుష్పాలని కలుపుతారు. ఆవుపాలతో వధువుచేతిని, వరుడిచేతిని శుద్ధిచేసి ఆ తరువాత కొబ్బరి చిప్పతో అక్షతలుపోసి వధువుదోసిలిపై వరుడిదోసిలి ఒక సారి, వరుడిదోసిలిపై వధువుదోసిలి మరొకసారి ఉంచి మంత్రాలు చెప్పిస్తూ ఒకరితలపై మరొకరిచేత పోయిస్తారు. ఈ తలంబ్రాలని పోసుకొనేటప్పుడు వధూవరులిద్దరూ ఒకవిధంగా ధర్మబద్ధంగా కోరికలు కోరుకుంటారు. మొక్కవోని అక్షతలవలె వాళ్ళకోరికలుకూడా మొక్కపోకుండా సిద్ధించాలని పెద్దల ఆశయం.

**ధర్మో మే కామః సమృద్ధ్యతామ్**
**పశవో ధియో మే కామః సమృద్ధతాయ**
**యజ్ఞో మే కామం సమృద్ధ్యతా**
**శ్రియో మే కామః సమృద్ధ్యతామ్**

ఇలా మంత్రాలననిపిస్తూ పోయిస్తారు. ఈ మంత్రాలని అనిపించటానికి ముందు దోసిలిపై కలశాన్నుంచి పురోహితులు వేరేమంత్రాలని చదువుతారు. బ్రాహ్మణులకైతే స్థాలీపాకం, నాగవలి (నాకబలి) సదస్యం అనే ప్రత్యేక కార్యక్రమాలుంటాయి.

కల్యాణసంస్కృతి అనేది ఒక అద్భుతమైన వ్యవస్థ. హిందూధర్మంప్రకారం స్త్రీపురుషులకలయిక శాస్త్రబద్ధంగా జరిగే ప్రక్రియ. ఈ ప్రక్రియ సక్రమంగా సాగినంతకాలం దేశంలో అధర్మం ప్రబలదు.



కల్యాణసంస్కృతి సక్రమంగా నిర్వహింపబడినప్పుడు ఆ కుటుంబం, ఆ కుటుంబం ఉన్న గ్రామం, రాష్ట్రం, దేశం అన్నీకూడా సుభిక్షంగా ఉంటాయి. ఈ సంస్కృతిని నిలబెట్టటానికే శ్రీనివాసుడు పద్మావతిని శాస్త్రబద్ధంగా కల్యాణం చేసుకొని అగస్త్య మహర్షిఆజ్ఞతో ఆరుమాసాలున్న కారణంగా కల్యాణవేంకటేశ్వరుడుగా నిలిచి నేటికీ నిత్యకల్యాణాలనందుకొంటూ కల్యాణసంస్కృతిని చాటుతున్నాడు.



# తిరుమల సమయాచారములు

## (తిరుమల–తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

శ్రీవేంకటేశ్వరుడును, శ్రీగోవిందరాజస్వామియు వేర్వేరు చోట్ల ప్రతిష్ఠితులైయున్నను శ్రీవైఖానసాగమమునందు ఏక సంహితాసిద్ధములగు నిత్యారాధనోత్సవాదులు స్వీకరించుటచేత ఒకే దేవాలయమున విజయము చేసియుండు పంచబేరములకు వలె ఐక్యమే తోచెడి రీతిగను శాసనము చేసెను. శ్రీగోవిందరాజ స్వామికిని, శ్రీవేంకటేశ్వరస్వామికిని మంగళాశాసనపరులై యుండు పెద్దలైన పరమభాగవతులకు శ్రీగోవిందరాజస్వామి గుడికి ఉత్తరపుదిక్కున శ్రీవీధి నిర్మింపజేసి 'శ్రీరామానుజపుర' మను పేరిడి అందువారలు నిత్యవాసము చేయుటకు తగినట్లు క్షేత్రారామాదులనిప్పించిరి. ఈ విధముగ శ్రీభగవద్రామానుజా చార్యులు తిరుమల–తిరుపతులందు అనేక భగవద్దర్శనములను, శ్రీవైష్ణవధర్మములను ప్రవర్తిల్లజేసి, పిదప శ్రీరంగమునకు పోవు టకై బయలువెడలి పెరుమాళ్‌కోవెలకు (కాంచీపురమునకు) విజయము చేసిరి.

"శేషో వా సైన్యనాథో వా శ్రీపతిర్వేతి సాత్త్వికై,
ఇతి సర్వైర్వితర్క్యాయ యతిరాజాయ మంగళమ్."

(ఆదిశేషుడో, విష్వక్సేనుడో, సాక్షాద్విష్ణుదేవుడో అని సాత్త్వికులందరిచేతను ఉల్లేఖింపదగినట్టి యతిరాజునకు మంగళమగుగాక!) అనియు,

"పాషండద్రుమషండ దావదహన శ్చార్వాకశైలాశనిః,
బౌద్ధధ్వాంతనిరాసవాసరపతి ర్జైనేభకంఠీరవః.
మాయావాదిభుజంగభంగ గరుడ స్త్రైవిద్యచూడామణిః,
శ్రీరంగేశ జయధ్వజో విజయతే రామానుజోఽయం మునిః"

(పాషండులను వృక్షసముదాయమునకు దావాగ్నియైన వాడును, చార్వాకులను శైలములకు వజ్రాయుధమైనవాడును, బౌద్ధులను చీకట్లను పారద్రోల సూర్యుడైనవాడును, జైనులను దంతావళములకు సింహమైనవాడును, మాయావాదులు (శాంకరాద్వైతులు) అను సర్పములకు గరుడస్వరూపుడును, త్రైవిద్యకు (వేదవిద్యకు) శిరోరత్నమైనవాడును, శ్రీరంగనాథ స్వామికి విజయధ్వజమైనవాడును అగు ఈ రామానుజయోగి సర్వశ్రేష్ఠుడై వెలుగొందుచున్నాడు.)

అని చెప్పెడురీతిగ సకలచేతనుల నుజ్జీవింపజేయ శ్రియఃపతి– శేష– సేనాధిపతుల యవతారమోయనునట్లు దివ్యా వతారముగలవారై వైదికసార్వభౌములైన శ్రీభగవద్రామాను జాచార్యులు–

"శుకాద్యా మునయః కేచిత్ భృగ్వాద్యాశ్చ తపోధనాః
ప్రహ్లాదప్రముఖాః పుణ్యాః అంబరీషాదయో నృపాః.

విష్ణోరేవాపరం దేహం మన్వానా స్తం నగోత్తమమ్,
వద్భ్యామాక్రమితుం భీతాః పర్యంతేష్వేవ వర్తినః.

తన్నిర్గత నదీష్వేన కుర్వాణాః స్నానతర్పణే,
తపః కుర్వంతి వాంఛంత స్సాక్షాత్సర్తుం జనార్దనమ్."

(కొందరు శుకుడు మున్నగు మునులును, భృగువు మొదలగు తాపసులును, ప్రహ్లాదాదులగు పుణ్యశీలురును, అంబరీష ప్రభృతులగు ప్రభువులును ఆ పర్వతమును శ్రీవిష్ణు మూర్తియొక్క దేహాంతరముగానే తలచుచున్నవారలై ఆ కొండ వాగులందే స్నానతర్పణము లొనర్చువారై జనార్దనుని సాక్షాత్క రించుకొను తలంపు గొన్నవారై తప మాచరించుచున్నారు.)

(ఇంకా ఉంది)

# ఆదిభిక్షువు ఆయుధాల పరమార్థం

- డా॥ నల్లాన్ చక్రవర్తుల సుధామైథిలి, 82475 78748



**ఆహార్యం-విశ్లేషణ-** సర్వదా సదాశివుణ్ణి మనం అరూపరూపిగా అంటే లింగరూపంలో చూస్తాం. కానీ మనపెద్దలు శివుణ్ణి మానవరూపంలో చూపే సందర్భంలో ఆతని ఆహార్యానికి ఎంతో విలక్షణతను ఇచ్చారు. మన హిందూధర్మంలో ఒకదేవతకు ఏదైనా ఒకరూపం ఇచ్చినప్పుడు, అది వారి ప్రత్యేకతను చాటటమే కాకుండా ఆ దేవత సర్వమానవాళికి ఇవ్వవలసిన, ఇవ్వగలిగిన వరాలు లేదా చేయగలిగిన కార్యాలను ఒక చిన్న అమరికద్వారా చెప్తారు. అలాగే పరమశివుని..

**కమండలుధరో ధన్వీ బాణహస్తః కపాలవాన్ ।**
**అశనీ శతఘ్నీ ఖడ్గీ పట్టిశీ చాయుధీ మహాన్ ॥**

మొదలైన ఆయుధాలు ధరించినవాడిగా యోగులు దర్శించారు. ఈ ఆయుధాలు దుష్టశిక్షణకు, శిష్టరక్షణకై చిహ్నంగా ఈశ్వరుడు ధరించి ఉన్నాడు.

శివుని ఆకారం మనకు సదా ధ్యానమగ్నుడై, చంద్ర మరియు సర్పాభరణభూషితుడై, తలపై గంగమ్మతో, పరచి ఉన్న జటాజూటంతో, ఒంటినిండా విభూతి రాసుకుని, నుదుటిన మూడవకన్నుతో, మెడలో పుర్రెలమాల (కొన్నిచోట్ల), చేతిలో త్రిశూలం, డమరుకం ధరించి, నీలికాంతులు వెదజల్లుతున్న దేహంతో, పులి లేదా ఏనుగుచర్మం ధరించి శివుడు దర్శన మిస్తాడు.

**శూలం వజ్రం చ ఖడ్గం**
**పరశుమభయదం దక్షాభాగేవహస్తం..!!**

అంటూ ఆయుధధారిగా మహర్షులు లయకారుణ్ణి వర్ణించారు. దుష్టశిక్షణకూ, శిష్టరక్షణకూ, లోకసంక్షేమంకోసం ఆయుధధారి ఐన ఆ లోకనాథుని కొన్ని ఆయుధాలగురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

**త్రిశూలం-** ఇది శివుని ఆయుధం. అజ్ఞానాన్ని అంతమొందిస్తుంది. శూలం అంటే సకలబాధలను తొలగించేది. శివుడు త్రిగుణాతీతుడు (సత్వ రజః తమోగుణాలకు అతీతుడు). త్రికాలాలకు (భూత భవిష్యత్ వర్తమాన) అధిపతి. త్రిస్థితులకు (జాగ్రుత్, స్వప్న, సుషుప్తి) అధినేత. త్రితాపాలను (ఆదిదైవిక, ఆదిభౌతిక, ఆధ్యాత్మిక) పోగొట్టేది అని అర్థం. త్రిశూలానికి

'శం' అంటే శాశ్వతానందం, 'ఇ' కారం పురుషుడు, 'వ' కారం శక్తి, అమృతం. వీటి కలయిక 'శివ' మనబడుతుంది. ఆ విధంగా ఏర్పడిన శివశబ్దానికి శుభం, మంగళప్రదం అనే అర్థాలున్నాయి.

అట్టి శివతత్త్వం మూర్తీభవించినవాడు 'శివుడు'. అనగా శుభప్రదుడు, మంగళకరుడు అని అర్థం. అవ్యక్తుడైన పరమాత్మ బ్రహ్మాదిదేవతల కోరికమీద సేవించుకునేందుకు వీలుగా తన లింగస్వరూపాన్ని వారికి అనుగ్రహించాడు.

శివుడు జననమరణాలకు అతీతుడు. కాలతీతుడు అనగా కాలమునకు వశం కానివాడు. అందుకే సదాశివుడు అంటాం. అంతయు శివుడే కాబట్టి అందరుదేవతలు శివారాధకులే. విష్ణువు, బ్రహ్మ, ఇతరదేవతలు సదా శివలింగారాధన చేస్తుంటారు. పరమశివుడు అనగా అంతటా ఉండేవాడు. శివుడు ఎంతవరకు విస్తరించాడో కనుక్కోవటం విష్ణువు, బ్రహ్మలకు కూడా అసంభవమైనది.

మూడుకొనలుండి అడుగున వాటిని కలుపుతూ శూలహస్తం ఉంటుంది. మూడుకొనలు సత్వ, రజః, తమోగుణాలను సూచిస్తే ఆ శూలహస్తం వాటి ఏకత్వాన్ని సూచిస్తుంది. ఇక్కడ త్రిగుణాల ఏకత్వం అంటే వాటికి అతీతమైన తత్త్వం అని అర్థం. అంతే కాకుండా ఇడ, పింగళ, సుషుమ్నానాడులు మూడూ శిరస్సులోని జ్ఞానకేంద్రందగ్గర కలుస్తాయి. దీన్నే త్రివేణిసంగమం అంటారు. ఆ మూడునాడులు మూడుకొనలని సూచిస్తే, జ్ఞానకేంద్రం శూలహస్తాన్ని, వాటి ఏకత్వం త్రిగుణసంగమాన్ని సూచిస్తుంది.

**డమరుకం–** ఆకాశం శబ్దగుణంతో కూడుకొని ఉంటుంది. ఆకాశంలో ధ్వనులప్రకంపనలు ప్రయాణం చేస్తుంటాయి. మనం పవిత్రమైనమంత్రాలను శ్రద్ధాసక్తులతో చదివేటప్పుడుకాని, వినేటప్పుడుకాని వాటినుండి మధురమైన డమరుకనాదం వినిపిస్తుంది. యోగులకు ఇది మహదానందాన్ని కలిగిస్తుంది. దీన్ని సూచిస్తూ శివుని త్రిశూలానికి డమరుకం కట్టబడి ఉంటుంది. ఈ సృష్టి వస్తూపోతూంటుంది అని స్థూలంగా చెప్పటం ఈ దీని ఆకారం ఆంతర్యం... అంతేకాకుండా దీని ఆకారం అనంతానికి ప్రతీక. ఇది సృష్టి మొదటిశబ్దాన్ని (ప్రణవమును) పలికింది. కనుక ఇది శబ్దానికి ప్రతీక. ఈ సృష్టిలో సర్వం ఈ శబ్దానికి చెందినదే..

**శివధనుస్సు–** ఇది హిందూపురాణాలప్రకారం పరమశివుని దివ్యాయుధం. దీనితోనే శివుడు దక్షునియజ్ఞాన్ని సర్వనాశనం చేశాడు. దేవతలందరూ కలిసి శివుణ్ణి మెప్పించి ఈ ధనుస్సును సంపాదించారు. ఆ తరువాత దేవతలు మిథిలానగరానికి రాజైన దేవరాతుడికి యజ్ఞఫలంగా బహూకరించారు. దీనికి పినాకం అని పేరు. ఈ శివధనుస్సును శివుడు త్రిపురాసురుని సంహరించడంకోసం సృష్టించాడు. ఈ త్రిపురాసురుడు ఒక జీవుణ్ణి ప్రతిబింబిస్తాడు అని అంతరార్థం ఉంది. అదెలా అంటే, త్రిపురాసురుడు పాలించే మూడుపురాలు అయినటువంటి కంచు, వెండి, బంగారములు వరుసగా జీవియొక్క స్థూల(విశ్వ), సూక్ష్మ(తైజస), కారణ(ప్రాజ్ఞ) శరీరాల్ని ప్రతిబింబిస్తాయి.

స్థూలశరీరం అంటే బాహ్యంగా ఈ విశ్వానికి కనిపించే శరీరం. జీవుడు ఈ శరీరంలో ఉన్నప్పుడు విశ్వుడు అంటారు. ఈ దేహానికి కంచులాగా విలువ లేదు. సూక్ష్మశరీరం అంటే కలలో ఉన్నప్పుడు మనకి కనిపించే శరీరం. అది కేవలం ఆలోచన తప్ప అక్కడ ఒక కాయం అన్నది ప్రస్ఫుటంగా ఉండదు. జీవుడు ఈ శరీరంలో ఉన్నప్పుడు తైజసుడు అంటారు. ఈ శరీరం వెండిలాంటిది. కారణశరీరం అంటే నేను, నాది అనుకునేది లోపల ఏదయితే ఉందో అది. దీనినే అంతరాత్మ అంటారు. ఇది ఒకరూపంకోసంమాత్రమే పై రెండురకాల శరీరాలమీద ఆధారపడుతుంది. జీవుడు ఈ శరీరంలో ఉన్నప్పుడు ప్రాజ్ఞుడు అంటారు. ఇది బంగారంలా చాలా విలువయింది. శివుడు ప్రణవమనే ధనుస్సుతో, ఈ మూడు పురాలు అనబడే మూడురకాల శరీరాలని ఒకేసారి ఛేదించాడు. అప్పుడే త్రిపురాసురుడు అనబడే ఈ జీవుని సంహారం జరిగి మరుజన్మ ఉండదు.

ఈ మూడేకాక, మహాకారణశరీరం అని ఒకటి ఉంది. అది అందరూ గాఢనిద్రలో అనుభవించే స్థితి. దీనినే తురీయావస్థ అంటారు. ఈ స్థితిని మనం గుర్తించగలిగి ఆ పరమాత్మలో లయం అవటాన్నే మోక్షం అంటారు. జీవుడిని ఆ మోక్షానికి చేరువ చేసేదే ఓంకారం అన ధనుస్సు.

**పాశం–** ఈశుడు పాశాన్ని పై ఎడమచేత్తో పట్టుకుని దర్శన మిస్తుంటాడు. రాగద్వేషాలను అదుపులో ఉంచుకోమని స్వామి వారిచేతిలోఉన్న పాశం మనకు అవగతపరుస్తోంది. ఈ పాశం మనకు ఆయన అవతారాల్లో పలువిధాలుగా గోచరిస్తుంటుంది. కొన్ని సందర్భాల్లో నాగపాశంగాకూడా కనబడుతుంటుంది.

**అంకుశం–** స్వామి చేతిలో ఉన్న అంకుశం మనకు దిశానిర్దేశం చేస్తున్నట్లుగా ఉంటుంది.

**పరశువు–** ఇది మనలోని చెడుభావాలను దూరంగా ఉంచమని చెబుతుంది.

**బాణం–** 'బాణహస్తాయనమః' అని శివునినామం. చేతిలోని బాణం, మనలను చీకటినుండి వెలుగులోకి పయనించమని చెప్తోంది.

**ఖడ్గం–** స్వామివారి ఖడ్గం మనమనసులో తలెత్తే చెడు ఆలోచనలను మొగ్గలోనే తుంచేయమని చెప్తోంది.

ప్రదోషసమయంలో పరమేశ్వరుని పూజించినా, స్మరించినా, ధ్యానంచేసినా సత్వరమే అనుగ్రహించి కటాక్షించగల దయామయుడు.

# ధర్మరీతి! భీష్మనీతి!!

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి, 99890 63761

శ్రీకృష్ణపరమాత్ముని భక్తులలో భీష్ముడు అగ్రగణ్యుడు. కృష్ణతత్త్వాన్ని అర్థంచేసుకొన్న మహాత్ములలో మున్నెన్నదగినవాడు భీష్ముడే. కృష్ణుడిరూపంలో విష్ణువుని సందర్శించగలిగిన ఆత్మజ్ఞాన సంపన్నుడు. భీష్ముడికి కృష్ణుడెంతో కృష్ణుడికి భీష్ముడూ అంతే. ఆయనపేరుమీద ఒక ఏకాదశి ప్రతిష్ఠితమైతే, ఒకవ్రతంకూడా పేర్కొనబడటం విశేషం. అవే-భీష్మైకాదశి, భీష్మపంచకవ్రతము- అనేవి. భీష్ముడిఔన్నత్యాన్ని, ధర్మాచరణను, జ్ఞానసంపత్తిని పాండవులకు వర్ణించి మరీ చెప్పాడు శ్రీకృష్ణుడు. అదే జీవుడికీ, దేవుడికీ ఉన్న అవినాభావసంబంధం. శ్రీకృష్ణుని పరమభక్తితో పూజించటమే తన మతమని (అభిమతమని), ఆ పూజచేయడమే ఉత్తమోత్తమధర్మమని ఒకసందర్భంలో భీష్ముడే ధర్మరాజుకు తెలియజెప్పాడు. శ్రీకృష్ణుడిపట్ల ఆయనకున్న మనోభావం అనిర్వచనీయం. "ఆ వాసుదేవుడు జగత్తు అంతటికీ ఆధార భూతుడు. అంతేకాదు. ముల్లోకవాసులచేత ఆరాధింపబడేవాడు. సమస్తసృష్టినీ తనలో ధరించినవాడు. సజ్జనరక్షకుడు, దుర్జన శిక్షకుడు అయిన ఆ శ్రీకృష్ణుని ఒక్కడిని పూజిస్తే లోకాలన్నింటినీ పూజించినట్లే అవుతుందని" భీష్ముడు రాజసూయయాగంలో ఆ జగదీశ్వరేశ్వరునిమహిమను నోరారా అభినుతించాడు. ధర్మ రాజుతో కృష్ణతత్త్వాన్ని వర్ణిస్తూ "నాకు కృష్ణుడంటే ఎవరో తెలుసు" అని ఘంటాపథంగా నొక్కి వక్కాణిస్తూ ఆ పరమాత్ముడే సృష్టిస్థితి లయకారుడు, యజ్ఞపురుషుడు, యజ్ఞఫలదాత, వేదాలు నిర్వచించిన పరబ్రహ్మ, సమస్తభూతరాశి- అన్నీ తానే, తానే అన్నీ అయిన పరంజ్యోతి" అని చెప్పిన విషయం భీష్ముని పరతత్త్వ అవగాహనకు దర్పణంగా నిలుస్తుంది.

భీష్ముడికి విష్ణునామాలకు ఉన్న బంధం తులతూచ లేనిది. శ్రీకృష్ణనామస్మరణలో, చింతనలో, సందర్శనంలో భీష్ముడు పొందే సంతృప్తి పదాలకందనిది.

సంగ్రామం చేసి చేసి బాగా అలసిపోయిన భీష్ముడు తన మరణరహస్యాన్ని తానేచెప్పాడు. శిఖండి వేస్తున్నట్లుగా అర్జునుడిచేత బాణప్రయోగం చేయించాడు. ఆ బాణపుతాకిడికి చేతిలోని ధనుర్బాణాలను జారవిడిచి మెల్లగా ఒరిగాడు. ఆ ఒరగటంలో ఆ మహానుభావుడు నేలమీదకు పడిపోలేదు. తన శరీరంలో అంగుళం అంగుళం గుచ్చుకున్న వేలాదిబాణాలు కూడి అంపశయ్య కాగా దానిమీద వాలాడు. అమితబాధను కలిగించే బాణాలపరుపుమీద ఐదురోజులపాటు సేదదీరిన మహావీరుడు భీష్ముడు తప్ప వేరొక్కడు ఏ యుగంలోనూ లేడు. అందుకే ఆయన ఇప్పటికీ వేనోళ్ళ కీర్తింపబడుతున్నాడు. ఉత్తరాయణపుణ్యకాలం రావాలి. తాను ప్రాణత్యాగం చేయాలి. అదే ఆయనకోరిక. ఆ కోరిక సఫలం కావటానికి తండ్రి ఇచ్చిన వరం తోడ్పడింది. ఎంతో బాధను భరించాడు. అంతయాతన లోనూ భీష్ముడు కృష్ణధ్యానం వీడలేదు. అందుకే పరమాత్ముని దయకు పాత్రుడైనాడు. తృటిలో ఆ భక్తుని బాధనంతటినీ తొలగించాడు శ్రీకృష్ణుడు. భీష్ముడికి ఉన్న జ్ఞానమంతా ప్రజానీకానికి, ముఖ్యంగా ధర్మరాజుకు తెలియాలనే ఉద్దేశ్యంతో, యుగయుగాలపర్యంతం ఆ జ్ఞానం నిలిచిపోవాలని భావించి ధర్మరాజుకు సమస్తశాస్త్రాలు కూలంకషంగా బోధించుమని భీష్ముణ్ణి ఆదేశించాడు. శ్రీకృష్ణుని ఆజ్ఞను పాటించి ధర్మశాస్త్రాలు, నీతిశాస్త్రాలు, పాలనాశాస్త్రం, రాజనీతి, అతిథిసత్కారాలు, గృహనిర్వహణ, యజ్ఞయాగాలు- ఒకటేమిటి సమస్తం సోదాహ రణంగా బోధించి భీష్ముడు- భీష్మాచార్యుడిగా ప్రఖ్యాతిచెందాడు. భీష్ముడు బోధకుడు. ధర్మరాజు నేర్చుకొనేవాడు. శ్రీకృష్ణుడు సర్వసాక్షిగా ఉన్న పరమాత్ముడు. ఆ భగవంతుడి ఆదేశం ప్రకారం ధర్మరాజుకు జ్ఞానబోధ చేశాడు. భగవత్తత్త్వాన్ని తెలియ జెప్పాడు. భగవానుడైన శ్రీకృష్ణునిగురించి ఎలా జపించాలో చెప్పాడు. ఆ వాసుదేవుని ఒక్కొక్కనామంతో వినుతిస్తూ తనజన్మ సార్థకం చేసుకొన్నాడు. భీష్ముడు కృష్ణుణ్ణి మనసులోనే కొలుస్తూ స్తుతించిన నామాలు సహస్రసంఖ్యలో వెలుగులీనాయి. ఎన్ని యుగాలైనా విష్ణుసహస్రనామాలు భారతీయుల నాలుకలపై నుండి చెరిగిపోవు. ఒక్కొక్కనామం ఒక్కొక్క మహత్తరశక్తి గలది. దేవదేవుడు జగత్ప్రభువు. అనంతుడు, పురుషోత్తముడు, అవ్యయుడు, ఆద్యంతరహితుడు, సర్వధర్మాలు తెలిసినవాడు. లోకనాథుడు అయిన విష్ణుమూర్తిని శ్రద్ధాభక్తులతో కొలిస్తే సమస్తదుఃఖాలు తొలగిపోతాయన్నాడు. ఆ కమలాక్షుని సేవే ధర్మాలన్నిటిలో అత్యుత్తమమైన ధర్మమని భీష్ముడు తెలియ

జెప్పాడు. విష్ణుసహస్రనామాలయొక్క వైశిష్ట్యాన్ని మరింత స్పష్ట పరిచాడు. పరంజ్యోతి, పరంబ్రహ్మ, పవిత్రమూర్తి, ఆశ్రయ భూతుడు, మంగళదాయకుడు, చరాచర సృష్టికర్త, లయకారుడు, దేవతలకు దేవుడైనవాడు, సర్వప్రధానుడు, పురుషోత్తముడు అయిన శ్రీమహావిష్ణువుయొక్క వేయినామాలు ప్రాణుల సమస్తపాపాలను పోగొడతాయి. విశ్వంబు, విష్ణుండు, వషట్కా రుండు- అనే ప్రసిద్ధనామాలతో మొదలయ్యే విష్ణుసహస్రం- సర్వప్రహరణాయుధుండు అనే నామంతో ముగుస్తూ ముముక్షువు లందరికీ ఆపన్నివారకంగా, ముక్తిదాయకంగా, సకలలోకహిత కారకంగా మనసులో నిలిచిపోతుంది. ఆత్మజ్యోతిప్రకాశానికి దారి చూపుతుంది. విష్ణుసహస్రనామాలను నిత్యం పఠిస్తే వారికి కలిగే సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, కీర్తి అనంతాలు. ఎవరేది కోరితే వారికది లభిస్తుంది. ధర్మరాజుకు విష్ణుసహస్రనామాల ప్రాభవాన్ని తెలియజెప్పిన భీష్ముడు వెను వెంటనే విష్ణునామకీర్తనలో మునిగిపోయాడు. కృష్ణధ్యానం చేస్తూనే- ఉత్తరాయణం పుణ్యకాలంకోసం ఎదురుచూడసాగాడు కురుకుల పితామహుడు.

ఆ సమయం రానే వచ్చింది. మాఘశుద్ధఅష్టమినాడు ఉత్తరాయణపుణ్యకాలం ప్రవేశించింది. భీష్ముడు బంధువులు, మహర్షులదగ్గర సెలవు తీసుకొన్నాడు. శ్రీకృష్ణునివైపుచూసి ప్రాణత్యాగానికి అనుమతి ఇమ్మని కోరాడు. దేవదేవుడు భక్తుడి మొఱ ఆలకించాడు. భీష్ముడికి దేహత్యాగం చేసి తనలో లీనమై పోవటానికి అంగీకారాన్ని తెల్పాడు. నిత్యం కృష్ణదర్శనంతో (భావనలో) తనివిచెందే భీష్ముడు అంత్యకాలంలో కూడా కృష్ణుని చూస్తూ, కృష్ణనామాన్ని జపిస్తూ, కృష్ణధ్యానంతో ప్రాణాలు వదిలాడు. భీష్ముడిప్రాణాలు శరీరంనుంచి పైకి పోతుంటే, శరీరంలో గుచ్చుకొన్న బాణాలు క్రింద పడిపోవడం చూసిన కృష్ణుడే ఆశ్చర్యపడ్డాడు. ఇక పాండవులసంగతి, వ్యాసాది మునులసంగతీ చెప్పనే అక్కరలేదు. భీష్ముడిఒంటికున్న గాయా లన్నీ మటుమాయమైపోయాయి.

భీష్ముడు ప్రాణపరిత్యాగం చేసింది- మాఘశుద్ధ అష్టమి నాడు అయితే, దేహాన్ని వదిలి శ్రీకృష్ణుడిలో ఐక్యం చెందింది మాఘశుద్ధఏకాదశి. ఈ రెండుతిథులూ పుణ్యప్రదాలే. భీష్మ ఏకాదశినాడు విష్ణుసహస్రనామాలు పారాయణచేస్తే సమస్త వాంఛలూ నెరవేరడమేకాక మోక్షంకూడా లభిస్తుందన్నది ఆర్యుల వాక్కు. పుణ్యాత్ముడైన భీష్ముని మాఘశుద్ధఅష్టమినాడు, ఏకాదశి నాడు పూజిస్తే- అటువంటివారి కష్టాలన్నీ ఈడేరుతాయన్నది విష్ణుభక్తులవిశ్వాసం. ఏకాదశితిథి విష్ణుమూర్తికి మిక్కిలి ప్రీతి కరమైనది. మాఘశుద్ధఏకాదశి భీష్మఏకాదశి అని నియమిం చింది కూడా శ్రీకృష్ణుడే అని చాలామంది నమ్మకం.

భీష్మఏకాదశిని జయఏకాదశి అనికూడా పిలుస్తారు. భీష్ముడు- ఆత్మత్యాగం చేసిన తిథికి అంత ప్రాముఖ్యం ఉంది. ఆనాడు భక్తులు భీష్మ భగవానుడికి తర్ప ణాలు కూడా వదులు తారు.

అంత పుణ్య ప్రదమైన భీష్మైకాదశి నాడు అందరం విష్ణు సహస్రనామస్తోత్రం చేసి భీష్ముడికి నమస్క రిద్దాం. పాపాలు తొల గించుకుని పుణ్యుల మౌదాం.



# మహాశివరాత్రి జాగరణ విశిష్టత!

- శ్రీ ఎల్. ప్రఫుల్లచంద్ర,
63005 46700

మహాశివరాత్రి పరమపవిత్రమైనది. జాగరణ అనేది ఒక విశిష్టమైనది. మహా అంటే గొప్పది. శివరాత్రి మనిషి మనసుకు జ్ఞానం కలిగిస్తుంది. మహా శివుడికి అత్యంత ఇష్టమైనది శివరాత్రి కనుక మహాశివరాత్రిగా భావించి ఈ రాత్రి భక్తిభావంతో ఆధ్యాత్మికత కలిగిందిగా భావిస్తారు. ముఖ్యంగా జాగరణ అనగా మేలుకొని ఉండడం కానీ, కళ్ళు తెరచి ఉండడం కానీ కాదు. మన మనసులో ఉన్న దుర్గుణాల నిర్మూలన కోసం ఉద్దేశించిందే ఈ శివరాత్రి. దైవ నామస్మరణతో కూడిన పరమపవిత్రమైనది మహాశివరాత్రి అని అంటారు. "ఓమ్ నమః శివాయ" అన్న శివపంచాక్షరీనామ జపంతో జాగరణ కార్యక్రమం నిర్వహిస్తే ముక్తి, భక్తి, శక్తి, మోక్షం లభిస్తాయి.

పరమశివుని నామజపంతో దైవ సంబంధమైన శక్తులను పొందగలుగుతారని ప్రాచీనకాలంనుండి ప్రతీతి. జ్ఞానం అనే జాగరణతో అజ్ఞానం అనే చీకట్లు తొలగించుకోవాలి. అదే శివరాత్రి పరమార్థం. యోగం, ధ్యానం, శివనామ జపంతో మహాశివరాత్రిజాగరణ నిర్వహించాలి. జ్యోతిర్లింగదర్శనం భాగ్యం కలిగించేంతటి పుణ్యప్రదం ఈ శివరాత్రి యోగ భాగ్యం.

ఈ శివరాత్రినాడు జాగరణ ఏమిటి? ఎందుకు? అన్న సందేహం అందరికీ కలుగుతుంది. శివనామస్మరణతో చేసే జాగరణవల్ల ఈ రాత్రి అంతటా విశ్వ జ్ఞానం వికసిస్తుంది. మనిషిలోని అహంకారం, అజ్ఞానం పారద్రోలి విజ్ఞానచైతన్యం కలిగిస్తుంది. అదే శివరాత్రి జాగరణ విశిష్టత. రాత్రంతా మేలుకోవడం అనేది భక్తిచింతనతోనే గడపడం. ఇతరవ్యాపకాలు వదులుకోవడంలాంటివి. అదే ఈ మహాశివరాత్రి పరమపదసోపానం. ఇందువల్ల జ్ఞానసౌభాగ్యం కలుగుతుందని భావిస్తారు.

పరమశివుడు ఆదిశంకరుడు. సకల లోకైక జగదీశ్వరుడు. విశాలవిశ్వానికి అధిపతి. మహాశివరాత్రి పర్వదినంనాడు ఉపవాసంతో కూడిన జాగరణ అవసరం. ఉపవాసంవల్ల శరీరఆరోగ్యం బాగుపడుతుంది. వృద్ధాప్యంభారం తగ్గుతుంది. ఈ దీక్షవల్ల మనశరీరానికి కావలసిన గ్లూకోజ్, ఎమినోయాసిడ్లువంటివి లభిస్తాయి. ఈ విషయం శాస్త్రీయ పరిశోధనలవల్ల మనకు తెలిసింది. విశ్వ జగతిలో మానవసృష్టి ఒక అద్భుతం. సకలచరాచరసృష్టిలో శివకేశవులను ఆరాధించడం ఆదినుంచి వచ్చింది. ఓంకార స్వరూపం పరమశివుని ప్రతిరూపం అనే అందరూ గ్రహించాలి.

ముఖ్యంగా మహాశివరాత్రి పర్వదినం రోజు ఉపవాసం, దీక్షతోబాటు జాగరణ దీక్ష మహాపుణ్యప్రదం. శరీరఆరోగ్యం వికసించడానికి ఉపవాసం ఎంతో ఉపయోగపడుతుంది. మహాశివరాత్రిపర్వదినం శుభసమయాన ఉదయం ఉపవాసం రాత్రి జాగరణదీక్ష చేస్తారు కొందరు. మరికొందరు ఉదయం భక్తితో ఆరాధించి రాత్రి జాగరణ, ఉపవాసదీక్ష ఆచరిస్తారు. ఏది చేసినా పరమశివునికి ప్రీతిపాత్రమే. మహాశివరాత్రి పండుగరోజున జాగరణ, ఉపవాసం, భక్తిశ్రద్ధలతో ఆరాధన, శివ లింగార్చన, అభిషేకం చేయడం శివభక్తికి నిదర్శనం. ఆ కోవలోనే ఒక వేటగాడు వేటతో విసిగి ఒక చెట్టెక్కాడు. ఆ చెట్టు క్రిందున్న శివలింగాన్ని తనకు తెలీకుండానే జాగరణ, ఉపవాసంతో అర్చించి శివ సాయుజ్యాన్ని పొందాడు.



మహాశివరాత్రి ముక్తిప్రదం, పరమ పదసోపానం అని అందరూ గ్రహించాలి. ఈ శివరాత్రిని ఇంద్రియనిగ్రహంతో స్వాగతించాలి. అప్పుడే ఈ శివరాత్రికి పరమార్థం చేకూరుతుంది. భక్తిదాయకం, ముక్తిదాయకం అయిన మహాశివరాత్రి పర్వదినం సకలలోకైక పుణ్యదినం...



జ్ఞానమనే జాగరణ అజ్ఞానమనే చీకట్లను తొలగిస్తుంది

# మాఘమాసం నియమాలు

**– శ్రీ మహాభాష్యం నరసింహారావు,**
***99850 14751.***

మాఘమాసం చాలా పవిత్రమైనది. దైవీశక్తి అనుగ్రహాన్ని పొందడానికి తగిన అనుష్ఠానాలు చేయదగ్గ మాసమిది. ఈ మాసమంతా నియమంగా ఏదైనా పారాయణం, జపం లేదా అర్చనవంటివి చేస్తే విశేషఫలితం లభిస్తుంది.

అఘము అనగా పాపము, అజ్ఞానమనే మృత్యువును హరించేది, నశింపచేసేది అని మాఘమాస గొప్పతనాన్ని వేదం చెప్తోంది. మాఘమాసం అపమృత్యువును, అజ్ఞానమును, పాపాలను తొలగిస్తుంది. జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఈ మాసంలో సూర్యునిఆరాధన, అరుణపారాయణ ప్రధానమైనవి. అరుణారాధన, సంధ్యావందనమే సూర్యారాధన అవుతుంది. ఈవిధంగా మాఘమాసం పూజనీయమౌతుంది. అరుణపారాయణంవల్ల ఋణవిమోచనం, సుఖప్రసూతి సంభవిస్తాయి. వ్రతాలు, నియమనిష్ఠలలో ప్రత్యేకించి మాఘపు ఆదివారాలు సూర్యారాధనకు శ్రేష్ఠం. మఘానక్షత్రంతో కూడిన పూర్ణిమను మాఘ అంటారు. మాఘగల మాసం మాఘమాసం. మాఘమాసంలో స్నానదానాదులు అత్యంత పుణ్యప్రదం. తెల్లవారుజామున నక్షత్రాలుండగా స్నానం చేయడం ఉత్తమం. మాఘమాసాన ప్రయాగ త్రివేణీసంగమంలో స్నానం ఎంతో ప్రాశస్త్యం. కాశీలో నూరురెట్లు పుణ్యం అధికంగా వస్తుంది. మనకు వీలు లేనప్పుడు ప్రయాగ, కాశీని తలచుకొని ఏ నదిలో స్నానంచేసినా ఉత్తమఫలితం లభిస్తుంది.

దుఃఖదారిద్ర్యాలు నశించడానికి, శ్రీవిష్ణుప్రీతికి, పాపనాశనానికి మాఘస్నానం చేస్తున్నానని సంకల్పం చెప్పుకోవాలి. అవకాశం ఉన్నవారు మాఘపూర్ణిమనాడు సముద్రస్నానం చేయడం ఉత్తమం. ఈ మాసంలో శరీరానికి నూనె రాసుకొని స్నానం చేయరాదు. స్నానంచేశాక మౌనంగా శ్రీమహావిష్ణువును పూజించాలి.



తీర్థాల్లో స్నానంచేశాక తిలలు, ఉసిరి కలువంటివి దానం చేయవచ్చు. ప్రతిరోజు నియమంగా శివపూజ, విష్ణుపూజ, అభీష్టదేవతాపూజ చేయడం శ్రేయస్కరం. వస్త్రాలు, చెప్పులు, గొడుగువంటివి దానం చేయాలి. శివాలయంలో నువ్వులనూనెతో దీపాలు వెలిగించడం సకలశుభాలను కలిగిస్తుంది. ఈమాసంలో అన్నదానం చేయడం వల్లకూడా అధికపుణ్యం లభిస్తుంది.

ఈ నెలలో వచ్చే భీష్మఏకాదశి, భీష్మద్వాదశి, శనిత్రయోదశి, మహామాఘి, మహాశివరాత్రిపర్వదినాలు ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నాయి.

ప్రతీనెలా మాసశివరాత్రి వస్తుంది. మాఘమాసంలో అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి మహాశివరాత్రి పర్వదినంగా చెప్పి పరమశివుని పూజించాలి. శివరాత్రినాడు అర్ధరాత్రిసమయాన పరమశివుడు జ్యోతిర్లింగంగా అవతరించాడని ఈ రోజున నీలకంఠునికి (శివలింగానికి) విశేషపూజలు, అభిషేకాలు ఎంతో భక్తిశ్రద్ధలతో చేయాలి. రాత్రి పార్వతి, పగలు శివుడుగా భావించి ఈ రోజు పార్వతీపరమేశ్వరులకు పలుచోట్ల వైభవంగా కల్యాణం జరిపించటం మహాపుణ్యప్రదం.

మహాశివరాత్రిరోజు పగలంతా ఉపవాసముండి రాత్రంతా జాగరణచేసి శివనామస్మరణతో, శివార్చనతో కాలం గడపాలి. శివరాత్రివ్రతం సర్వపాపప్రణాశనం, భక్తిముక్తిప్రదాయకం. జాగరణ, ఉపవాసం, పూజ ఈ మూడూకలిపి శివరాత్రివ్రతంగా పేర్కొంటారు. దీనిని భక్తిశ్రద్ధలతో ఆచరించేవారు పార్వతీపరమేశ్వరుల అనుగ్రహానికి పాత్రులవుతారు. కార్తికమాసం దీపారాధన ఎంత ముఖ్యమైనదో, మాఘమాసస్నానంకూడా అంతే ముఖ్యమైనది. మాఘస్నానాన్ని మాసమంతా పాటించలేనివారు ఒక పౌర్ణమిరోజు స్నానమాచరించినా అనంతమైన ఫలం లభిస్తుందని శాస్త్రవచనం.



యువత

# పురుషార్థాలు

- డా॥ కె.సుధాకరరావు, 73826 12993

**మా**నవజన్మ అన్ని జన్మలకన్న శ్రేష్ఠమని మన గ్రంథాలు చెప్తున్నాయి. ప్రాణులన్నిటిలో మానవజన్మ దుర్లభం. అందులోనూ పురుషుడుగా పుట్టడం. అందులోనూ విప్రత్వం కల్గడం- దానికన్న వైదికధర్మానుసరణం చేయడం దుర్లభం. వీటన్నిటికన్న విద్వత్తు శ్రేష్ఠం. విద్వత్తుకన్న ఆత్మ, అనాత్మ, వివేకం శ్రేష్ఠం. దీనికన్న స్వానుభవం-శ్రేష్ఠం! దీనికన్న బ్రహ్మలో ఐక్యమై ఉండే సమాధిస్థితి దుర్లభం! ముక్తి లభించాలంటే-శతకోటి జన్మల పుణ్యఫలాలు చిగురించాలి! ఫలించాలి! పుష్పించాలి! అప్పుడుగాని మనకు మోక్షం లభించదు.

శరీరాలు అనిత్యాలు. సంపదలు శాశ్వతం కాదు. మృత్యువు నిత్యం పొంచి ఉంటుంది. అందువల్ల మనం ధర్మ కార్యాలు చేయాలి.

మరి జీవనపరమార్థం ఏమిటి? దీనికి సమాధానం ఒక్కటే! ధర్మం, అర్థం, కామం, మోక్షం- అనే చతుర్విధ పురుషార్థాల్ని సముపార్జించడమే మన కర్తవ్యం. ధర్మం అనే శబ్దానికి



కర్తవ్యం, విధి అనే అర్థాలు ఉన్నాయి. వృత్తికి న్యాయం చేకూర్చటం ధర్మం. సాత్త్వికప్రవృత్తిని కల్గి ఉండడం ధర్మం. న్యాయమార్గంలో వెళ్లడం ధర్మం. శాస్త్రానుసారంగా నడుచు కోవడం ధర్మం. శాస్త్రాల నియమాలు ఉల్లంఘించి ఇష్టం వచ్చిన రీతిలో ప్రవర్తించేవ్యక్తికి ఇహపరాలు సిద్ధించవు.

శాస్త్రవిధానాల్ని తుంగలో తొక్కి స్వేచ్ఛతో ప్రవర్తించే వ్యక్తి సిద్ధిని, సుఖాన్ని, మోక్షాన్ని పొందజాలడని భగవానుని వచనం. ఇది పరమసత్యం.

కాబట్టి, ధర్మం అంటే- ఇతరుల స్వాతంత్ర్యానికి భంగం కల్గించకుండా ఉండడం. మన కర్తవ్యాన్ని నిష్ఠగా చేయడం. ధర్మబద్ధమైనజీవితంలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి.

రెండోది అర్థం. పుట్టిన క్షణంనుంచి మనిషి గతించే దాకా అడుగడుగునా ధనం అవసరం. అందువల్ల బ్రతుకుతెరువు కోసం సక్రమమార్గంలో ధనార్జన చేయడమే 'అర్థం' అనే పురుషార్థాన్ని సముపార్జించడం.

ధనాన్ని పుణ్యకార్యాలకు వినియోగించాలి. ధనానికి మూడుగతులున్నాయి. అవి దానం! భోగం! నాశం! ఎవడైతే ఇతరులకు దానం చేయడో, తాను అనుభవించడో, అలాంటి వ్యక్తి ధనానికి నాశం పడుతుందని సుభాషితం చెబుతుంది.

మూడో పురుషార్థం కామం. ధర్మబద్ధకామం భగవత్ స్వరూపం. సత్‌సంతానంకోసం గృహస్థధర్మాన్ని అవలంబించాలి.

ఇక నాల్గవ పురుషార్థం మోక్షం. మోక్షమంటే మోహ క్షయం. సద్గురువు నాశ్రయిస్తే సరైన జ్ఞానం కల్గుతుంది. ఆ జ్ఞానమనే నౌకతో మనం సంసారసాగరాన్ని తరించవచ్చు. మానవజీవితమంతా విషయవాంఛలతోనే గడిచిపోతే- ఇక బ్రహ్మతత్త్వంగురించి ఆలోచించే దెపుడు?

బాల్యంలో క్రీడల్లో, తారుణ్యంలో తరుణీమణులతో, వార్ధక్యంలో చింతాగ్రస్తతతో- మనిషి తలమునకలైపోతున్నాడు. అతనికి ఇక పరబ్రహ్మగురించి ఆలోచించే తీరిక ఎక్కడిది?

అందువల్ల మోక్షాన్ని ఆకాంక్షించేవ్యక్తులు చతుర్విధ పురుషార్థాల్ని సముపార్జించాలి. సద్గురువును ఆశ్రయించి ఆధ్యాత్మికమార్గంలో నిరంతరంగా పయనం సాగించాలి. ఇలా చేసినట్లయితే- అలాంటి వ్యక్తులంతా జననమరణరూప సంసార చక్రంనుంచి విముక్తులై భగవంతుని సాయుజ్యాన్ని పొందుతారనడంలో ఎలాంటి సందేహం లేదు.

**తిరుపతిలో ఉన్న కపిలతీర్థంలో శ్రీకామాక్షీసమేతుడుగ నెలకొని ఉన్న శ్రీకపిలేశ్వరస్వామివారికి ఈ ఫిబ్రవరి మాసంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పదిరోజులపాటు అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో విశేషంగా కల్యాణోత్సవం జరుగుతుంది. మహాశివరాత్రి మరుసటిరోజు సాయంకాలం శ్రీకపిలేశ్వరస్వామివారికి వార్షిక కల్యాణోత్సవం శోభాయమానంగా నిర్వహిస్తారు. వార్షికంగానే కాకుండా ప్రతినెల మాసశివరాత్రిరోజున ప్రదోష(సాయంకాలం) సమయంలో కల్యాణోత్సవం జరుగుతుంది. ఈ కల్యాణోత్సవాన్ని 'శివపార్వతుల కల్యాణోత్సవం' అంటారు. ఈ కల్యాణోత్సవం సందర్భంగా 'కల్యాణ కథాఘట్టం' గురించి చెప్పుకుందాం...**

# శివపార్వతుల కల్యాణం

- శ్రీమతి టి.వి.సుందరవల్లి శ్రీదేవి, 94907 49643

బ్రహ్మ చేసే సృష్టికార్యంలో సహాయపడటానికి మహాశక్తిస్వరూపిణియైన పార్వతీదేవి పరమశివునినుండి విడివడింది. ప్రపంచసృష్టిలో సాయపడిన పార్వతిని తిరిగి పరమేశ్వరునికి అర్పించ దలచిన బ్రహ్మ, తన కుమారుడైన దక్ష ప్రజాపతికి ఆమెను పుత్రికగా జన్మింపజేశాడు. కాని, ఒకానొకసందర్భంలో తండ్రియైన బ్రహ్మదేవుని ఐదవశిరస్సును ఖండించిన పరమశివునిపై దక్షుడు విరోధం పెంచుకున్నాడు. అందువల్ల కుమార్తెగా జన్మించిన సతీదేవికి శివునితో కల్యాణానికి అతడు వ్యతిరేకించాడు. ఎట్టకేలకు శివపార్వతులకల్యాణం జరిగింది.

కానీ, ఈ కల్యాణంవల్ల పరమేశ్వరుడు దక్షునికి పరమవిరోధి అయ్యాడు. శివుని అవమానించి ప్రతీకారం తీర్చుకోవాలనే నిర్ణయంతో తాను సంకల్పించిన యజ్ఞానికి త్రిమూర్తుల్లో ఒకరైన పరమశివునికి ఆహ్వానం పంపలేదు. కానీ పుట్టింటిపై మమకారంతో భర్తవారించినా వినక తండ్రి చేయిస్తోన్న యజ్ఞకార్యానికి వెళ్లింది. అక్కడ సతీదేవి తండ్రివల్ల, అక్కచెల్లెండ్లవల్ల అవమానింపబడి ఆత్మాహుతి చేసుకొంది. దాంతో శివుడాగ్రహించాడు. దక్షవాటికకు వెళ్లి, వీరభద్రుడై దక్షునిశిరస్సు ఖండించాడు.

ఈ విధంగా దక్షయజ్ఞవినాశనానికి కారణభూతురాలై ఆత్మాహుతినొందిన సతీదేవి, పర్వతరాజకుమార్తె పార్వతీదేవిగా ఉద్భవించింది. పూర్వజన్మ వాసనలవల్ల పరమశివుణ్ణి భర్తగా భావించి హిమశైల శిఖరంపై ఘోరతపస్సు చేసింది. అప్పుడు శివుడు ఆమెను పరీక్షింపదలచి జంగమ దేవరరూపంలో ప్రత్యక్షమయ్యాడు.

అలా ప్రత్యక్షమై పార్వతితో ఇలా అన్నాడు. నిన్ను భార్యగా చేసుకోవటానికి అతనికి అర్హతలేదు. ఒళ్లంతా విభూతితో ఉంటాడు. డమరుకాన్ని మ్రోగిస్తాంటాడు. స్మశానంలో తిరుగుతూంటాడు. ఇల్లూవాకిలీలేని బికారి. అతనితో నీకేమీ సుఖముండదు. కాబట్టి, నీ తపస్సు కట్టిపెట్టు అన్నాడు. ఆ మాటలకు పార్వతికి కోపమొచ్చి ఇలా అంది. శివదూషణ వినలేను. ఇక్కడినుండి తక్షణం వెళ్లిపో. నా స్వామి ముల్లోకాలనేలు నేత. భక్తజనులకు వరప్రదాత. త్రిమూర్తులలో ఒకడు. లయకారుడు. త్రిగుణాత్మకుడు. త్రినేత్రధారి. కాబట్టి అతణ్ణే నా పతిగ భావిస్తాను అన్నది.

అలా పార్వతీదేవి మనసు నెరిగిన వాడైన ఆ పరమేశ్వరుడు ఆమె అకుంఠిత దీక్షకు, అనురాగానికి మెచ్చి ఆ తల్లి పార్వతి చేయందుకున్నాడు. అంతట జంగమదేవరయే పరమశివుడని ఎరిగిన పార్వతీమాత తన వరుని కనులారా కాంచి సిగ్గులమొగ్గయైనది. అంతట హిమవంతుడు తనయ అంతరంగము నెరిగిన వాడై ఆ అంబ దాక్షాయణియే తన కుమార్తెయనీ, ఆపరమేశ్వరుడే తన అల్లుడు కానున్నాడని అమితానందంతో శివపార్వతుల కల్యాణం జరిపించాడు. అలా జరిగిన వీరి ఈ కల్యాణాన్నే కపిల తీర్థంలో కనులారా తిలకించి ధన్యుల మవుదాం.






వేల్పుల ప్రార్థనా మంత్రసహిత సృష్టిసృజన సంహితమే ఋగ్వేదం
మంత్రరూపక సంహిత పద్యరూపక సవివరణా సంహితమే సామవేదం
పద్యరూపక మంత్రసంహిత ఆచరణావిధాన సంహితమే యజుర్వేదం
అనునిత్య కర్మాచరణ కార్యసాఫల్య వివరణాత్మక సంహితమే అధర్వవేదం!!

వేదాల బ్రాహ్మణ అరణ్యక విభాగాలు విభాగింప వెల్లివిరిసె ఉపనిషత్తులులై
ఋగ్వేదసారం దశవిభాగాలై, సామవేదసారం పదహారువిభాగాలై,
యజుర్వేదం ఏబదివిభాగాలై, అధర్వణవేదం ముప్పదిరెండువిభాగాలై,
కలసి వెరసి ఇల వెలసె మానవ కళ్యాణకారక అష్టోత్తరశత ఉపనిషత్తులై!!

పదమూడుముఖ్యములై, ఇరువదియోగములై,
పందొమ్మిదిసన్యాసములై, పదునాలుగువైష్ణవములై, ఎనిమిదిశాక్తములై,
పదమూడుశైవములై, ఇరువదినొక్కటిసామాన్యములై,
అష్టోత్తరశత ఉపనిషత్తులు శోభిల్లె విషయవివరణవిధానములై !!

వైదిక కర్మాంతర్గత సగుణ బ్రహ్మోపాసనే ఆత్మైకభావన
ఆత్మైకభావనా విసర్జిత నిర్గుణ బ్రహ్మోపాసనే ఏకేశ్వరోపాసన
ఏకేశ్వరోపాసనా సమన్విత ఆత్మ అనుసంధానమే పరమాత్మసాధన
అనుసంధాన ఉపాసనా మార్గదర్శన వేదాంతమే ఉపనిషత్సారబోధన!!

ఋగ్వేదజనిత ఐతరేయ, సామవేదజనిత చాందోగ్య, కేనలు,
యజుర్వేదజనిత సుబల, తైత్తరీయ, శ్వేతాశ్వతర, బృహదారణ్యక,
ఇషా, కథలు అధర్వణవేద జనిత ప్రశ్న, ముండక, మాండూక్యములు
వేదసారమై, సర్వజనహితమై, సుబోధమై, అలరారు ఇలలో ముఖ్యోపనిషత్తులై!!

ఋగ్వేదాంతర్గత ఉపనిషత్తు విలసిల్లె విశ్వరహస్య వివరణాత్మకమై
బహురూపాల త్రిగుణాత్మక సృష్టి సాగె పరబ్రహ్మము మూలమై
వేల్పులుదయించె సర్వేంద్రియ నియంత్రణాధిపతులై
ఇంద్రియవశ దేహాల జీవి చరించె పరమాత్మ జ్ఞానహీనమై
ఆత్మజ్ఞానముదయింప గోచరించు ఆత్మ పరమాత్మ అభేధమై !!

బహువిద్య ఛందోబద్ధ పఠనాదర్శక జ్ఞానధార సాగరమై
అవిద్యానాశక ఉత్కృష్ట అధిభౌతిక ఆధ్యాత్మిక గుణసంపన్నమై
దృశ్యాదృశ్య విచక్షణా జ్ఞానవిషయ కూలంకష మేధోమథనమై
శాశ్వత పరమాత్మ సముపార్జన విషయవివరణ మార్గదర్శనమై
సామవేదాంతర్గ ఉపనిషత్తులు విలసిల్లె అద్వైత జ్ఞానద్యోతకమై !!

పద్య సౌరభాల, నిగూఢ ఆధ్యాత్మిక తత్వబోధనల ఆధారభూతమై
నిష్ప్రపంచ మూలభావమై లోతైన ప్రేరణాకారకముల నిబిడీకృతమై
వివరణాత్మక శాస్త్రీయ సూత్ర నిరూపితమై పరమాత్మ సందర్శనమై
యజుర్వేదాంతర్గత ఉపనిషత్తులు విలసిల్లె ఓంకారనాద ప్రకంపనమై !!

సంశయ నిర్మూలన ప్రశ్నాపరంపరల సహేతుక సమాధానరూపమై
జాగృత స్వప్న సుషుప్తావస్థల విచారణాజనిత తురీయస్థాయీ సాధనమై
సకల శాస్త్రాధ్యయన ప్రకటిత అద్భుత పారవశ్య విషయసంగ్రహమై
వేదవేదాంగ పఠనాజనిత పరాపరవిద్యా అమరజ్ఞానశోధనమై
అధర్వవేదాంతర్గత ఉపనిషత్తులు విలసిల్లె పరమాత్మ జ్ఞానసారమై !!

కఠిన పాషాణహృదయ జాగృతమై, అంతర్లీనశక్తి వికాసమై,
దృశ్యాదృశ్య కారణమై, సత్యాసత్య వివేచనమై, నాశరహితమై,
అవ్యక్త పరమాత్మజ్ఞానమై, వేదాంతమై, వేదాలసారమై,
అష్టోత్తరశత ఉపనిషత్తులై, ఇలకొలువైనవి పరబ్రహ్మరూపమై !!

లౌకికజ్ఞాన విషయచింతనా తత్పరులకు కామితఫల కామధేనువు
అలౌకికజ్ఞాన విషయచింతనా తత్పరులకు ముక్తినొసగు పరబ్రహ్మము
నాస్తికవాదులకైనా సన్మార్గదర్శనమిదు వేదాంతసింహము
సారమెరిగి త్రిగుణాతీత పరమాత్మ సాన్నిధ్యము సాధింపవే మనసా !!



శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించింది ఉపనిషత్తులసారమే!!

# భిన్నభంగిమలో ప్రసన్నవేంకటేశ్వరస్వామి - తొండమనాడు

– శ్రీ యస్. హేమంత్‌కుమార్

శ్రీవేంకటేశ్వరస్వామి అనగానే కటి, వరద హస్తాలతో స్థానకభంగిమలో నిలబడిన నిలువెత్తురూపం మన కళ్ళముందు కదలాడుతుంది. దాదాపు ఏ ఆలయంలో చూసినా ఈ భంగిమలోనే దర్శనమిస్తాడు స్వామి. అయితే దీనికి భిన్నంగా స్వామి దర్శనమిచ్చే ఆలయం ఒకటుంది. అదే శ్రీవేంకటేశ్వరుడు యోగముద్రలో, ఆసీనభంగిమలో కొలువు తీరి ఉన్న తొండమనాడుక్షేత్రం. ఎంతో గొప్ప చారిత్రకనేపథ్యం కలిగిన ప్రాచీనక్షేత్రం ఈ తొండమనాడు క్షేత్రం.

కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామి శ్రీశేషాచలంకొండలమీద కొలువుదీరిన తర్వాత వయసు మళ్ళిన ఒక భక్తునికోరికను నెరవేర్చడంకోసం కదలివచ్చి శ్రీదేవి, భూదేవీ సమేతుడై శ్రీకాళహస్తిసమీపంలో ఉన్న తొండమాన్‌చక్రవర్తి రాజధానియైన 'కోట' ప్రాంతం ప్రస్తుతం తొండమనాడుగా పిలువబడుతున్న గ్రామంలో వెలసిన వైనమే స్వామివారి భిన్న భంగిమ వెనుక ఉన్న కథ. అలా కోట ప్రాంతంలో వెలసిన ఆ స్వామియే ప్రసన్న శ్రీవేంకటేశ్వరస్వామి. ఆ ఆలయమే తొండమనాడు ప్రసన్నవేంకటేశ్వరస్వామిఆలయం. తొండమాన్‌చక్రవర్తి శ్రీవేంకటేశ్వరునికి పరమభక్తుడు. తిరుమలలో స్వామికి ఆలయం నిర్మించిన తొండమాన్‌చక్రవర్తి తాను నిత్యం స్వామిని దర్శించడం కోసం స్వామి అనుగ్రహంతో తన నగరంనుండి తిరుమలలోని స్వామివారి ఆలయం వరకు ఒక రహస్య సొరంగమార్గాన్నికూడా ఏర్పరచుకున్నాడు. ఇక అప్పట్నుంచి ప్రతిరోజూ ఆ రహస్యమార్గంగుండా తిరుమలకు వెళ్ళి స్వామివారిని దర్శించుకొని వచ్చి తన పాలనాకార్యక్రమాలు చూసుకునేవాడు తొండమాన్‌చక్రవర్తి.

అలా తొండమాన్‌చక్రవర్తి రాజ్యపాలన చేస్తున్నకాలంలో ఆ రాజ్యంలోని ఒక బీదబ్రాహ్మణుడు కాశీయాత్రకు వెళ్తూ చూలాలైన తనభార్యను తొండమానుడి వద్దకు తీసుకువచ్చి "ప్రభూ! నేను కాశీయాత్రకు వెళ్తున్నాను. చూలాలయిన నా భార్య అంతదూరం ప్రయాణించలేదు. కనుక ఈమెను మీ సంరక్షణలో ఉంచి వెళతాను. మీరు ఆమెను, ఆమెకు పుట్టబోయే శిశువునుకూడా సంరక్షించాల్సిందిగా మనవి చేసుకుంటున్నాను. నేను తిరిగివచ్చాక నా భార్యాపిల్లలను తీసుకెళ్తాను." అని భార్యను ప్రభువుదగ్గర వదలి కాశీకి వెళ్ళాడు.

తొండమానుడు ఆ బ్రాహ్మణికి కావలసిన సంబారాలన్ని ఓ గదిలో పెట్టించాడు. మొదట్లో కొద్దిరోజులుమాత్రం ఆమెను చూసుకున్నాడు. ఆ తర్వాత పాలనాపనుల్లోపడి ఆమెను మరచిపోయాడు.

తర్వాత ఆ బ్రాహ్మణస్త్రీ ఒక మగశిశువును ప్రసవించింది. మరికొద్దిరోజులకు రాజు ఇచ్చిన సంబారాలన్నీ అయిపోయాయి. ఆ తల్లీ శిశువులు ఆకలితో అలమటించి, అలమటించి అలాగే కన్నుమూశారు.

కాశీయాత్రకు వెళ్ళిన బ్రాహ్మణుడు తిరిగొచ్చాడు. రావడమే తొండమానునివద్దకు వచ్చి "ప్రభూ! నా భార్య, ఆమె ప్రసవించిన నా శిశువు క్షేమమేనా? వారిని చూపించండి!" అని అడిగాడు.

బ్రాహ్మణి విషయం అప్పుడు గుర్తొచ్చింది తొండమానుడికి. అప్పుడు, కంగారుగా ఆ గదివైపుకు పరుగెత్తాడు. వెళ్ళి చూడగా అక్కడ బ్రాహ్మణిగాని, ఆమె శిశువుగానీ లేరు. అక్కడ వారి అస్థిపంజరాలు మాత్రమే ఉన్నాయి.





అది చూసి రాజు నిర్ఘాంతపోయాడు. తన నిర్లక్ష్యంవల్ల ఆ తల్లీ శిశువులు మరణించారు. తనకు స్త్రీహత్యా, శిశుహత్యా, బ్రహ్మ హత్యాపాతకాలు చుట్టుకున్నాయి కదా. ఈ విషయం తెలిస్తే ఆ బ్రాహ్మణుడు ఎంతటి శాపం ఇస్తాడో కదా అని భయపడ్డాడు.

అలా భయపడ్డ రాజు మౌనంగా బ్రాహ్మణునివద్దకు వచ్చి "భూసురోత్తమా! తల్లి పిల్లలు కులాసాగా ఉన్నారు. వాళ్ళు దైవదర్శనార్థమై తిరుమలకు వెళ్లారు. వాళ్ళు వచ్చేవరకు మీరు వేచి ఉండండి" అని చెప్పి ఆనాటిరాత్రి తన రహస్యమార్గంగుండా తిరుమలకు వెళ్ళి స్వామిని దర్శించి తనవల్ల జరిగిన అప రాధాన్ని స్వామికి విన్నవించుకున్నాడు. ఆ బ్రాహ్మణస్త్రీని, ఆమె శిశువును బ్రతికించి తనను పాపవిముక్తుణ్ణి గావించుమని వేడుకున్నాడు.

స్వామి తొండమానుడితో "ఓ తొండమానూ! నీ భార్య సహకారంతో ఆ బ్రాహ్మణ తల్లీశిశువులశరీరాలను తిరుమలకు తీసుకొచ్చి పాండవతీర్థంలో మునక వేయించు. వారు సజీవు లవుతారు" అని చెప్పాడు.

తొండమానుడు వెంటనే అదే రహస్యమార్గంగుండా తన నివాసానికి వెళ్ళి తన భార్య సాయంతో ఆ బ్రాహ్మణ తల్లీ శిశువుల అస్థిపంజరాలను పల్లకీలో రహస్యంగా తిరుమలకు పంపించాడు. తర్వాత బ్రాహ్మణునితో "ఓ బ్రాహ్మణోత్తమా! మీ భార్యాపిల్లలు తిరుమలకు వెళ్లారు. వారిని అక్కడే కలుసు కుందురు రండి" అని చెప్పి ఆ బ్రాహ్మణుణ్ణి వెంటబెట్టుకొని తిరుమలలోని పాండవతీర్థంవద్దకు చేరాడు.

వీళ్ళక్కడికి చేరేటప్పటికి తొండమానుని భార్య బ్రాహ్మణ తల్లీశిశువులఅస్థులను తీర్థంలో మునక వేయించారు. అలా ఆ పవిత్రజలాలు తగలగానే ఆ తల్లీశిశువులు సజీవులయ్యారు. అలా పునర్జీవం పొందిన బ్రాహ్మణస్త్రీ తనశిశువుతో బయటకు వచ్చి గట్టుమీద రాజుప్రక్కన నిలబడిఉన్న తనభర్తకు బిడ్డను అందించింది. బ్రాహ్మణుడు ఎంతో సంతోషించి రాజును ఆశీర్వ దించాడు. తొండమానుడు ఆ బ్రాహ్మణునికి ధన కనక వస్తు వాహనాది కానుకలిచ్చి అతనిని సతీసుతసమేతంగా రాజలాంఛ నాలతో పల్లకీలో వారిగ్రామానికి పంపించాడు. (స్కాంద పురాణము-వైష్ణవఖండము)

అలా స్వామి అనుగ్రహంతో విముక్తి పొందిన తొండ మానుడు "స్వామీ! నాకు వయసు పైబడింది. వార్ధక్యంవల్ల నీ దర్శనానికి ఇంతదూరం రావడం చాలాకష్టంగా ఉంది. అలాగని నిన్ను దర్శించకుండా ఉండలేను. దీనికి తగిన తరణోపాయం అనుగ్రహించు స్వామీ!" అని వేడుకున్నాడు.

అలా శ్రీవేంకటేశ్వరుడు శ్రీదేవి, భూదేవిసమేతుడై తొండమానుని రాజధాని తొండమనాడులో అదే యోగముద్రతో ఆసీనభంగిమలో స్వయంభువుగా కొలువుదీరాడు. భక్తునిపట్ల ప్రసన్నుడయి వెలసిన ఈ స్వామి ప్రసన్నవదనంతో చిరునవ్వు లొలుకుతూ ప్రసన్న వేంకటేశ్వరస్వామిగా కీర్తించబడుతూ భక్తులను కటాక్షిస్తున్నాడు.





# నారికేళం

– మాలతి

మన హిందూపురాణవాఙ్మయంలో ప్రతి 'ఫలా'నికి ప్రతివృక్షానికి ఒక పురాణసంబంధమైన ఇతిహాసం కన్పిస్తుంది. ఉదాహరణకు మామిడిపండు విష్ణుమూర్తి భృగుమహర్షికి ఇచ్చిన కరుణాపూరితమైన వరమే కారణం. అదేవిధంగా 'నారి' అనే అప్సరసకు నారదుడు ఇచ్చిన శాపం, భూలోకవాసులకు, దైవానికి వరమై భాసించి కొబ్బరికాయ పుట్టుకకు కారణమైంది. నారదుడిచ్చిన శాపాలన్నీ అవి పొందినవారిపాలిట వరాలుగా మారితే, లోకానికీ, యుగాలందు మానవాళికీ అమోఘమైన శక్తివంతమైనవిగా మారాయి. అలాంటి పుణ్యశాపాలలో నారికేళంకూడా స్థానం సంపాదించుకుంది.

పూర్వం క్షీరసాగరమథనసమయంలో మందరగిరిని చిలుకుతున్న దేవదానవులకు అలసట కల్గకుండా ఉండేందుకు నారదుడు నారాయణస్మరణ చేస్తూన్నాడు. ఆ సమయంలో 'నారి' అనే గంధర్వ అప్సరాంగన అటుగా వెళుతూ, భక్తిపారవశ్యంలో ఉన్న నారదుణ్ణి చూసింది. ఆయన బ్రహ్మచర్యాన్ని పరిహసిస్తూ, కవ్విస్తూ ఆయనమీద నీళ్లను,తామరతూడులదారాలను విసిరింది.



ధ్యానంలో ఉన్న నారదునకు ధ్యానభంగమైంది. తన మీద పడిన నీళ్లను, తామరతూడుదారాలను చూసి ఆగ్రహంతో 'ఓసీ! సౌందర్య మదాంధురాలా! కామగర్వంతోనూ, దేవ విరుద్ధమైనకాంక్షతోనూ నామీద విసిరిన ఈ తామరదారాలనే అసహ్యకరమైన పీచుగా, నీళ్ళను గర్భంలో దాచుకుని, నీ నేత్రాలను చెడుతలంపుకు ఉపయోగిస్తూ, నీ నోటితో అసభ్యకర పలుకులు పలికావు. కనుక రెండుచిన్ననేత్రాలు, ఒకపెద్ద నేత్రంతో భూలోకంలో పాషాణకేళమై జన్మనెత్తు' అని శపించాడు. అప్పటినుండే చెడుతలంపులతో చూడరాదు. చెడు మాట్లాడరాదు అనే సామెత బహుళప్రాచుర్యంలోకి వచ్చింది.

మునిశాపం అమోఘమని గుర్తించిన 'నారి' ఆయన పాదాలపైబడి శరణుకోరింది. నారదుడు శాంతించి "ఓ నారీ! నీవు పూర్ణఫలంగా భాసించి మానవులచేతనేగాక, దేవదేవులందరికీ ప్రీతికరమై సకలశుభ, మంగళకార్యాలలో గౌరవస్థానాన్ని పొందుతావు. మానవాళికి ఆరోగ్యాన్ని ప్రసాదించే అమోఘశక్తివంతఫలంగా మారుతావు" అని దీవించాడు. అనాటినుండి 'నారి' నారికేళం ఫలంగా పూజార్హమైంది.

## దైవప్రీతికరమైన, అమోఘశక్తివంతమైన కొబ్బరికాయను కొట్టే విధానంలోని ఆంతర్యం

కొబ్బరికాయను కొట్టేటప్పుడుకూడ నోటిని అదుపులో ఉంచుకోవాలని గుర్తుచేసేవిధంగా, కాయమీద ఉన్న పెద్ద రంధ్రాన్ని అరచేతితో మూసి పగులగొట్టాలి. అప్పుడే కళ్లకు (రెండు చిన్నరంధ్రాలకు) కమ్మిన అంధకారపుతెరలు తొలగి కొబ్బరి రెండుచక్కనిచిప్పలుగా చాలా సులువుగా పగిలి తెల్లని వెలుగు(కొబ్బరి) ఉదయిస్తుంది. అమృతం(కొబ్బరినీళ్లు) చిందుతుంది. ఇదే నారికేళంమీద ఏర్పడిన మూడునేత్రాల(రంధ్రాల) కథ. కొబ్బరికాయను గమనిస్తే కొబ్బరిపిలకవద్ద మూడుకోణాలలో మూడునేత్రాలు కన్పిస్తాయి. వృక్షపరంగా కొబ్బరికాయ మూడు చిన్నగదులకలయిక. దీనినే 'ట్రై కార్పెలరీ' అంటారు.

ఆధ్యాత్మికంగా మూడునేత్రాలకు పైన చెప్పిందే చరిత్ర. ఈ మూడునేత్రాలలో రెండునేత్రాలు ఒకే ఆకృతిని కల్గి

ఉంటాయి. అందులో ఒకనేత్రంమాత్రం పై రెండిటికన్నా కొంచెం పెద్దదిగా ఉంటుంది. ఈ పెద్దదిగా ఉన్న నేత్రం లేదా రంధ్రం 'నారి' నోరు. చిన్నవిగా ఉన్న రంధ్రాలు 'నారి' నేత్రాలు.

## పూజార్హమైన ఫలాలెన్నో ఉండగా పూర్ణఫలాన్నే ఎందుకు కొట్టాలి?

భగవంతునికి సమర్పించడానికి ఈ సృష్టిలో ఎన్నో ఫలాలుండగా కేవలం కొబ్బరికాయ, అరటిపండ్లకే అగ్ర తాంబూలం ఎందుకు లభించింది? దీనికి కారణం ఉంది. సృష్టిలోని మిగిలినఫలాలను మనం ఆరగించి, వాటిలోని విత్తనాలను పారవేస్తాం. అలా ఆరగించడంతో ఆ విత్తనాలు ఎంగిలి విత్తనాలౌతాయి. అవి తిరిగి మొలకెత్తి ఫలాలను ఇస్తాయి. ఇలా లభించిన ఫలాలు తిరిగి ఎంగిలివే అవుతాయి. అటువంటి ఎంగిలిఫలాలను భగవంతునికి నివేదించడం అంత శ్రేష్ఠం కాదు. కొబ్బరికాయ, అరటిపండు ఈ కోవలోకి చెందినవి కావు. ఎందుకంటే విత్తనాలద్వారాగాక పిలకలద్వారా మొలచి, అన్నికాలాల్లోనూ లభించేది అరటిమాత్రమే. కాబట్టి ఎంగిలి అనేది అరటిపండుకు ఆపాదించబడదు. అలాగే కొబ్బరికాయను ఎంగిలిచేసి తిరిగి పాతిపెట్టలేం. అంటే ఒకసారి కొబ్బరికాయను తింటే దానిని తిరిగి పాతిపెట్టలేం. ఒక కొబ్బరికాయను పాతిపెడితేగానీ, మళ్లీ కొబ్బరిచెట్టు మొలవదు. అంటే కొబ్బరికి కూడా ఎంగిలి లేదు. అరటివలెనే కొబ్బరికూడా అన్నికాలాల్లో లభ్యమౌతుంది. ఎంగిలి లేనికారణంగా కొబ్బరి, అరటిపండు పూర్ణఫలాలు అని చెప్పబడ్డాయి. అవి భగవంతునిపూజలో ప్రధానాంశాలుగా చేర్చబడ్డాయి.

## కొబ్బరికాయకు మానవునికి ఉన్న సంబంధం

మనిషి జీవితానికి, కొబ్బరికాయ నిర్మాణానికి చాలా దగ్గర పోలికలు ఉన్నాయి. కొబ్బరికాయకు పైనఉన్న బయటి పీచు మనిషి చేసుకున్న కర్మలతాలూకు బంధాలూ, సమస్యలు; పిలకభాగం అహంకారం, పిలకకు క్రిందఉన్న మూడునేత్రాలు కర్మత్రయం అయినటువంటి సంచితము, ప్రారబ్ధము, ఆగామి. పూర్వజన్మలో చేసిన పాపపుణ్యాలను సంచితమని, ప్రస్తుత జన్మలో అనుభవిస్తున్న సంచితకర్మఫలాన్ని ప్రారబ్ధమని, ప్రారబ్ధ కర్మలతాలూకు పాపపుణ్యాలను అనుభవించడానికి తిరిగి జన్మ ఎత్తడాన్ని ఆగామి అని అంటారు.

బ్రహ్మ తన ఊర్ధ్వముఖబుద్ధితో ఆలోచించి మిగిలిన మూడుశిరములద్వారా సమీక్షించి తన కుడిచేతి మూడువ్రేళ్ళతో ఈ కర్మత్రయాన్ని ప్రతిజీవి నుదుటిమీద వ్రాస్తాడు. కాబట్టే, ఇది మనుషులకు, జీవులకు తలరాత, నుదుటివ్రాత అయ్యింది. ఇక కొబ్బరికాయలోని 'నీరు' ఆ జీవియొక్క ఆయుర్దాయం. పగిలిన రెండుచిప్పలు జీవాత్మ, పరమాత్మలు. చూడడానికి అవి రెండూ విడివిడిగానే ఉన్నా, కలిసి ఉన్నప్పుడే 'కాయ' అవుతుంది. అంటే జీవాత్మ, పరమాత్మ కలిసినప్పుడు జీవిఔతాడు.

## కొబ్బరికాయను దేవునిముందు కొట్టడంలోని రహస్యం

కొబ్బరికాయమీద ఉన్న పీచువలె మనకు బంధాలూ, కర్మలూ అనేకం. అలాగే కొబ్బరిపిలకలోని అహంకారం ప్రతి మనిషిలోనూ అంతర్లీనంగా ఉంటుంది. కొబ్బరికాయమీద ఉన్న మూడుకన్నుల్లాగా ప్రతిమనిషి కర్మత్రయాన్ని అనుభవిస్తున్నాడు. ఈ మూడింటిని పగులకొడితే కొబ్బరికాయలోని నీళ్లు అంటే మానవజన్మ అతడి జీవితం దేవునికి నైవేద్యంగా పనికిరావు. కాబట్టి, ప్రతిమనిషి కొబ్బరికాయను కొట్టేముందు తనలోని అహాన్ని అణచివేయుమని, భవబంధాలనుంచి విడిపించుమనీ, కర్మత్రయాన్ని నాశనంచేసి, తనజీవితాన్ని ఆయనలో ఐక్యం చేసుకొమ్మని, తనకి తాను ఆ పరమాత్మకు నైవేద్యం అయ్యేలా మంచిపనులు చేయించుమని కోరుకుంటూ కాయను పగులగొట్టాలి. కోరికలు తీరడంకోసం కొబ్బరికాయను సమర్పిస్తే అటువంటివారికి కొబ్బరికాయను సమర్పించడంతో భగవంతునితో ఉన్న సంబంధం తీరిపోతుంది. అలాగాక దేవునితో శాశ్వత బంధాన్ని కోరుకునేవారు పైవిధంగా అనుకుంటూ నారికేళాన్ని సమర్పించుకోవాలి. మనిషి కొబ్బరికాయలాగా అహంతోనూ, కర్మత్రయంతోనూ, భవబంధాలతోనూ బంధించబడి ఉన్నాడు.

చిప్పలుగా చెప్పుకుంటున్న జీవాత్మ, పరమాత్మల ఆయువు అనే జలంతో బంధించబడి ఉన్నాయి. ఈ ఆయువు ముగియాలంటే మనిషి తనను తనకుతానుగా భగవంతునికి నివేదించుకోవాలి. అంటే కర్మఫలాన్ని ఈశ్వరునికి అర్పించాలి. అంటే కొబ్బరికాయను కొట్టినతరువాత దేవునిపాదాలముందు ఉంచడం అన్నమాట. ఇలా చేసినట్లయితే, భగవంతుడు మన జీవాత్మలలో తిరిగి జన్మలేకుండా చేస్తాడని వేదవిదులు వక్కాణించారు. కాబట్టి, తిరిగి జన్మలేకుండా చేసుకోవాలి అనే సంకల్పంతో కొబ్బరికాయను ఆ భగవానునికి సమర్పించుకోవడమే మన ధర్మం ఔతుంది.







1) తిరుమలలో 02-01-2023న శ్రీవారి వైకుంఠద్వారదర్శనానికై వెళ్తున్న భక్తులు.

2) 02-01-2023న వైకుంఠఏకాదశి సందర్భంగా వివిధ పుష్పాలంకరణలో శ్రీపద్మావతిఅమ్మవారిసమేత శ్రీవారు.

3) 02-01-2023న వైకుంఠఏకాదశి సందర్భంగా తిరువీథుల్లో స్వర్ణరథోత్సవ దృశ్యం.

4) 03-01-2023న శ్రీస్వామిపుష్కరిణీతీర్థ ముక్కోటిసందర్భంగా జరిగిన చక్రత్తాళ్వారు పూజాకైంకర్యాల దృశ్యం



# ద్వాదశజ్యోతిర్లింగాలు



## 1 సోమనాథలింగేశ్వరస్వామి

చంద్రుడు సౌరాష్ట్రంలో ఉన్న ప్రభాసతీర్థంవద్ద పార్థివలింగాన్ని ప్రతిష్ఠించి, మృత్యుంజయ మహామంత్రాన్ని జపించి కుష్ఠువ్యాధి విముక్తుడయ్యాడు. ఆ చంద్రుని కోరికమేరకే ఇక్కడ సోమనాథేశ్వరజ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందాడు.



## 2 శ్రీశైలమల్లికార్జున లింగేశ్వరస్వామి

చంద్రావతి అను కన్యక శ్రీశైలంనందున్న జ్యోతిర్లింగానికి మల్లెమాలను సమర్పించగా, అవి ఎప్పటికీ వాడిపోనివిధంగా వరమిచ్చాడట స్వామి. అలా స్వామి శ్రీశైలమల్లికార్జున జ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందాడు.



## 3 మహాకాళలింగేశ్వరస్వామి

వేదప్రియుడనే భక్తుడు అవంతికపట్టణంలో దూషణుడనే రాక్షసుడిబారి నుండి రక్షణ పొందేందుకు తన ఇంట్లోనే పార్థివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రార్థించాడు. స్వామి ప్రత్యక్షమై అతనికోరికమేరకు అక్కడే మహాకాళేశ్వర జ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందాడు.



## 4 ఓంకారలింగేశ్వరస్వామి

పర్వతరాజైన వింధ్యుడు తన శిఖరంపై ఓంకారయంత్రాన్ని, దాని మధ్యలో పార్థివలింగాన్నీ ప్రతిష్ఠించి ప్రార్థించగా స్వామి ప్రత్యక్షమై ఆ రెండింటినీ కలిపి ఓంకారేశ్వరజ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందాడు.



## 5 వైద్యనాథలింగేశ్వరస్వామి

రావణాసురుడు తన తల్లి లింగపూజార్థమై కైలాసానికికెళ్లి శివుణ్ణే అడిగి శివుని ఆత్మలింగాన్ని తీసుకొచ్చిన లింగాన్ని బ్రహ్మేంద్రాదులు దర్శించి మానవుల దీర్ఘ వ్యాధులనివారణకు ఇక్కడ వైద్యనాథజ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందాడు.



## 6 భీమశంకరలింగేశ్వరస్వామి

సహ్యాద్రిపర్వతాల్లో కర్కటి, విరాధుడు అనే రాక్షసులకుమారుడు భీముడు. ఇతని బారినుండి కాపాడుమంటూ సుదక్షిణుడనే రాజు పార్థివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రార్థించగా స్వామి ప్రత్యక్షమై భీముణ్ణి సంహరించి భీమేశ్వరజ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందాడు.

కోటిసూర్యప్రకాశసమమైన శివలింగం... జ్యోతిర్మయస్వరూపుడైన మహాశివుని ప్రతిరూపం. పరమశివుని ఆరాధ్యచిహ్నం 'లింగం'. కంటికి కనిపిస్తున్న జగత్తంతా లింగంనందే ఇమిడి ఉంది. లింగమూలంలో బ్రహ్మ, మధ్యన విష్ణువు, ఉపరిభాగమందు ఓంకారస్వరూపుడైన రుద్రమూర్తి సదాశివుడు ఉంటారు. 'అ'కార, 'ఉ'కార, 'మ'కారముల ఏకమే 'ఓం' కారము. అదే లింగము. అదే త్రిమూర్తుల ఏకరూపం. పురుషుడే మహాశివుడు.. పార్వతి ప్రకృతి.. అదే శివలింగానికి 'పానవట్టం'. అదే 'శక్తిపీఠం'. ఆ శివశక్తుల ఏకరూపమే శివలింగం. జగత్తుకే ఆధారమైనట్టి లింగోద్భవం... జ్యోతిర్మయస్వరూపమైన తేజోలింగం. ఆవిధంగా ఆవిర్భవించిన ద్వాదశజ్యోతిర్లింగాల విశేషాలు మీ కోసం...



## 7 రామలింగేశ్వరస్వామి

శ్రీరాముడు రావణసంహారంలో బ్రహ్మహత్యాదోషనివారణకు శివలింగ పూజకు ఆంజనేయుణ్ణి కైలాసానికి పంపగా అతను ఎంతకూ రాలేదని తానే ఒక సైకతలింగాన్ని ప్రతిష్ఠించి పూజించాడు. ఆ లింగమే రామలింగేశ్వర జ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందింది.



## 8 నాగలింగేశ్వరస్వామి

దారుకుడు దారుక రాక్షసదంపతుల ఆగడాలను అరికట్టాల్సిందిగా సుప్రియుడు చెఱసాలలో ఉన్న వారిచేత శివనామసంకీర్తనలు చేయించగా అక్కడికి నాగసర్పం ప్రవేశించి ఆ రాక్షసులను హతమార్చింది. ఆ భక్తుడి కోరికమేరకు ఆ సర్పం శిరస్సుపై ఉన్న మణియే నాగేశ్వర జ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందింది.



## 9 కాశీవిశ్వేశ్వరలింగేశ్వరస్వామి

కాశీలో బ్రహ్మ విష్ణువులు శివుణ్ణి ఇక్కడే శాశ్వతంగా నిలిచి సృష్టిని చల్లగా కాపాడాలని ప్రార్థించగా కాశీ విశ్వేశ్వర జ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందాడు.



## 10 త్ర్యంబకలింగేశ్వరస్వామి

బ్రహ్మగిరిపై తపస్సు చేసుకుంటున్న గౌతముడు ఆవుదూడల మరణానికి చింతిస్తూ శివుడికై తపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై అతని ప్రార్థనమేరకు త్ర్యంబకేశ్వరజ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందాడు.



## 11 కేదారలింగేశ్వరస్వామి

బదరికావనంనందు నరనారాయణులనే మహర్షులు కేదారక్షేత్రంలో పార్థివ లింగాన్ని ప్రతిష్ఠించి పూజించగా స్వామి ప్రత్యక్షమై భక్తులకు కైవల్యాన్ని ప్రసాదించాలనే వారికోరికమేరకు కేదారేశ్వరజ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందాడు.



## 12 ఘృష్ణలింగేశ్వరస్వామి

వేదగిరి అనే ఊళ్లో ఘృష్ణ అనే ఓ భక్తురాలి సద్బుద్ధికి, సత్ప్రవర్తనకు సంతసించి ఆమె పేరుమీదనే ఘృష్ణేశ్వరజ్యోతిర్లింగంగా ఆవిర్భవించి ప్రసిద్ధిపొందాడు.



02-01-2023న వైకుంఠఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల ఆలయంలో 27-12-2022న ఘనంగా జరిగిన **కోయిల్ ఆళ్వార్ తిరుమంజన మహోత్సవం.** ఇందులో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ **అనిల్‌కుమార్ సింఘాల్**, ఐ.ఏ.ఎస్. మరియు అదనపు కార్యనిర్వహణాధికారి (ఎఫ్.ఏ.సి.) శ్రీ **వి.వీరబ్రహ్మం**, ఐ.ఏ.ఎస్.



22-12-2022 నుండి 15-01-2023 వరకు తిరుమలలో **శ్రీస్వామికి** జరిగిన **అధ్యయనోత్సవ** కార్యక్రమాల దృశ్యం





02-01-2023న తిరుమలలో **వైకుంఠఏకాదశి** సందర్భంగా వైకుంఠద్వారదర్శనార్థం విచ్చేసిన భక్తులు





వై.యస్.ఆర్.జిల్లా ప్రొద్దుటూరు మునిసిపల్ ఉన్నతపాఠశాల మైదానంలో తి.తి.దే. వారి ఆధ్వర్యంలో 18-12-2022న వైభవంగా జరిగిన **శ్రీనివాస కల్యాణోత్సవ వైభవ** దృశ్యాలు





18-12-2022న తిరుమలఆలయంలో ఘనంగా జరిగిన **విశ్వశాంతి మహాయజ్ఞకార్యక్రమం** దృశ్యాలు. ఇందులో పాల్గొన్న తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు శ్రీ **వై.వి.సుబ్బారెడ్డి** దంపతులు

# చెంచులక్ష్మీ పరిణయగాథ

- శ్రీ యం.వి.యస్.రామశేషు, 99089 92602

పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్ ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

అని గీతాచార్యుడు బోధచేశాడు. శిష్టరక్షణ, దుష్టశిక్షణ కోసం శ్రీమన్నారాయణుడు యుగయుగంలో అవతరించాడు. వాటినే దశావతారాలని మనం స్తుతి చేస్తున్నాం.

మత్స్యఃకూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః ।
రామోరామశ్చ కృష్ణ రామశ్చ కల్కిరేవచ ॥

అన్నవి దశావతారములు. భగవానుని 21 అవతారాలను, అంశావతారాలు, అంశాంశావతారాలు, పూర్ణావతారాలు, పరిపూర్ణావతారాలుగా పేర్కొంటారు. దుష్టశిక్షణకై అవతరించినవి ఆవేశావతారాలు. వానిలో వరాహ, నారసింహ, పరశురామావతారాలు ఇవి మూడు దశావతారాలలో ఉన్నాయి.

పరమాత్మ ఒక మహనీయుని ఆవేశించి ఏదేని ఒక మహాత్కార్యాన్ని సాధించటానికి అవతరించినవే ఆవేశావతారాలు. శాపవశాత్తు వైకుంఠద్వారపాలకులయిన జయవిజయులే భూలోకంలో హరివైరులుగా ఉద్భవించిన హిరణ్యాక్ష, హిరణ్యకశిపులకు శాపవిముక్తి కలిగించటానికి వరాహ, నారసింహ అవతారములలో స్వామి ఆవిర్భవించాడు.

క్షీరసాగరమథనం తరువాత సాగరుడు తన కుమార్తె లక్ష్మీదేవిని నారాయణునికిచ్చి వివాహం చేయటానికి సిద్ధపడ్డాడు. ఆ వివాహానికి ముక్కోటిదేవతలు, ఋషులు అందరూ వచ్చారు. వివాహం జరుగుతున్నసమయంలో దుర్వాసమహర్షి అక్కడికి వచ్చాడు. ముక్కోపియైన ఆ మహర్షి సాగరునితో వివాహానికి అందరిని పిలిచి, తనను మరచినందుకు కోపోద్రిక్తుడయ్యాడు. సాగరుడు ఎంత బ్రతిమాలినా, ఇంద్రాదిదేవతలు నచ్చచెప్ప ప్రయత్నించినా దుర్వాసుడు వినలేదు. పైగా మర్యాద తెలియని బుద్ధితో కిరాతునివలె ప్రవర్తించిన నీవు భూలోకంలో భిల్లకులంలో జన్మించుమని శపించాడు. అంత లక్ష్మీదేవి తన వివాహకారణంగా తండ్రికింత బాధ కలిగినందుకు దుఃఖిస్తూ మహర్షిని శరణువేడింది. అప్పుడాయన నీవు సైతం వాని గర్భాన పుట్టి తిరిగి శ్రీ మహావిష్ణువుని వివాహమాడుతావు. అప్పుడు నీ తల్లిదండ్రులకు, నీకు శాపవిముక్తి కలుగుతుందని చెప్పి వెళ్లిపోయాడు.

అంత సాగరుడు భార్యాసమేతంగా భిల్లకులంలో జన్మించాడు. లక్ష్మీనారాయణులు సైతం భూలోకానికి వచ్చారు. నారాయణుడు తాను హిరణ్యకశిపుని సంహరించేదాకా ఆమెను వేచి ఉండుమని చెప్పి ఆమెకు ఏ విధమైన ఆపద కలుగకుండా ఆమె లక్ష్మీకళను ఒక పండులో నిక్షిప్తం చేశాడు. ఇద్దరు చెరొక దారిన వెళ్లిపోయారు.

భిల్లదంపతులు సంతానం లేక బాధపడుతుంటే, నారద మహర్షి లక్ష్మీకళ ఉన్న పండును తెచ్చిఇచ్చి ఆమెను భుజింపమన్నాడు. ఆ ఫలఫలితంగా వారికి ఒక ఆడపిల్ల పుట్టింది. ఆమెయే మన కథానాయిక చెంచులక్ష్మి.

ఇక హిరణ్యకశిపుడు బ్రహ్మనుగురించి తపస్సుచేసి, ఎవ్వరిచేతా మరణం లేకుండా వరాన్ని పొందాడు. ఆ వరగర్వం చేత సాధుసత్పురుషులను, మహర్షులను, దేవతలను అనేకబాధ



లకు గురిచేస్తున్నాడు. యజ్ఞయాగాదులకు విఘ్నం కలిగిస్తు న్నాడు. అప్పుడు దేవతలు, మహర్షులు మొదలైనవారందరూ శ్రీమహావిష్ణువుని శరణు వేడుకున్నారు. శ్రీమన్నారాయణుడు వానిచెరను తప్పక తీరుస్తానని వారందరికీ మాటిచ్చాడు.

హిరణ్యకశిపునికి ప్రహ్లాదుడను ఒక పుత్రుడున్నాడు. అతడు పరమభాగవతోత్తముడు. శ్రీమన్నారాయణుని భక్తుడు. పుత్రునిధోరణిని గ్రహించి విద్యాభ్యాసంవల్ల వానికి జ్ఞానం కలుగుతుందని హిరణ్యకశిపుడు

చదువని వాడజ్ఞుండగు
చదివిన సదసద్వివేక చతురత గలుగున్
చదువంగ వలయు జనులకు
చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ!

అని పిల్లవాణ్ణి గురుదేవులవద్దకు పంపాడు. అయినా ఆతని భక్తితత్పరత తగ్గలేదు. విష్ణుభక్తిని మానిపించటానికి పసిబాలకుడైన ప్రహ్లాదుణ్ణి మృగాలతో తొక్కించాడు. పాములతో కరిపించాడు. అగ్నిలో పడవేయించాడు. సముద్రంలో విసిరి వేయించాడు. ఐనా కాని ప్రహ్లాదునిభక్తిచే స్వామి ఆతణ్ణి రక్షిం చాడు. చివరకు ఒకనాడు విష్ణువు విష్ణువని అంటున్నావు. ఆతణ్ణి నువ్వు చూపగలవా అని పుత్రుణ్ణి అడిగాడు. అందుకు అతడు సర్వాంతర్యామి అయిన ఆ నారాయణుడు లేనిచోటెక్కడ? అన్నాడు. అయితే ఈ స్తంభంలో ఉన్నాడా? అని ప్రశ్నించాడు. అంత ప్రహ్లాదుడు–

ఇందుగలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచి
నందందేగలడు దానవాగ్రణి! వింటే ।

అని సమాధానమిచ్చాడు, హిరణ్యకశిపుడు ఆ స్తంభాన్ని తన గదతో మోదాడు. అంత ఆ స్తంభం మధ్యకు చీలిపోయింది. అందులోనుండి ఒక వికృతాకారం ఉద్భవించింది. సగం మనిషిగా, సగం జంతువుగా, తలపైనంతా జూలుతో, వాడియైన గోళ్ళతో, తీక్ష్ణమైనకన్నులతో భీకరగర్జనలు చేయసాగాడు. ప్రహ్లాదుడుకూడా ఆ మూర్తిని చూచి భీతితో కన్నులు మూసు కొన్నాడు. అంత ఆ నరసింహరూపుడైన హరి హిరణ్యకశిపుణ్ణి పట్టి తన తొడలపై పెట్టుకొని వాడియైనగోళ్ళతో ఆతణ్ణి సంహరించి అందరికి ఆనందం కలిగించాడు. అంత దేవతలు, ఋషులందరూ స్వామిని ప్రసన్నరూపం దాల్చుమని ప్రార్థిం చారు. ప్రహ్లాదునిప్రార్థననుకూడా మన్నింపక ఆతణ్ణి పట్టాభిషిక్తుని చేసి అడవులకు బయలుదేరి వెళ్ళిపోయాడు నారసింహుడు.

ఆ విధంగా అడవుల్లో తిరుగుతూ గరుడాచలం చేరాడు. అక్కడ భీకర గర్జనారవములతో తిరుగుతుండగా ఒక చెంచిత ఆ మూర్తికి ఎదురొచ్చింది. ఆమె తలపైన ఈకలను పూవులవలె దాల్చి ఉంది. నుదుటిపై మెరిసే కస్తూరితిలకాలను దిద్దుకొని ఉంది. రంగురంగుల పూసలపేరులు మెడనిండా అలంకరించుకొని ఉంది. అందమైన వస్త్రాలతో, అందమైన అడవిసొమ్ములు ధరించి ఉంది. చేతిలో ధనుర్బాణాలు మెరు స్తుండగా అందమైన, అమాయకమైన ముఖంతో ఉంది. ఆమె తన చెలికత్తెలతో ఆడుతూ పాడుతూ నరసింహునికి ఎదురొచ్చింది.

అప్పటిదాకా ఉగ్రరూపంతో అందరినీ భయపెడ్తోన్న స్వామి ఆ చెంచితను చూడగానే పరమశాంతిని పొందాడు. ఆమెను చూచినంతనే స్వామి మనస్సున శాంతి కలిగింది. ప్రేమాంకురములు మొలకెత్తాయి. తోడిచెలికత్తెలను ఆమెను గురించి అడగ్గా ఆమె మా భిల్లులరాజు కుమార్తె చెంచులక్ష్మి అని చెప్పారు. అది విని నారసింహుడు చెంచులక్ష్మితో ఆమెపై తనకు మనసు కలిగిందని, ఆమెను పెండ్లి చేసుకోవాలని ఉన్నదని పలికాడు.

స్వామిని చూచిన చెంచులక్ష్మి సైతం ప్రేమతో సిగ్గు పడింది. భిల్లరాజు వారిని చూచి కోపోద్రిక్తుడయ్యాడు. చెంచిత తండ్రికి తన మనస్సెరింగించింది.

అంతలో అక్కడికి వచ్చిన నారదుడు విష్ణువు అల్లుడు కావాలన్నదే కదా నీ కోరిక. ఈ నరహరి వేరెవరో కాదు. సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుడే అని చెప్పాడు. నారదముని మాటలను విన్న చెంచుదొర తన కుమార్తె చెంచులక్ష్మిని నర సింహునికిచ్చి వివాహం చేశాడు. అంత నరహరి ప్రసన్న రూపాన్ని పొందాడు.

చెంచులక్ష్మి, నరహరులిద్దరూ చెట్టుపుట్లనక, కొండా కోనల్లో, వనవిహారాలు చేస్తూ ఆనందంగా ఉన్నారు. ఒకసారి నరసింహుడు అడవిమధ్యలో ఉన్న భవనమందు ఒకకాంతను చూశాడు. లక్ష్మీదేవి నరసింహుని శ్రీమన్నారాయణునిగా గుర్తించింది. కాని ఆతడామెను పసిగట్టలేకపోయాడు. కారణం

ఆమె కళావిహీనయగుటయే. నారాయణుడామె మంచిచెడులను చూడసాగాడు.

నారదమహర్షి ఈ విషయం చెంచులక్ష్మికి చెప్పి ఆమెను, భిల్లదంపతులను అక్కడికి తీసుకువచ్చాడు. చెంచులక్ష్మి అక్కడఉన్న ఆదిలక్ష్మిని నారాయణుని పరిపరివిధాల నిందోక్తు లాడింది.

ఆదిలక్ష్మికూడా పరుషోక్తులు పలుకుతూండగా నారదుడు వారితో అమ్మా మీరివురు ఇద్దరు కారు ఒక్కరే. అమ్మా! ఆదిలక్ష్మీ! నీ చిత్కళయే ఈ చెంచులక్ష్మి అని పలికాడు. ఈ భిల్లదంపతులు సాగరుడు ఆయనభార్య అని చెప్పాడు. దుర్వాసముని పూర్వపు శాపవృత్తాంతమంతటినీ వివరించాడు. ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి వారిద్దరు ఒకరినొకరు ఆలింగనమొనర్చు కొన్నారు. సకలకళావల్లభయైన లక్ష్మీదేవి సాక్షాత్కరించింది. భిల్లదంపతులు వారి పూర్వస్వరూపాలు పొంది వారి వారి స్థానాలకు చేరుకున్నారు. ఇది ఋషివాక్కు.

కృతయుగంలో ప్రహ్లాదుణ్ణి రక్షించటానికి మహావిష్ణువు నరసింహరూపాన్ని ధరించి హిరణ్యకశిపుణ్ణి సంహరించాడు. అనంతరం ఆ భీకరరూపంతో వెలగొండల కీకారణ్యంలో గర్జిస్తూ సంచరిస్తున్నాడు. ఆ సమయంలో చెంచులక్ష్మి తన చెలికత్తెలతో కలిసి అక్కడి వనాలలో తిరుగాడుతోంది. అపుడా భీకరరూపాన్ని చూసిన చెలికత్తెలు ఆమెను విడిచి భయంతో పారిపోయారు. చెంచులక్ష్మి పారిపోకుండా భయపడక ధైర్యంతో నిలబడిందని ఒక కథనం. ఆమె ధైర్యసాహసాలకు, అందచందాలకు, అమాయకతకు ముగ్ధుడైన స్వామి చెంచురాజుకు కప్పం చెల్లించి ఆమెను వివాహం చేసుకున్నాడు. సుందరమైన ఆ వనిత చెంచులక్ష్మిని పెనవేసుకుని శిలారూపంలో స్వయంభువుగా వెలశాడని అదే పెనుశిలగా కాలక్రమేణా పెంచలకోనగా ప్రసిద్ధి పొందిందని అక్కడి స్థానికుల మాట.

చెంచులక్ష్మిని స్వామి వివాహమాడిన విషయం తెలిసిన ఆదిలక్ష్మి ఆగ్రహించి, స్వామికి అల్లంతదూరంలో ఏటికి ఆవలిగట్టున వెలసిందని చెబుతారు. అక్కడే అమ్మవారికి దేవస్థానం నిర్మించి అర్చనాదికాలు నిర్వహిస్తున్నారని ప్రతీతి.

ఈ చెంచులక్ష్మీకల్యాణం పద్మపురాణంలోనిదిగా చెబుతారు. కాని ఇది ఋషిప్రోక్తమైందిగా ప్రసిద్ధి పొందింది.



ఈ చెంచులక్ష్మీకల్యాణం అనేది ఒగ్గుకథ, జముకులకథ, బుర్రకథ, యక్షగానప్రక్రియ, వీథినాటకంగా ప్రదర్శింపబడుతోంది. చెంచులక్ష్మి, నరహరి అని తమ పిల్లలకు పేర్లను పెట్టుకోవటంకూడా ఒక ఆచారంగా కనిపిస్తున్నది. ఈ చెంచు లక్ష్మీనారసింహులను తమ ఇలువేలుపులుగా భావించి అర్చన పూజనాదికములు నిర్వర్తిస్తూ స్వామిపట్లగల తమభక్తిని చాటు కుంటుంటారు.

మాతా నృసింహశ్చ । పితా నృసింహః ॥
భ్రాతా నృసింహశ్చ । సఖా నృసింహః ॥
విద్యా నృసింహో । ద్రవిణం నృసింహః ॥
స్వామీ నృసింహ । స్సకలం నృసింహః ॥

సకలరూపాలను ధరించి సర్వమూ తానేయైన ఆ లక్ష్మీ నృసింహుడు నామసంస్మరణచేతనే భక్తులను గాచు భక్తవరదుడు, సర్వలోకశరణ్యుడు అయిన స్వామికి సాష్టాంగనతులు.

"లోకా స్సమస్తా స్సుఖినోభవన్తు"

## జ్యోతిష్యం

# రుద్రాభిషేకం

- శ్రీ చాకిచర్ల నాగసుదర్శన్‌రావు, 97013 85006



కాలం అనేది పరమేశ్వరునిస్వరూపం. అందుకే శివుని ఆజ్ఞ లేనిదే చీమైన కుట్టదంటారు. మనం చేసిన పూర్వకర్మలను అనుసరించే ఆ సదాశివుని అనుగ్రహం మనమీద ఉంటుంది. అందుచేతనే ఈ అనంతకాలగమనంలో ప్రతిమనిషి తాను చేసిన పుణ్యపాపాలానుసారం సుఖదుఃఖాలతో తమజీవితాన్ని గడుపుతూ ఉంటారు. కాని, మనం జాగ్రత్తగా గమనిస్తే ఈ జగత్తులో చాలామందిజీవితాలు కష్టాలకడలితోనే నిండి ఉంటాయి. దానికి కారణం మనం చేసిన పుణ్యకర్మలకంటే పాపకర్మలే ఎక్కువని తెలుస్తుంది. ఈ విషయాన్ని తెలుసుకుంటే చాలు, ఈ జన్మలోనే ఎన్నో మంచిపనులు చేసి ఇప్పుడే కాకుండ, ఉత్తరజన్మలలోకూడ పుణ్యఫలాలనే ఎక్కువగా పొందుతాం.

మనం మంచిపనులు చేయాలంటే మనమనస్సు ప్రధానంగా తోడ్పడాలి. అందుకోసమే, మనమనస్సు మంచి మార్గంలోనే చరించేవిధంగా దయామయుడైన ఆ పరమేశ్వరుడు ఎన్నో వైదికధర్మాలను, నియమాలను వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, అనేకగ్రంథాలద్వారా మనకు తెలియజేశాడు. జీవితం సుఖమయంగా ఉండాలంటే మనం చేయాల్సిందల్లా ఆ రుద్రుడు అత్యంతప్రీతితో, కరుణతో మనకు తెలిపిన ధర్మాలను, నియమాలను ఆచరణలో పెట్టడమే కదా!

వీటిలోని అంతర్భాగమే ఆ పరమశివుడు మనకు ప్రసాదించిన రుద్రాక్షలు. ఆ రుద్రాక్షలధారణ, వాటి మహిమలు, రుద్రాభిషేకంతో ఆ పరమేశ్వరుణ్ణి అర్చించేవిధానం, రుద్రాభిషేక మహిమ, ఆనందం, దానివల్ల కలిగే సుఖసంతోషాలనుగురించి తెలుసుకుందాం.

### రుద్రాక్షలపుట్టుక

రుద్రాక్షధారణ వాటి మహిమలగురించి రుద్రాక్ష జాబాలోపనిషత్‌లో చాలా వివరంగా తెలుపబడింది. ఆ పరమేశ్వరునికే మరోపేరు రుద్రుడు. త్రిపురాసురసంహారానికి ముందు ఆ పరమశివుడు కళ్ళు మూసుకొని తపస్సులో నిమగ్నమైన సమయంలో స్వామి కళ్ళకనుకొలకులనుంచి కొన్ని నీటి బిందువులు రాలి ఈ భూమిమీద పడ్డాయి, అవే రుద్రాక్ష వృక్షాలుగా మారాయి. ఆ రుద్రాక్షవృక్షాలే మనకు రుద్రాక్షలను ప్రసాదిస్తున్నాయి. అవి సాక్షాత్ ఆ శివునిస్వరూపాలే. రుద్రాక్షలో స్వయంగా రంధ్రం ఉన్నది. అది ఎంతో ప్రశస్తమైనది. గీటు రాయిమీద గీస్తే బంగారంరంగులాంటి గీతపడితే ఆ రుద్రాక్ష ఎంతో గొప్పదంటారు. చక్కగా సమానంగా, గట్టిగా ఉన్న రుద్రాక్షని పట్టుదారంతో బంధించి ధరిస్తే ఎంతో మంచిది.

### రుద్రాక్షధారణ

రుద్రాక్షమూలంలో బ్రహ్మ, దానినాళంలో విష్ణువు, ముఖస్థానంలో రుద్రుడు కొలువై ఉంటారని మహర్షులమాట. దానికుండే బిందువు సకలదేవతాస్వరూపం. రుద్రాక్ష ధరిస్తే పుణ్యం కలుగుతుంది, పాపం నశించిపోతుంది. దీనికి కారణం మన మనస్సు మంచిమార్గంవైపు పయనించటమే అని తెలుసుకోవాలి. రుద్రాక్షధారణగురించి తెలుసుకుందాం.

శివభక్తులు అందరూ 108 రుద్రాక్షలు కలిగిన మాలని మెడలో ధరిస్తారు. ఈ రుద్రాక్షలని శరీరంమీద ధరించేటప్పుడు

ఈ మంత్రాలని పఠించాలి. అవి– ముందుగా తలమీద ఈశాన మంత్రంతో, కంఠంమీద ధరించేటప్పుడు తత్పురుషమంత్రంతో, హృదయంమీద ధరించేటప్పుడు అఘోరమంత్రంతో ధరించాలి. ఈ మంత్రాల అనుష్ఠానం ఇబ్బందిగా ఉన్నవారు ఆ పరమశివుని పంచాక్షరిమంత్రమైన "ఓం నమఃశివాయ" అనే మంత్రాన్ని పఠిస్తూకూడా ధరించవచ్చు. ఈ రుద్రాక్షల్ని ఉత్తరాయణపుణ్య కాలంలో, మకరసంక్రమణంలో, అమావాస్య, పౌర్ణమి తిథుల నాడు ధరించటం ఎంతో విశేషం.

## రుద్రాక్షలలోని బేధాలు, వాటి స్వరూపాలు, పుణ్యఫలాలు

ప్రధానంగా 14 రకాల రుద్రాక్షల గురించి తెలుసుకుందాం.

**01) ఏకముఖిరుద్రాక్ష–** ఇది పరతత్వస్వరూపం, దీన్ని ధరించి అనుష్ఠానం చేసినవాడు ఇంద్రియాల్ని జయిస్తాడు.

**02) ద్విముఖిరుద్రాక్ష–** ఇది అర్ధనారీశ్వరతత్వానికి చిహ్నం. దీన్ని ధరిస్తే ఉమాపతి కరుణిస్తాడు.

**03) త్రిముఖిరుద్రాక్ష–** ఇది అగ్నిస్వరూపం. దీన్ని నిత్యం ధరిస్తే అగ్నిదేవుడు ప్రీతి చెందుతాడు.

**04) చతుర్ముఖిరుద్రాక్ష–** ఇది బ్రహ్మస్వరూపం. దీన్ని ధరించటం వల్ల సృష్టికర్త సంతసిస్తాడు.

**05) పంచముఖిరుద్రాక్ష–** ఇది పంచవక్త్రుడైన శివస్వరూపం. దీన్ని ధరిస్తే అనేకదోషాలు తొలగుతాయి.

**06) షణ్ముఖిరుద్రాక్ష–** ఇది కుమారస్వామిస్వరూపం. దీన్ని ధరిస్తే కుమారస్వామి అనుగ్రహం కలుగుతుంది, తద్వార ఆరోగ్యం, సంపదలు కలుగుతాయి. జ్ఞానసంపద కలుగుతుంది. ఈ షణ్ముఖిరుద్రాక్షకి అధిదేవత శ్రీవినాయక స్వామి.

**07) సప్తముఖిరుద్రాక్ష–** సప్తమాతృకలు దీనికి అధిదేవతలుగా ఉంటారు. దీన్ని ధరిస్తే సంపదలు, జ్ఞానవైరాగ్యాలు లభిస్తాయి.

**08) అష్టముఖిరుద్రాక్ష–** ఇది అష్టవసువులకి అత్యంత ప్రీతికరమైనది. దీన్ని ధరించినవారు అందరి మన్ననలను పొందుతారు. వాక్శుద్ధి కలుగుతుంది.

**09) నవముఖిరుద్రాక్ష–** నవశక్తులు దీని అధిదేవతలు. దీన్ని ధరిస్తే నవశక్తుల అనుగ్రహం కలుగుతుంది.

**10) దశముఖిరుద్రాక్ష–** దీనికి యముడు అధిదేవత. దీన్ని ధరిస్తే అత్యంత ధర్మశీలత అలవడుతుంది.

**11) ఏకాదశముఖిరుద్రాక్ష–** దీనికి ఏకాదశరుద్రులు అధిదేవతలు. దీన్ని ధరిస్తే సౌభాగ్యం కలుగుతుంది.

**12) ద్వాదశముఖిరుద్రాక్ష–** ఈ రుద్రాక్ష మహావిష్ణుస్వరూపం. దీనికి ద్వాదశాదిత్యులు అధిదేవతలు. దీన్ని ధరించటం వల్ల పన్నెండుమంది సూర్యులఅనుగ్రహం కలుగుతుంది.

**13) త్రయోదశముఖిరుద్రాక్ష–** ఇది మన్మథ సంబంధమైనది. దీన్ని ధరించటంవల్ల అన్యోన్యదాంపత్యం కలుగుతుంది.

**14) చతుర్దశముఖిరుద్రాక్ష–** ఇది రుద్రుడి నేత్రంనుంచి ఆవిర్భవించింది. ఈరుద్రాక్షధారణ సకలవ్యాధుల్ని పోగొట్టి ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది.

ఈ రుద్రాక్షలధారణగురించి విన్నా, చదివినా, ధరించినా ఎన్నో గోవులను దానంచేసిన ఫలితంకూడా కలుగుతుంది. అయితే ఈ రుద్రాక్షధారణవిషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా తెలుసుకోవాలి: ఈ రుద్రాక్షలగురించి తెలిసినవారిదగ్గరే వీటిని పొందాలి. ధరించేటప్పుడు గురువుని ఆశ్రయించి ధరించాలి. అంతేకాకుండా ఈ రుద్రాక్షమహిమలు పొందాలంటే వాటికి సంబంధించిన నియమాలను, నిష్ఠను పాటించాలి.



**41వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**



హోమాలు చేయించే శివభక్తులు రుద్రాక్షలు ధరించే హోమాలు చేయిస్తారు. రక్ష కలిగించేది, మంచిఆరోగ్యాన్ని ప్రసాదించి మృత్యువునుంచి కాపాడేది అయిన ఈ రుద్రాక్ష ధారణ ఎంతో పుణ్యమోక్షఫలదాయిని.

## రుద్రాభిషేకం

ఆ పరమేశ్వరుణ్ణి రుద్రాభిషేకంతో అర్చనచేస్తే ఎంతో అమోఘమైన పుణ్యఫలితాలు వస్తాయి. కృష్ణయజుర్వేదంలోని మంత్రభాగమైన 11 అనువాకల శతరుద్రీయానికి రుద్రం అని పేరు. ఈ రుద్రార్చన ఐదుస్థాయిలలో చేస్తారు.

**01)** ఒకసారి 11 అనువాకాలని నమకచమకముల మంత్రాలతో ఆ రుద్రునికి అభిషేకం చేస్తే ఏకరుద్రాభిషేకం అంటారు.

**02)** అదే 11సార్లు రుద్రమంత్రాలతో అభిషేకం చేస్తే ఏకాదశ రుద్రాభిషేకం అంటారు.

**03)** 121సార్లు రుద్రాన్ని పఠిస్తూ అర్చనచేస్తే దానిని లఘు రుద్రాభిషేకం అంటారు.

**04)** 11సార్లు చేసే లఘురుద్రాభిషేకాన్ని మహారుద్రం అంటారు.

**05)** 11 మహారుద్రాలమంత్రాలతో చేసే రుద్రాభిషేకాన్ని అతి రుద్రాభిషేకం అంటారు

ఈ రుద్రమంత్రాలని పఠిస్తూ శివలింగానికి పంచామృతాలతో (ఆవుపాలు, ఆవునెయ్యి, పెరుగు, మధు, చక్కెర) అభిషేకం చేస్తే మనల్ని ఆశ్రయించి ఉండే సమస్త మాయా దోషాలు తొలగి జీవితం సుఖసంతోషాలతో గడిచేటట్లుగా ఆ పరమశివుడు మనల్ని అనుగ్రహిస్తాడు. ఇందులో ఎటువంటి సందేహంలేదు. నారుద్రో రుద్రమర్చయేత్, రుద్రుడు కానివాడు రుద్రాభిషేకానికి అర్హుడు కాదు. ఇది ప్రమాణవచనం. నిష్ఠ గరిష్ఠత కూడా అంతే అవసరం సత్ఫలితాలను పొందటానికి.

ఈ రుద్రమంత్రాలలో ముందుభాగమైన నమకంలో మమ్మల్ని చల్లగా చూడు తండ్రీ అని ఆ పరమేశ్వరునికి భక్తుడు చేసే ప్రార్థన అయితే, చమకమంత్రాలలో ఆ సర్వేశ్వరుడు భక్తుని అనుగ్రహించే ఆశీర్వచనంగా తెలుసుకొనవచ్చు.

## రుద్రాభిషేకంతో ఆ పరమేశ్వరునికి అర్చన, అభిషేకం చేస్తే కలిగే అద్భుతమైన ఫలితాలు

కామ, క్రోధ, మోహ, లోభ, మదమాత్సర్యాలనే దుర్గుణాలు నశిస్తాయి. మనిషి సన్మార్గంలో నడుస్తాడు. దుఃఖాలు తొలగుతాయి. ఐశ్వర్యం కలుగుతుంది. అనారోగ్యం తొలగుతుంది. పుత్రపౌత్రాదులతో, సుఖసంతోషాలతో జీవితం గడుస్తుంది. మనమందరం పై చెప్పిన విషయాలను గ్రహించి రుద్రాక్షలను తగువిధంగా ధరించి ఆ దేవదేవుడైన పరమేశ్వరుణ్ణి రుద్రాభిషేకాలతో యథాశక్తితో అర్చించి ఆ స్వామి అనుగ్రహానికి పాత్రులమవుదాం!!

## వైకుంఠపాళి
### :: 85 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 అ | | 2 రా | | 3 ప్ర | చే | 4 త | సు | డు |
| నూ | | 5 గి | ర | | | స్వి | | |
| 6 రు | క్మి | | 7 వి | 8 జ | య | | 9 ఉ | |
| డు | | 10 మా | | య | | 11 వి | ష | య |
| | | 12 ధ | ర్మ | ధ్వ | జు | డు | | |
| 13 ఉ | | వి | | జు | | 14 పు | 15 లో | మ |
| 16 శ | ని | | 17 వ | డు | గు | | భి | |
| న | | | సు | | 18 రు | చి | | 19 మ |
| | 20 న | ర్మ | ద | | డు | | 21 వా | ణి |

## మన మహర్షులు - వైదిక విజ్ఞానం

# బ్రహ్మర్షి కపిలమహర్షి

- డా।। పి.లలితవాణి, 98490 26107

శ్రీమహావిష్ణువు ధరించిన ఇరవైఒక్క(21) అవతారాలలో కపిలుని అవతారం ఒక ప్రధానమైన అవతారం. సాంఖ్యయోగ విపులీకరణకు, జీవేశ్వరతత్త్వజ్ఞాననిరూపణకు, యోగలక్షణ వివరణకు, జీవన్ముక్తిసంపాదనకు, భక్తియోగసాధనకు కపిల స్మృతిని తప్పక పఠించాలి. క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. సాంఖ్య యోగబోధకుడైన కపిలమహర్షి సాక్షాత్తు పరబ్రహ్మ. నవప్రజా పతులలో ఒకడైన కర్దమప్రజాపతికి, దేవహూతికి జన్మించిన వాడు కపిలుడు. మాతృదేవత అయిన దేవహూతికే భక్తియోగాన్ని విడమరిచి తెలియజెప్పిన మహానుభావుడు కపిలుడు. శివుని గురించి తపస్సుచేసి బ్రహ్మర్షిస్థానాన్ని పొందాడు. యోగనిష్ఠలో పరమాత్మను దర్శించాడు. భక్తులకు పరమాత్మను దర్శింప చేశాడు. పరమాత్ముడు త్రిగుణాలైన సత్త్వరజస్తమోగుణాలకు అతీతుడై వాటిని తానే నడిపిస్తుంటాడు. ఆ మూడింటికీ ఆయనే అధినేత. జీవుడు ఈ మూడుగుణాలతో నిండిన ప్రకృతిలో చిక్కుకుపోతాడు. జీవాత్మయొక్క, పరమాత్మయొక్క తత్వాన్ని తెలుసుకొని-బుద్ధి ఇతరవిషయాల వేటి జోలికీ పోకుండా ఆత్మ నాయకుడైన నారాయణుని మాత్రమే దర్శిస్తుంది. బుద్ధి అలా చూడగలిగితే అహంకారం తొలగిపోతుంది. సత్యస్వరూపం ప్రకాశిస్తుంది. అప్పుడే సర్వవ్యాపకుడైన పరబ్రహ్మదర్శనం జరుగుతుంది. ఆత్మతత్త్వాన్ని తెలుసుకోగలిగితే పరమాత్మ స్వరూపం తేటతెల్లమవుతుంది. మనస్సు, బుద్ధి, అహంకారం అనే మూడింటిలో కనిపించే ప్రకాశతత్త్వంద్వారా ఆత్మ అంటే ఏమిటో తెలుసుకోవచ్చు. ఆత్మజ్ఞానసంపన్నులైన మహనీయులకు వారి వారి ఆత్మలలో దర్శనమిస్తూనే ఉంటాడు. పరమాత్మనే ధ్యానిస్తూ భావిస్తూ ఉండే ఆత్మ భగవంతునితో విడివడలేని సంబంధాన్ని కలిగి ఉండడంతో జీవుడు పరమాత్మను దర్శిస్తాడు.

భగవత్తత్త్వాన్ని తెలుసుకోవాలంటే మొట్టమొదటగా జీవుడు తన ధర్మాలను తాను సక్రమంగా నెరవేర్చాలి. అంతఃకరణాన్ని ఎప్పుడూ నిర్మలంగా ఉంచుకోవాలి. భగవంతుని కథలను వినడంవల్ల, కోరికలను త్రుంచి వేసే విరక్తివల్ల, యోగాభ్యాసంచేత, తపస్సుచేత, ఏకాగ్రత నిలపడంవల్ల- అచంచలమైన దృష్టితో భగవ త్సాక్షాత్కారంకోసం సాధనచేస్తే జీవునిలోని ప్రకృతి లక్షణాలన్నీ కనుమరుగై పరమాత్మదర్శనానికి దారినిస్తాయి. స్వప్నం ఏ విధంగా పురుషుని బాధించలేదో, అదేవిధంగా ప్రకృతికూడా భగవంతుని ఏమీ చేయలేదు. ఆత్మను తెలుసుకొన్న వాడు, మోక్షం లభించేవరకు ఎన్నిజన్మలైనా సరే ఎత్తుతూనే ఉంటాడు. ఆధ్యాత్మికవిషయాలను సంపూర్ణంగా గ్రహించి పర మాత్మునిదయకు పాత్రుడౌతుంటాడు.



మనిషికి మోక్షం లభించాలంటే అనేకమైన అంత రాయాలు కలుగుతుంటాయి. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం, వశిత్వం అనే అష్టసిద్ధులు లభిస్తే ఆ జీవి ఇంక ఏ కోరికా కోరదు. సకలఐశ్వర్యాలను, సర్వవాంఛ లను సమకూర్చే సిద్ధులుంటే ఇక మోక్షంతో పనేమిటనిపిస్తుంది. మృత్యువు గుర్తుకు రాదు. భగవంతుని పాదపద్మాలను ఆశ్ర యించేవ్యక్తి మృత్యుదేవతను పరిహసించి ముక్తిని పొందుతాడు. విషయవాంఛలను వదిలివేసి, అష్టసిద్ధులను కూడా తిరస్కరించి పరమాత్మమీద ఏకాగ్రచిత్తం పెట్టుకుంటేనే ఆ వ్యక్తి భగవత్ కృపకు పాత్రుడై సాయుజ్యాన్ని పొందగలుగుతాడు.

ఆధ్యాత్మికమార్గంలో నడిచేవారు-శాస్త్రాలలో నిషిద్ధ కర్మలుగా చెప్పబడిన కర్మలను చేయకూడదు. దైవికంగా వచ్చే ధనధాన్యాదులను స్వీకరించి తృప్తిచెందాలే కాని అధికసంపదల కాశించరాదు. పరులవస్తువులను అపహరించడం నేరంగా భావించాలి. శుద్ధమైన మితాహారాన్ని మాత్రమే భుజించాలి. ఏకాంతప్రదేశంలో జీవితం గడపాలి. హింసాప్రవృత్తి మానాలి. సత్యమార్గాన్ని అవలంబించాలి. ధర్మమార్గాన్ని అనుసరించాలి. మౌనం వహించాలి. బ్రహ్మచర్యం, తపోనిష్ఠ, శౌచవర్తనం, ఆత్మ గుణాలుగా పాటించాలి. సద్గ్రంథాలను చదవాలి. భాగవతు లను భగవంతుని సేవించినట్లే సేవించాలి. భగవ ద్ధ్యానాన్ని అలవరచుకోవాలి. ఎల్లవేళలా మోక్షాసక్తిని పెంపొందించుకోవాలి. ధ్యాననిమగ్నుడు ప్రాణ వాయువును స్వాధీనపఱచుకొంటాడు. తద్ద్వారా ఇంద్రియవాంఛలు నిగ్రహింపబడతాయి. మనస్సు స్థిరంగా నిలుస్తుంది. మూలాధారంలో ప్రాణధారణ చేయవచ్చు. ఏకాగ్రతతో సర్వేశ్వరుని అర్చించవచ్చు. భగవం తుడు సర్వభూతరాశులలో ఉన్నాడని గ్రహించి సర్వసమాన

దృష్టిని కలిగిఉంటే ఆ వ్యక్తిలో యోగలక్షణాలున్నాయని తెలుసుకోవచ్చు. ఇన్ని మంచిగుణాలు కలిగిన యోగి చెడువిషయాలను వదిలివేయాలి.

యోగి అయినవాడు తీవ్రమైనసాధనతో మనసును నిర్మలం చేసుకుని ప్రాణవాయువును వశపరచుకొంటాడు. నిశ్చలమైన ధ్యానం సమస్తదోషాలను, సత్త్వరజస్తమోగుణాలను నశింపచేస్తుంది. యోగి తనదృష్టిని నాసాగ్రంపై స్థిరంగా నిలిపి భగవంతుణ్ణే దర్శిస్తూంటాడు. అటువంటి మహాయోగి దృష్టికి పరంధాముడు–పీతాంబరధారిగా, శంఖచక్రగదాపద్మహస్తుడిగా, సచ్చరిత్రుడిగా, బహుసుందరాకారుడిగా, భక్తలోకపూజితుడిగా దర్శనమిచ్చి ఆ భక్తునిసేవలను ప్రియాతిప్రియంగా అందుకుంటాడు. భగవంతుని పాదపద్మాలను చింతించే పరమయోగి మనసు మరి దేనివైపుకు మరలిపోదు. నిజమైన యోగి నిర్మలాంతఃకరణంతో జగన్నాథుని ప్రత్యంగాన్నీ ధ్యానిస్తూ, పులకరించిపోతుంటాడు. ఏకాగ్రచిత్తంతో నఖశిఖపర్యంతం ఆ దేవదేవుని చూస్తూనే ఉంటాడు. తలపోస్తూనే ఉంటాడు. స్తుతిస్తూనే ఉంటాడు. ధ్యాననిష్ఠ, ధారణ అంత గొప్పవి. పురుషుడు– తన సుఖదుఃఖాలగురించి ఆలోచించకుండా, అహంకార మమకారాలను విసర్జించి, ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవటానికి భగవచ్చింతనతో కాలం గడిపినప్పుడు జీవన్ముక్తుడనిపించుకుంటాడు. తానుగాని, తన దేహంగాని నశించిపోయేవని, అవి దైవాధీనాలని గ్రహిస్తాడు. ఆత్మఒక్కటే శాశ్వతమని, ఆ ఆత్మకూడా పరమాత్మలోని భాగమే అని అర్థం చేసుకుంటాడు. జీవితం బుద్బుదప్రాయమనే నిర్ణయానికి వస్తాడు. సంసారబంధాలనన్నిటినీ వదిలించుకొని పరమాత్మసన్నిధే పరమావధి అనుకొని తదేకధ్యానంతో మసలుతుంటాడు.

భక్తియోగం మహత్తరమైనయోగం. తామసభక్తి– అజ్ఞానంతో కూడి ఉంటుంది. ఇతరులను హింసిస్తూ ఆడంబరాలకు పోయేవాడు తామసుడు. అతనిలో అసూయ, రోషం ఉంటాయి. తోటివారిపట్ల భేదబుద్ధి కలిగి భగవంతుని మాత్రం ఘనంగా పూజించేవాని భక్తిని 'తామసభక్తి' అంటారు. తనకు ఐశ్వర్యమున్నదనే గర్వంతో అత్యధికంగా ధనం వ్యయం చేసి పేరుకోసం, మరింత సంపదకోసం దేవుని పూజిస్తే అది– రాజసభక్తి అనిపించుకుంటుంది. భగవంతునియందు అచంచలమైన భక్తివిశ్వాసాలు కలిగి, తాను చేసే ప్రతిపనిని భగవదర్పితం చేస్తూ ఎల్లవేళలా భగవంతుని కొలుస్తూ ఉండడమే సాత్త్వికభక్తి. ఏ కోరికాలేకుండా, ఏ ఫలితాన్నీ ఆశించకుండా నిర్హేతుకంగా భగవంతుని కొలవటమే నిజమైన భక్తి. నిష్కాములై సాధన చేసేవారికి తప్పక ముక్తి లభిస్తుంది. అది సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యముక్తులలో ఏ ఒకటైనా కావచ్చు. కేవలం భగవదారాధనకై పరిమితమైన చర్యలతో కూడి ఉండే భక్తిని "ఆత్యంతిక భక్తియోగం" అంటారు. పరమాత్ముని చేరుకోవటానికి యోగాభ్యాసం ఎంతో అనువైనది. తనకంటే అధికులపట్ల గౌరవం, సములపట్ల స్నేహం, తక్కువవారిపట్ల దాక్షిణ్యం చూపాలి ఏ భక్తుడైనా.

పరమాత్ముని జీవాత్మ చేరుకోవాలన్నా, ఆ పరంజ్యోతిలో జీవాత్మ ఐక్యం చెంది జీవన్ముక్తిని పొందాలన్నా, సాంఖ్యయోగాన్ని, భక్తియోగాన్ని అవగతం చేసుకొని వాటినెలా ఆచరించాలో– దేవహూతికి వివరించి చెప్పటమే కాక, తద్వారా సమస్త ప్రజానీకానికి బోధపరిచాడు సాంఖ్యయోగశాస్త్రకారుడైన కపిలమహర్షి. మహర్షులందరూ విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానకారులే. కపిలమహర్షి భక్తియోగప్రవక్తకూడా. సాక్షాత్తు భగవంతుడైన కపిలమహర్షి, తాను దేవుడైనా పాతాళలోకంలో ఏకాంత ప్రదేశంలో కూర్చొని పరమేశ్వరునిగురించి అఖండతపస్సుచేసి యోగనిష్ఠలో మునిగిఉండే నిష్కామకర్మయోగి. దృష్టిమాత్రంచేతనే సృష్టిని భస్మం చేయగల సమర్థుడు. దానికి సగరపుత్రులే ప్రబల నిదర్శనం. సద్భక్తునిమీద కరుణామృతదృష్టిని ప్రదర్శింప చేయగల బ్రహ్మర్షి. శాపానుగ్రహసమర్థుడు కావటంవల్లనే భగీరథుడికి యజ్ఞాశ్వాన్ని ప్రసాదించాడు. అటువంటి కపిలమహర్షి చేత ఆరాధింపబడిన పరమేశ్వరుడు కృతయుగంలో కపిలేశ్వరుడిగా ప్రసిద్ధిచెందాడు. త్రేతాయుగంలో అగ్నిచేత అర్చింపబడడంవల్ల అగ్నిలింగంగా ప్రఖ్యాతి చెందటం జరిగింది. పాతాళాన్ని అతిక్రమించి, భూమిని చీల్చుకొని వచ్చి తిరుపతి దగ్గర సేవించబడుతూ ఈశ్వరుడు కపిలలింగంగా విఖ్యాతి చెందాడు. కలియుగంలో కపిలగోవుచేత పూజింపబడటంవల్ల కపిలలింగంగా ఆరాధింపబడుతున్నాడు. ముల్లోకాలలోని సకల తీర్థాలు ముక్కోటిపౌర్ణమినాడు కపిలేశ్వరుని (కపిలలింగం) చెంత ఉన్న కపిలతీర్థంలో నిలుస్తాయన్నది జనవాక్యం. కపిలమహర్షి చేత ఆరాధింపబడి, ఆయనతపస్సుకు మెచ్చి వరాలిచ్చిన ఈ కపిలలింగేశ్వరుడు, ముక్తిప్రదాయకమైన కపిలతీర్థమూ కలియుగవాసులకు అత్యంత వరప్రదాయకాలై వెలసి ఉండటం మనందరి పూర్వజన్మసుకృతమనే చెప్పాలి.

*సర్వేజనాః సుఖినో భవంతు.*

## 108 దివ్యదేశాలు

# తిరువాదనూర్

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్

శ్లో॥ ఆదనూర్ నగరే దివ్యే సూర్య పుష్కరిణీ యుతే
శ్రీరంగనాయకీ నాథః ప్రణవాఖ్య విమానగః।
ఆండాళక్కుం మెయ్యనాఖ్యః ప్రాగ్ ప్రాన్ముఖో భుజగేశయః
రాజతే కామధేన్వక్షి గోచరో కలిజిన్నుతః॥

దివ్యదేశం పేరు తిరువాదనూర్. ఈ దివ్యదేశం తిరువరంగం, అలాగే తిరుపుళ్ళంబూదంగుడి అనే క్షేత్రాలవలె కావేరి నదీతీరంలో రెండుపుణ్యతీర్థాల మధ్య, రెండుప్రాకారాలతో, రాజగోపురంతో అత్యద్భుతంగా విలసిల్లుతున్నది. ఈ దివ్యదేశం స్వామిమలైనుండి 3కిలోమీటర్ల దూరంలో ఉన్నది. పుళ్ళంబూదంగుడిఅనే క్షేత్రానికి సమీపంలో అత్యద్భుత ప్రకృతిశోభతో విలసిల్లుతున్నది. అహోబిలమఠంవారి అధీనంలో ఈ దివ్యక్షేత్రం ఉన్నది.

క్షేత్రాధిపతి భగవంతుడు భుజంగశయనంతో "ఆండాళుక్కుమెయ్యన్" అనేపేరుతో విరాజిల్లుతున్నాడు. విశేషంగా ఈ స్వామి తన శిరస్సునందు ధాన్యాలను కొలిచే కుంచంతో, అలాగే ఒకచేతిలో తాళపత్రాలను రాసేటట్టు తూర్పుముఖంగా వేంచేసి ఉంటాడు. ఈ స్వామిని తిరుమంగైఆళ్వార్లు మంగళాశాసనం చేసి ఉన్నారు. శ్రీరంగం రంగనాథునివలె వీరుకూడా వేంచేసి ఉన్నారు. మూలమూర్తి పాదములయందు కామధేనువు నంది, తిరుమంగైయాళ్వార్లు, అగ్నిదేవుడు వీరందరూకూడా ఆ స్వామి వారిని సేవిస్తూ వేంచేసి ఉన్నారు.

స్వామి ఉత్సవమూర్తిపేరు 'అళగియణవాళన్', తాయారు శ్రీరంగనాయకిఅమ్మవారు. కమలవాసిని అని మరోపేరు. ఉత్సవ మూర్తికి శ్రీచక్రనివాసిని, భార్గవి అని పేర్లు. స్థలపురాణాలు ఎన్నో ఉన్నప్పటికీ అందులో ఒకటి – బ్రహ్మదేవుని ఐదవతలను పరమశివుడు నరికేశాడు. బ్రహ్మహత్యాదోషం అతనికి కలిగింది. కపాలం అతనిచేతిలోనే ఉండి అతుక్కుపోయింది. దానిని ఒక్కసారి దహించేద్దామని శివుడు అగ్నిదేవుణ్ణి అడిగాడు.



ఆ దోషమే అగ్నిదేవునికీ వచ్చి పడింది. అగ్ని ఈ దివ్యక్షేత్రానికి వచ్చి తపస్సుచేసి తన దోషాన్ని పోగొట్టుకున్నాడని ఐతిహ్యం. అందువల్ల గర్భగృహంలో భగవంతుని పాదాలక్రింద అగ్ని దేవుడు కూడా వేంచేసి ఉంటాడు.

ఇంకో స్థలపురాణమేమంటే ఓసారి భగవంతుడు ఏకాంతంగా ఉండాలని ఆదనూర్ దివ్యదేశానికి విచ్చేశారట. ఆసమయంలో ఆదిశేషుడు భగవంతుణ్ణి వెతుక్కుంటూ ఈ క్షేత్రానికి వచ్చాడట. అతణ్ణి భగవంతుడడిగాడు నీవు ఎవరు? అని. అయ్యో స్వామి నేనే ఆదిశేషుణ్ణి మీకు తెలీదా అన్నాడు. దానికి ఏమైనా ఆధారం ఉన్నదా? అని అడిగాడు. ఆదిశేషుడు పలుఆధారాలను చూపెట్టి భగవంతుడికి ఒక నమ్మకాన్ని కలిగించాడు. అప్పుడు స్వామి ఆదిశేషునికి శంఖచక్రాంకిత సమాశ్రయణం చేశాడట. ఇప్పటికీ ఇక్కడ ఆదిశేషుని భుజములయందు చక్రాంకితములు కనిపిస్తూ ఉంటాయి.

తమిళభాషలో "ఆ" అనే శబ్దానికి 'పశువు' అని అర్థం. పశువును కల క్షేత్రం కనుక "ఆదనూర్" అని ఈ క్షేత్రం పిలువబడుతోంది. ఈ క్షేత్రంవైభవాన్ని చూస్తే, పాలకడలినుండి మహాలక్ష్మి అవతరించకముందే కామధేనువు ఇక్కడకు వచ్చిందట. మహాలక్ష్మికన్నాకూడా నేనేమిన్న అనే పేరు, గొప్పదనం కావాలని కామధేనువు కోరిందట. స్వామి ప్రత్యక్షమై "నేను ఏదైనా ఇస్తాను అందరికి. అదేప్రకారం నీకు ఎవరు ఏది అడిగినా కూడా ఇచ్చేటువంటి ఒకశక్తిని ఇస్తాను" అని చెప్పాడు. కానీ కామధేనువు "అదికాదు స్వామి, నాకు మహాలక్ష్మికన్నా కూడా ముఖ్యత్వాన్ని మీరు ఇవ్వాలి" అని అడిగాడు. వెంటనే స్వామి "సరే నేను ఒక కుంచాన్ని ఇస్తాను, నీవు ఆ కుంచంతో ఈ పాత్రను ధాన్యాలతో నింపు" అని చెప్పాడు. కామధేనువుకి ఆ కుంచంతో ఎంత కొలిచిపోసినా కూడా ఆ పాత్ర నిండలేదట. అపుడు భగవంతుడు మహాలక్ష్మిని పిలిచి, 'కుంచంతో కొలిచి ఈ పాత్రను నింపు' అని చెప్పాడు. ఆ తల్లి భగవంతునికి నమస్క



రించి, ఆ భగవంతుని తులసిమాలనుండి ఒకేఒక తులసిదళాన్ని తీసుకొని ఆ కుంచంలో వేసి, కొలిచిపోయగా, ఆ పాత్ర నిండి పోయింది. అపుడు భగవంతుడు కామధేనువును చూసి 'భక్తి ఒక్కటే అన్నింటికీ కూడా ముఖ్యం. అహంకారం కూడదు' అని గుణపాఠాన్ని నేర్పాడు. ఆ కారణంచేత నందినిధేనువుతోపాటు కామధేనువునికూడా అనుగ్రహించాడు శ్రీమహావిష్ణువు.

శ్రీరంగం రంగనాథస్వామి ప్రాకారాలను తిరుమంగై ఆళ్వార్లు నిర్మిస్తున్నారట. ధనాభావంచేత పని నిలిచిపోయింది. ఆళ్వార్లు రంగనాథస్వామితో 'మీరే నాకు దారి చూపెట్టాలి, మీరే అనుగ్రహించాలి' అని ప్రార్థించాడట. రంగనాథుడు ఆరోజు రాత్రి తిరుమంగైఆళ్వార్ల కలలో కనిపించి 'ఇక్కడినుంచి కొద్దిదూరంలో ఒకవ్యాపారి ఉన్నాడు. మీరు వెళ్లి అడిగితే అతను అన్నీ ఇచ్చేస్తాడు' అని చెప్పాడు. ఆహా! భగవదనుగ్రహం అని భావించి కావేరినదితీరానికి వెళ్లి అక్కడ చూశాడట. పెద్ద స్వరూపంతో ఒకరు ఒకచేతిలో కుంచం, వేరొకచేతిలో ఒక తాళపత్రం పెట్టుకుని ఉన్న అతడు కనిపించాడట. అతను నీకు ఏమి కావాలి అని ఆళ్వార్లను అడిగాడు. తనయొక్క స్థితిని విన్న వించాడు. అతడు తనచేతిలోఉన్న కుంచెతో ఆ కావేరినది ఇసుకను అలా కొలిచిపోశాడట. అదంతా బంగారుమయమై పోయిందట. ఎవరైతే శ్రద్ధతో కైంకర్యం చేస్తారో, వాళ్లకు ఆ ఇసుక బంగారంలాగా, మిగతావాళ్ళకి ఇసుకలాగా కనబడిందట. అందువల్ల మిగిలినవాళ్ళు కోపంతో అతణ్ణి కొట్టడానికి వెంట పడ్డారట. ఆ వ్యాపారి తిరువాదనూరుక్షేత్రం పరుగెత్తాడట. తిరుమంగైఆళ్వారు కూడా వారితోపాటు పరుగెత్తాడట. అలా వెళ్లిచూడగా భగవంతుడు ఆదిశేషునిపై పవ్వళించి, తన శిరస్సున ఆ కుంచాన్ని ధరించి, తన ఎడమచేతిలో ఒక చక్కటి తాళ పత్రాన్ని ధరించిన దర్శనభాగ్యాన్ని అందించాడట. కనుక ఈ క్షేత్రంలో ఈనాటికికూడా భగవంతుడు కుంచం మరియు తాళపత్రంతో దర్శనభాగ్యాన్ని అందిస్తున్నాడు. భగవంతుని మూలమూర్తి 'ఆండళుక్కు మెయ్యన్'. ఉత్సవమూర్తి 'అళగియమణ వాళన్', తాయర్లమూలవర్లు 'రంగనాయకి', 'కమలవాసిని'. ఉత్సవమూర్తి శ్రీచక్రనివాసిని, భార్గవి. సూర్యపుష్కరిణి. తీర్థం చంద్రపుష్కరిణి. ప్రణవకార విమానం. స్థలవృక్షం పున్నాగ వృక్షం. ప్రత్యక్షం అయింది భృగుమహర్షి, కామధేనువు, అగ్ని, తిరుమంగైఆళ్వార్లు మొదలైనవారికి. స్వామి పాంచరాత్రాగ మోక్తంగా ఆరాధనలను అందుకుంటున్నాడు. ఈ స్వామిని మనం దర్శించి మన సమస్తపాపాల్ని పోగొట్టుకొని, దేవదేవుని అనుగ్రహాన్ని పొందుదాం.

*"అన్నవనై ఆడనూర్ ఆండాళుక్కు మెయ్యనై"*

## గ్రంథసమీక్ష

### ఆర్షవిజ్ఞానదర్పణం
# పురాణదర్శనం

**ఆకృతి**-1/4 క్రౌన్‌బైండ్‌ఎడిషన్, **పుటలు**-1582; **వెల**-రూ.1503/-; **ప్రతులకు**- నవరత్న బుక్‌హౌస్, నెం.28-22-20, రెహమాన్‌వీథి, అరండల్‌పేట, విజయవాడ-520 002. దూరవాణి-0866-2432813

సనాతనధర్మసముచ్చయంలో పరిమళభరితాలు పురాణాలు. ప్రాచీనవైదికసాహిత్యాన్ని అధ్యయనం చేయలేని వాళ్లు ఈ పురాణవాఙ్మయాన్ని చదివి అవగతం చేసుకుంటే జన్మ తరిస్తుంది. దుష్కర్మ నశిస్తుంది. మేధ పరవశిస్తుంది.

భగవాన్ వేదవ్యాసమహర్షి రచించిన పురాణవాఙ్మయం మొత్తానికి వేదమే మూలకందం. ఎంతో గొప్పవైన అష్టాదశ పురాణాలను సరళవ్యవహార భాషలో సంగ్రహంగా రూపొందించి, ఆస్తికజనాలకి అందిస్తున్నారు, డా॥ జయంతిచక్రవర్తి. 'పురాణదర్శనం' పేరుతో వచ్చిన ఈ గ్రంథం ఒక ఆర్షవిజ్ఞాన సర్వస్వం. మాన్యులకు, ధీమాన్యులకు, సామాన్యులకు ప్రీతిపాత్రమైన సుకృతి ఇది. ప్రతిఒక్కరూ కొని, చదివి, పదితరాలు భద్రపరచుకోదగ్గ గ్రంథరాజం ఇది అనటంలో ఎలాంటి సందేహం లేదు.




*- డా॥చిలకపాటి విజయరాఘవాచార్యులు.*




# దర్శనమీయవా దేవా!

- శ్రీ పాదిరాజు సుబ్బారావు,
99669 87744

ఇది 19 సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన. డిసెంబరునెల 24వతారీఖున, నా పుట్టినరోజుసందర్భంగా స్వామివారి దర్శనంకోసం సిఫారసులేఖతో నా కుటుంబసభ్యులు ముగ్గురితో కలిసి తిరుమలకు వెళ్లడం జరిగింది.

సిఫారసులేఖలు స్వీకరించేకౌంటరుదగ్గర చేంతాడంత క్యూ ఉంది. ఆ ఆందోళనతోనే క్యూలైన్‌లో వేచి ఉన్నాను. కొద్దిసేపటికి కౌంటరువద్ద ఒక గలాటా జరిగింది. ఆ సంఘటనకు కౌంటరు మూసివేయడం జరిగింది. కొంతసమయం వేచి చూశారు అందరూ. ఇక లేఖలు తీసుకోరని భావించి వెనుదిరిగారు. నేనుకూడా చేసేది ఏమీ లేకపోయింది. స్వామి దర్శనంకాకుండా వెనుదిరిగడానికి నాకు ఇష్టపడలేదు. స్వామినే తలుచుకుంటూ దర్శనభాగ్యాన్ని ఎలాగైనా కలిగించుమని వేడుకున్నాను. అన్యమనస్కంగానే బస్టాండుకు నడుచుకుంటూ వెళ్తున్నాను. దారిలో ఓ బ్యాంకుశాఖ కనబడింది.

బ్యాంకు ఉద్యోగినైన నేను, బ్యాంకులో ఎవ్వరూ తెలియకపోయినా అయిష్టంగానే బ్యాంకుమేనేజరుదగ్గరికి వెళ్లాను. నేను తిరుపతిలో ఫలానాబ్యాంకులో మేనేజరుగా పనిచేస్తున్నానని చెప్పాను. నా గుర్తింపుకార్డు చూపించి పరిచయం చేసుకున్నాను. నా పరిస్థితిని వివరించాను. పుట్టినరోజువిషయం చెప్పి స్వామి దర్శనం కల్పించుమని కోరాను. అందుకు మేనేజరుగారు చాలా రద్దీగా ఉంది కాబట్టి సిఫారసులేఖలు ఆమోదించటం లేదన్నారు. ముందుగా తెలిసిఉంటే ఏర్పాటుచేసి ఉండేవాడినని చెప్పాడు. బ్యాంకువిషయాలు చర్చించుకుంటూన్నాం. అప్పుడు బ్యాంకుమేనేజరు వచ్చివారు పెట్టిన సిఫారసులేఖకు ఆరుమందికి అనుమతి ఉందన్నారు. అందులో ఇద్దరే ఉన్నారని తెల్పాడు. వెంటనే మేనేజరుగారు నన్ను ఉద్దేశించి 'స్వామివారు' మిమ్మల్ని పిలుస్తున్నారు వెళ్లండి' అని చెప్పారు. మా నలుగురిని ఆ ఇద్దరితో జతచేసి పంపమని మెసెంజరుతో చెప్పారు. మేనేజరుకు కృతజ్ఞతలు తెలిపి స్వామివారిదర్శనానికి బయలుదేరాం. ఆ స్వామిని దర్శించి ఆయనకృపకు పాత్రులమైనందుకు చెమర్చినకళ్లతో స్వామికి మనస్సులోనే కృతజ్ఞతలు తెలుపుకొన్నాను.

నిజంగా! నమ్మికొలిచేవారి కొంగుబంగారం ఆ బ్రహ్మాండనాయకుడే కదా!

శ్రీవేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన,
శ్రీవేంకటేశ సమోదేవో నభూతో, నభవిష్యతి.





# పరదేశంలో పరమవిష్ణులోకం అంగ్‌కోర్‌వాట్

– శ్రీ విద్వాన్ కె.సి.నాయుడు

ఒకప్పుడు షట్చక్రవర్తులు ఈ భూమండలం మొత్తాన్ని పరిపాలించారని పురాణాలమాట. ఇప్పటి భారతదేశం సరిహద్దులు ఒకప్పుడు విస్తారంగా ఉండేవని చరిత్రకారులమాట. దీనినే అఖండభారతదేశం అని పిలిచేవారు.

ఈ కోవలోకి వచ్చేదే ఒకప్పుడు కాంభోజరాజ్యం అని పిలువబడే నేటి కంబోడియా. కాంభోజరాజ్యం యూరోపియన్ల ఉచ్చారణకనుగుణంగా కంబోడియాగా మారింది. ఈ దేశంలో ప్రపంచంలోకెల్లా అతిపెద్ద హిందూదేవాలయం ఉంది. హిందూ సంస్కృతిసంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెబుతున్న ఈ దేవాలయం 500ఎకరాలలో చతురస్రాకారంగా నిర్మించబడింది. చుట్టూ నీటిమడుగుతో నిర్మించిన అతిపెద్ద విష్ణుదేవాలయం. ఒకసారి ప్రదక్షిణ చేయాలంటే 6కి.మీ. నడవాల్సి ఉంటుంది. కందకంలోని నీటిమట్టం ఏవైపుచూచినా ఒకేవిధంగా ఉండేట్లు నిర్మించారు. ఈ నీటిని వ్యవసాయావసరాలకుకూడా వినియోగించేవారు. ఈ దేవాలయం నిర్మించడానికి 30 సంవత్సరాలు పట్టింది. తమిళనాడులోని చోళరాజుల నిర్మాణపద్ధతులు ఈ దేవాలయంలో కనిపిస్తాయి.



దీనిని ఆ దేశరాజు రెండవసూర్యవర్మ 1113–1150 మధ్యకాలంలో నిర్మించాడు. సూర్యవర్మ తండ్రి ఆదిత్య, తల్లి నరేంద్రలక్ష్మి, రాజగురువు దివాకరపండితుడు. ఇతనికి దక్షిణ భారతదేశము నేలిన కులోత్తుంగచోళుడు మంచిమిత్రుడు.

ఈ దేవాలయం పడమరముఖద్వారం కలిగి ఉంది. రెండవప్రాకారం మొదటిద్వారంలోనే 13అడుగుల ఎత్తు కలిగిన అష్టభుజవిష్ణుమూర్తివిగ్రహం దర్శనమిస్తుంది. ఐదు అంతస్తుల గోపురాలు, మూడుప్రాకారాలతో నిర్మించబడిన ఈ దేవాలయాన్ని అక్కడి మేరుపర్వతంగా భావిస్తారు. ఇందు అతి పెద్ద పాకశాలలుకూడా నిర్మించిఉన్నారు.

ఈ దేవాలయం ఉచ్చస్థితిలో ఉన్నప్పుడు 2000మంది అర్చకులు, 2000మంది సేవకులతో ప్రతినిత్యం ధూపదీప నైవేద్యాలతో పూజలు చేసేవారు. ఆనాడు అత్యంత జనసంచారం కలిగినప్రదేశంగా కొనియాడబడింది. రాజు ఎక్కువసమయం అక్కడే గడిపేవాడు. రాచకార్యాలుకూడా అక్కడనుండే నిర్వహించేవాడు. అదే రాజధానిగా కొనసాగింది. ప్రతినిత్యం వేదపారాయణంతో కూడిన పరమవిష్ణులోకం. లక్షజనాభాతో విలసిల్లిన విశాలనగరం.

ఈ దేశ రాజముద్రగా గరుడునిపై ఉన్న విష్ణువు ఉన్నాడు. ఈ దేశజాతీయ పతాకంపై ఈ దేవాలయ ముఖచిత్రం ముద్రింపబడి ఉంది. ఇదే అంగ్‌కోర్‌వాట్‌గా ప్రసిద్ధిచెందింది. అంగ్‌కోర్ అనగా రాజధాని. వాట్ అనగా దేవాలయం. పూర్వం దీనిని నగరవాటిక అని పిలిచేవారు.

ఈ దేవాలయనిర్మాణానికి అవసరమైన రాళ్లను నాంకూలమ్ అను పర్వతాల నుండి తీసుకువచ్చారు. ఈ దేవాలయానికి 50కి.మీ.దూరంలోఉన్న ఈ పర్వతంనుండి సియామ్‌రీప్ అను నది ప్రవహిస్తోంది. ఆ దేశస్థులు దీనిని మన గంగానదివలె అతి పవిత్రమైనదిగా భావిస్తారు.

ఈ నది జన్మస్థలంలో నీరు భూమిలోనుండి నేలపైకి ఉబికివస్తోంది. ఆ స్థలంలో ఏమాత్రం శబ్దంచేసినా నీటి ఉధృతి పెరుగుతుంది. అనగా శబ్దభేదిద్వారా నీరుపైకి వస్తుంది. నాంకూలమ్‌పర్వతంపైనుండి శిలలను వెదురులసహాయంతో ఈ నదిద్వారానే రవాణా చేయబడ్డాయి. ఈ నదిలోనే సహస్ర శివలింగాలుకూడా చెక్కబడి ఉన్నాయి. తద్వారా ఈ నది ఎంతో పవిత్రమైందని తెలుస్తోంది.

ఈ దేవాలయంనందున్న శాసనాలు సంస్కృతంలోను, ఖెమెర్‌భాషలోను చెక్కబడి ఉన్నాయి. రెండవప్రాకారంనందు పెద్ద నడవా లేదా వరండా ఏర్పాటు చేయబడింది. ఈ వరండాగోడలపై హిందూపురాణగాథలు రామాయణం మరియు మహాభారతంలోని ఘట్టాలు, శిల్పాలు అత్యంత సుందరంగా చెక్కబడి ఉన్నాయి. కొన్నిచోట్ల పైకప్పుకుకూడా చిత్రించబడి ఉన్నాయి. ఇందులో సీతాదేవి అగ్నిపరీక్ష, రావణుడు కైలాసపర్వతంనెత్తుట, ద్రౌపది స్వయంవరం, కురుక్షేత్రయుద్ధం, గోవర్ధనగిరి, బృందావనం, శివపార్వతుల నాట్యవిన్యాసాలు, క్షీరసాగరమథనం ముఖ్యమైనవి.

జనజీవనప్రమాణం, పాపకర్మ, పుణ్యకర్మ, యముడు, చిత్రగుప్తుడు. జీవునియొక్క సప్తలోకప్రయాణం, ఊర్ధ్వలోకాలు, అథోలోకాలు, మధ్య భూమండలం మొదలైనవి చాలా అందంగా చిత్రీకరించారు. ఇక్కడ శిల్పి నేర్పరితనం చూపరులను ముగ్ధులను చేస్తుంది. ఈ గోడలపై చెక్కిన అప్సరసలబొమ్మలు సజీవశిల్పాలు. ఎంతసేపైనా అలానే చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది.

ఇక్కడనుండి రెండవఅంతస్తుపైకి ఎక్కటానికి సోపానాలు ఉన్నాయి. ఇక్కడకూడా వసారా, ప్రాకారం నిర్మించిఉన్నారు. ఇక్కడనుండి మూడవఅంతస్తులోనికి పోవటానికి నిర్మించిన సోపానాలు చాలానిలువుగా ఉండి, విశాలంగాకూడా ఉన్నాయి. ఈ సోపానాలపైనుండి రాజు, రాజగురువులు దర్శించుకొని వెళ్ళినతరువాతమాత్రమే ఇతరులకు ప్రవేశం కల్పించేవారు. ఈ మూడవఅంతస్తులో ప్రాకారం మరియు వసారా ఉండి నాలుగుదిక్కులనుండి ప్రధాన అంతరాలయప్రవేశానికి దారులు ఏర్పాటు చేయబడ్డాయి. నాలుగుమూలల్లో నాలుగుగోపురాలు నిర్మించారు. మధ్యలో గర్భాలయం నిర్మించి ఉన్నారు.



ఇది చతురస్రాకారంగా ఉండి నాలుగుదారులకు మధ్య నాలుగుమూలల్లోను నీటితో నిండిఉండేవిధంగా సరస్సులు ఏర్పాటుచేశారు. భూమట్టంనుండి ఈ విమానగోపురం అనగా గర్భాలయశిఖరం 213అడుగుల ఎత్తు ఉంది. ఈ ప్రధాన గర్భాలయమందు తూర్పుదిక్కున లక్ష్మీనరసింహస్వామి, ఉత్తరం వైపున సీతారాములు, పడమరవైపున లక్ష్మీనారాయణులు, దక్షిణంవైపున రుక్మిణీసమేతశ్రీకృష్ణుల మూలవిగ్రహాలు ఉండి పూజలందుకొంటుండేవి. ఇదంతాకూడా భూమిపై మానవనిర్మిత అసాధారణ, అత్యద్భుతకట్టడం. ఇందున్న శిల్పకళానైపుణ్యం, స్థపతుల వాస్తునిర్మాణకళాచాతుర్యం చూపరులను అబ్బురపరుస్తుంది. ఆనాటివారికి ఉన్న సాంకేతికపరిజ్ఞానానికి జోహారులర్పించాల్సిందే. దీనికి సాటి మరొకటి లేదు. హిందూ సంస్కృతిసంప్రదాయాలను తలపించి. మైమరపించే ఈ భూలోకవైకుంఠం విశిష్టతను ప్రపంచం నలుమూలలనుండి ప్రతిదినము వేలాదిమంది పర్యాటకులు సందర్శించుకొంటున్నారు.

కంబోడియాదేశంలో ఈ విష్ణుదేవాలయమే కాకుండా హిందూసంస్కృతిని ప్రతిబింబించే అనేక దేవాలయాలు కూడా ఉన్నాయి. 802వసంవత్సరంనుండి అంగ్‌కోర్‌వంశంవారు దాదాపు 39మందిరాజులు ఈ దేశాన్ని పరిపాలించారు. అందరూ దైవభక్తిపరాయణులే. వీరిలో కొందరు శివాలయాలు కూడా నిర్మించారు. ఇంతటి ప్రాశస్త్యమున్న అతిపెద్ద విష్ణు దేవాలయాన్ని దర్శించి తరిద్దాం.

ఆయుర్వేదం

# మేడిపండు

– డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ,
90007 61390

భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో విశిష్టతను సంతరించుకున్న పవిత్ర మహిమాన్విత వృక్షం మేడిచెట్టు. దీనిని కొన్ని ప్రాంతాల్లో అత్తిచెట్టు, బొడ్డచెట్టు ఇత్యాది పేర్లతో వ్యవహరిస్తారు.

తామ్ర లేదా రాగివంటి రంగుగల పళ్ళు ఉండటంచే (రాగికి ఉదుంబర అని పేరు) ఈ వృక్షాన్ని ఉదుంబర అని, దత్తాత్రేయస్వామి ఈ వృక్షంలో నివాసముండటంతో దత్తవృక్షమనియు, యజ్ఞాదిపవిత్రకర్మలయందు ఉపయోగపడటంతో యజ్ఞాంగఅనియు, క్షీరాన్ని కలిగి ఉండటంచే క్షీరవృక్షమనియు దీనికి సంస్కృతంలో పేర్లున్నాయి.

శ్రీమహావిష్ణువు నరసింహావతారంలో హిరణ్యకశ్యపుని ప్రేవులని చీల్చినపుడు రక్తం స్వామివారి గోళ్ళకి, చేతులకి అంటినపుడు అమ్మవారు మేడిచెట్టు ఆకులపసరును పూయటం వల్ల రక్తంలోఉన్న విషం హరించిందని, కావున స్వామివారికి మేడిచెట్టు ప్రీతిపాత్రమని, ఆ చెట్టును పూజించేవారికి సకలైశ్వర్యాలు సిద్ధిస్తాయని, ఆరోగ్యభాగ్యం కలుగుతుందని జనుల నమ్మిక. అపారఔషధగుణాలు మేడిచెట్టులో పుష్కలం.

**అధికవేడితగ్గేందుకు–**100గ్రా. మేడిపళ్ళచూర్ణంలో 100గ్రాముల పటికబెల్లంపొడి, 50గ్రాముల జీలకర్రపొడి కలిపి ఉంచుకుని ఉదయం, సాయంత్రం పూటకు అరటీస్పూను పొడిని 100 మి.లీ. కాచినపాలలో కలిపి సేవిస్తుంటే అధికవేడి తగ్గుతుంది.



**నోటి పూతకు–** మేడిచెట్టు బెరడును కొద్దిగా నీరు చేర్చి దంచి తీసినరసాన్ని పూటకు 20–30 మి.లీ. చొప్పున పుక్కిలిస్తుంటే నోటిపుళ్ళు, నోటి పూత, నాలుకమంట, నోట్లో మంటగా ఉండటంలాంటి సమస్యలు తగ్గుతాయి.

**వివిధరకాల విరేచనాలుతగ్గేందుకు–** రోజు మూడుపూటల ఆహారానికి అరగంటముందు పూటకు 100 మి.లీ. తాజా మజ్జిగలో అరటీస్పూను మేడిచెట్టుబెరడుచూర్ణాన్ని కలిపి సేవిస్తుంటే విరేచనాలు తగ్గుతాయి.

**ప్రాథమికదశలో ఉన్న మధుమేహం(షుగర్) నియంత్రణకు–** రోజూ మూడుపూటలా పూటకి 15మి.లీ. కాకరకాయరసంలో ఒకట్రెండుగ్రాముల మేడిచెట్టుబెరడుచూర్ణం కలిపి సేవిస్తుంటే ప్రయోజనం కలుగుతుంది.

**అధికఆకలితగ్గేందుకు–** రోజూ ఉదయం, సాయంత్రం పూటకు 200మి.లీ. పాలలో అరటీస్పూను మేడిచెట్టు బెరడు చూర్ణంవేసి 100మి.లీ. పాలు మిగిలేలా మరగించి, దించి, చల్లార్చి, వడగట్టి త్రాగుతూంటే ఈ సమస్య తగ్గుతుంది.

**నోరు, ముక్కు, మలమూత్రాలగుండా రక్తస్రావమవుతుంటే–**రోజూ 2సార్లు పూటకి ఒక మేడిఆకుని దంచి 100 మి.లీ. బియ్యం కడుగునీటితో మెత్తగానూరి వడగట్టి ఒక టీస్పూను పంచదార కలిపి సేవిస్తుంటే చాలా శీఘ్రంగా ఈ సమస్య తగ్గుతుంది.

**మోకాళ్ళు, నడుమునొప్పులకు–** మేడిపాలలో తగినంత కరక్కాయపెచ్చులచూర్ణం కలిపి ఆయాభాగాలపై లేపనం చేసి 2, 3 గంటలాగి కడిగేస్తుండాలి. మరియు రోజూ ఉదయం, సాయంత్రం పూటకు 60మి.లీ. మేడిపళ్ళరసంలో అరటీస్పూను కరక్కాయపెచ్చులచూర్ణం కలిపి సేవిస్తుంటే దీర్ఘకాలికంగా వేధించే మోకాళ్ళు, నడుమునొప్పులసమస్య తగ్గుతుంది.

## 2023, మార్చి నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 03-07 | తిరుమల శ్రీవారి తెప్పోత్సవం |
| 07 | శ్రీ లక్ష్మీజయంతి, శ్రీకుమారధారతీర్థముక్కోటి |
| 18 | శ్రీ అన్నమాచార్యవర్ధంతి |
| 20-28 | తిరుపతి, శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం |
| 22 | శ్రీ శోభకృత్ నామ సంవత్సర 'ఉగాది' |
| 24 | మత్స్యజయంతి |
| 27 నుండి ఏప్రిల్ 04 వరకు | వాయల్పాడు, శ్రీపట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవం |
| 30 | శ్రీరామనవమి |
| 31 నుండి ఏప్రిల్ 08 వరకు | ఒంటిమిట్ట, శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం |

**సుమతీశతకం**

# వినదగు నెవ్వరు చెప్పిన..!!

- శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి, 82775 32959

క. వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపఁదగున్
గని కల్ల నిజము దెలిసిన
మనుజుఁడెపో నీతిపరుఁడు మహిలో సుమతీ!

**తాత్పర్యం:** ఎవ్వరు చెప్పినా వినవచ్చు. విన్నవెంటనే తొందరపడక, అది నిజమో, అబద్ధమో వివరించి తెలుసుకొన్న వాడే న్యాయము తెలిసినవాడు. దీనికి సంబంధించిన చిన్నకథను తెలుసుకుందాం...

కోసలరాజ్యానికి రాజధాని అయిన అయోధ్య అంతటా పండుగ వాతావరణం కనిపిస్తోంది. ఆ సంతోషానికి కారణం, ప్రజలందరికీ ప్రీతిపాత్రుడైన రామునికి పట్టాభిషేకం జరగ బోవడమే. ఆ సంబరంలో అందరూ సంతోషంగా ఉన్న



సమయంలో ఆనందపడనిది ఒకేఒక్కవ్యక్తి. ఆమెయే మంధర. మంధర దశరథుని మూడవభార్య కైకకు పరిచారిక. ఆమె కైకతో ఇలా అంది. రాముడికి పట్టాభిషేకం జరిగితే కౌసల్య రాజమాత అవుతుంది. కైక, భరతుడు - కౌసల్యకు, రాముడికి సేవలుచేస్తూ బ్రతకవలసి వస్తుందని దుర్బోధ చేసింది.

నిజానికి కైక చాలా ఉత్తమురాలు. రాముణ్ణి మిక్కిలి అభిమానించేది. ఒకానొకసమయంలో జరిగిన యుద్ధంలో ఆమె దశరథమహారాజుకి సహాయంచేసి రెండువరాలు పొందిన ధీరవనిత. మంధరమాటలతో, తన పుత్రుడైన భరతునికి అన్యాయం జరుగుతుందేమో అన్న భయం ఆమెకు కలిగింది. ఆ భయంవల్లనే యుక్తాయుక్తవిచక్షణను కోల్పోయింది కైక. భరతునికే పట్టాభిషేకం జరగాలనీ, రాముణ్ణి 14సంవత్సరాలు అరణ్యవాసం పంపాలని దశరథుణ్ణి రెండువరాలు కోరింది కైక. కైక కోరికకు దశరథమహారాజు కృంగిపోయాడు. రాముడు తండ్రి ఆజ్ఞగా భావించి, భార్యతో, సోదరునితో అరణ్యవాసానికి వెళ్లాల్సి వచ్చింది. కైక కోరిక తీరలేదు. ఆ తర్వాత దశరథమహారాజు దుఃఖంతో మరణించాడు. భరతుడు తల్లిని హర్షించలేక పోయాడు. రాముడు లేని రాజ్యం తనకు వద్దన్నాడు.

ఆ విధంగా మంధరమాటలు విని కైక భర్తను పోగొట్టుకుంది. భరతుడి రాజ్యాభిషేకాన్ని సాధించలేకపోయింది. అందరిచేత నిందించబడింది.

**నీతి-** ఎవరు ఏమి చెప్పినా వినవచ్చు. కాని, మంచి చెడుల విచక్షణాజ్ఞానం కోల్పోకూడదు అని సుమతీశతకకారుని పద్యభావం.

## త్వరలో.. నూతన ధారావాహిక ప్రారంభం!

మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ రచించిన **శ్రీవేంకటాచల మాహాత్మ్యము** పద్యకావ్యం చాలా విశిష్టరచన.



శ్రీవేంకటాచలక్షేత్రమహిమను, శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రగాథను ఆస్తికలోకానికి విశేషంగా ప్రచారం చేసిన రచన ఇది. ఆరుఆశ్వాసాలు కలిగిన ఈ పద్యకావ్యాన్ని సరళ వచనంలో, తేటతెలుగులో, పాఠకులను అలరించే శైలిలో ధారావాహికగా అందించబోతున్నాం!

రచన- ఆచార్య కె.సర్వోత్తమరావు.
వీరు బహుభాషావేత్త,
బహుగ్రంథకర్త.

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# కఠినహృదయం కరగదు

పరగ రాతిగుండు పగులగొట్టగవచ్చు;
కొండలన్ని పిండిగొట్టవచ్చు;
కఠినచిత్తు మనసు కరిగింపగా రాదు;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** పరగ= ఉత్సాహంతో; కఠినచిత్తుడు= క్రూరమైన మనస్సు కలవాడు; కరిగింపగా రాదు = కరిగించలేము.

**భావం:** కష్టమైనా రాతిగుండును పగులగొట్టవచ్చు. ఇంకా కష్టమైనా కొండల్ని పిండి చేయవచ్చు. కాని దయలేనివాడిమనస్సును మాత్రం కరిగించలేము.

**వివరణ:** రాయి చాలాగట్టిగా ఉంటుంది. దాన్ని ముక్కలు చేయడం సాధ్యంకాదు. రాయికంటె కొండ ఇంకా పెద్దది. దాన్ని పగలగొట్టడం అసలు సాధ్యంకాదు. అటువంటికొండను ముక్కలుగా కాదు, మెత్తగా పిండిగా చేయడం. పయిగా కొండలు అన్నీ అంటే చాలా కొండలు. ఇది కేవలం అసంభవం. అసంభవమైన ఈ పనులను కూడ తేలికగా చేయవచ్చు. కానీ ఏ మాత్రం దయలేని, కఠినమైన హృదయం కలిగినవాడి మనసును కరిగించడం మాత్రం ఎంత కష్ట పడినా, సాధ్యంకాదు. దయ లేని మనసు రాయి కంటె, కొండలకంటె కూడ ఎంతో కఠినంగా ఉంటుంది. మానవుడు మనసునిండా భూత దయ కలిగి ఇతరుల బాధలను గ్రహించి, తొలగించాలని తాత్పర్యం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

# శ్రీకృష్ణామృతం..

మాధవాయని మరి మరి తలచితి
మంచిమీగడల మాటలు కూర్చితి

మోహము నీవని మోదము నీవని
మోక్ష జగతికై మార్గము నీవని

మక్కువ నీవని మచ్చిక నీదని
మతి స్మృతి నీవే మధనము నీకని

మాయయు నీవని మర్మము నీవని
మంతన లేల? మన్నన నీ పని

మననము నీవగు మహతియే నేనని
మరువజాల నిను మధురిపు నీవని



మనసున నీవని
మనుగడ నీవని
మర్మమెఱిగి మరీ
మరి మరి తలచి

మాన్యుడు నీవని
మా స్వామియే నీవని
మానిని అనంతకూ
మాలిమి నీవని

– 'అనంత'
కృష్ణసుందరి సత్తిరాజు,
*99103 45794*

## డిసెంబరునెల క్విజ్-5 సమాధానాలు

| | |
|---|---|
| 01) గోదాదేవి | 11) దత్తాత్రేయుడు |
| 02) ఉగ్రాస్యుడు | 12) కౌమోదకి |
| 03) వేంకట దాసు | 13) శార్ఙ్గము |
| 04) మాలిక | 14) కాడువెట్టినగరము |
| 05) రెండు | 15) వైశాఖమాసము |
| 06) అంతర్యామి | 16) శ్రీరంగం |
| 07) రెండు | 17) శ్రీరంగం-కంచి- తిరుమల |
| 08) విదుల | 18) మేల్కోటే |
| 09) సింధురాజు | 19) కపిస్థలం |
| 10) కుంతి శ్రీకృష్ణునికి | 20) రమామణివల్లి |

ఈ ఐదవ క్విజ్‌కు సరైనటువంటి సమాధానాలు ఎవరు రాయలేదు.


ఇతరులపై దయజూపడమే ఉత్తమోత్తమగుణం

పాఠం-19

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య
నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | |
|---|---|---|
| किम् = ఏ, ఏది, ఏమి | नु = ఏ | करिष्यन्ति = చేయగలరు |
| एतत् = ఈ - ఇది | भोः = అయ్యా(అండి) | करिष्यथ = మీరు చేయగలరు |
| कस्य = ఎవని యొక్క | हे = ఓ | करिष्यामः = చేయగలము |

### అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) किं तत्?
02) तत् किम्?
03) एतत् कस्य गृहम्?
04) तत् मम गृहम्।
05) तत् जलम्।
06) एतत् युष्मद्गृहम्।
07) ते तटाक जले स्नानं करिष्यन्ति भोः।
08) युष्मद्गृहे घृतं अस्ति वा?
09) नास्ति भोः।
10) ते कदा स्नानं करिष्यन्ति, कदा पाकं करिष्यन्ति?

### అ) జవాబులు

01) అది ఏమిటి?
02) అది ఏమిటి?
03) ఇది ఎవని యొక్క ఇల్లు?
04) అది నా యొక్క ఇల్లు.
05) అది నీరు.
06) ఇది మీయొక్క ఇల్లు.
07) అయ్యా! వారు తటాకజలంలో స్నానం చేయగలరు.
08) మీ ఇంటిలో నెయ్యి ఉన్నదా?
09) లేదండి.
10) వారు ఎప్పుడు స్నానం చేయగలరు, ఎప్పుడు వంటను చేయగలరు?

### ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) మేము రేపు వంటను చేయగలము.
02) వీరిప్పుడు చేయగలరు?
03) మీరెప్పుడు చేయగలరు?
04) మేము చేయనే చేయము.
05) మీరెందుకు చేయరు?
06) మా ఇంట్లో అన్నమున్నది.
07) మా పిల్లవాడు మీ ఇంటిలో ఏమి చేయుచున్నాడయ్యా!
08) స్నానము చేయుచున్నాడేమో!
09) త్వరగా స్నానము చేయును గాక!
10) వాడు దబ్బున చేయని యెడల నేనేమి చేయగలనయ్యా?

### ఆ) జవాబులు

01) वयं श्वः पाकं करिष्यामः।
02) एते अधुना करिष्यन्ति?
03) यूयं कदा करिष्यथ?
04) वयं कदापि नैव करिष्यामः।
05) यूयं किमर्थं न करिष्यथ?
06) अस्माकं गृहे अन्नम् अस्ति।
07) भोः! अस्माकं बालकः युष्माकं गृहे किं करोति!
08) स्नानं करोति प्रायः!
09) वेगेन स्नानं करोतु!
10) भोः सः वेगेन न करोति चेत् अहं किं कर्तुं शक्नोमि?


చిత్ర కథ
మార్కండేయుడు
కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ శ్రీస్వామి
మృకండుమహర్షి భార్య మనస్విని. ఆ ఋషిదంపతులకి చాలాకాలంవరకూ సంతానం కలగలేదు. వాళ్లు శివునిగూర్చి తపస్సు చేశారు. శివుడు ప్రత్యక్షమై...
మీ తపస్సుకి మెచ్చాను. ఏం కావాలో కోరుకోండి!
పరమేశ్వరా! మాకు పుత్రసంతానం కావాలి!
అయితే.. దీర్ఘకాలం జీవించే దుర్మార్గుడు కావాలా? పదహారేళ్లు మాత్రమే జీవించే గుణవంతుడు కావాలా?
అల్పాయుష్కుడయినా గుణవంతుడైన పుత్రుడే కావాలి దేవా!
తథాస్తు!
ధన్యులం దేవా!
మృకండునికి పుత్రుడు కలిగాడు. అతనికి మార్కండేయుడు అని పేరు పెట్టారు. మహర్షులు ఆశీర్వదించారు.
చిరంజీవ!
చిరంజీవ!
ఒకనాడు మహర్షులు వచ్చి మార్కండేయునితో ఇలా అన్నారు. బ్రహ్మకూడా చెప్పాడు.
నాయనా! నీకు ఆయువు తరిగిపోతోంది. నిరంతరం శివధ్యానం చెయ్యి..
అలాగే! పూజ్యులారా!
మార్కండేయుడు నిరంతరం ధ్యానం చేస్తున్నాడు
ఓం నమశ్శివాయ


ఆయువు తీరిందని యమభటులు మార్కండేయుని దగ్గరికి వచ్చారు
శివభక్తుడైన ఈ బాలుని తాకటం కూడా కష్టంగా ఉందే!
అవును. వెళ్లి యమరాజుకి ఈ విషయం చెబుదాం!
యమభటులు విషయం యమరాజుకి చెప్పారు. యమరాజు స్వయంగా వచ్చి శివధ్యానంలో ఉన్న మార్కండేయునిమీద పాశాన్ని ప్రయోగించాడు.
నా పాశానికి కట్టుబడడం లేదే ఈ బాలుడు...
పరమేశ్వరా! పాహి మాం పాహి
మార్కండేయుడు శివలింగాన్ని కౌగిలించుకుని....
శివా! శంకరా! నన్ను కాపాడు తండ్రీ!
శివలింగంనుండి శివుడు ఆవిర్భవించాడు...
యమా! నా భక్తుల జోలికి రాకు
శివా! శరణు శరణు
అలాగే తండ్రీ!
మార్కండేయా! చిరంజీవ!
మార్కండేయుడు శివుని స్తుతించాడు
హరహర మహాదేవ శంభో శంకర!

# చండీ ఉద్ధాలకులు

బాలనీతి

- శ్రీ అవసరాల లక్ష్మీపతిరావు, 77991 77831

ఉద్ధాలకుడు ఋషి కౌశికుని శిష్యుడు. విద్యాభ్యాసానంతరం ఉద్ధాలకుడు పెళ్లిచేసుకుని గృహస్థుడైనాడు. ఒకసారి శిష్యుడికాపురం ఎలా ఉందో చూడ్డానికి శిష్యుని ఇంటికొచ్చాడు. శిష్యుడు గురువును చూచి ఆనందపరవశుడై గురువుకు పాద నమస్కారాలు చేసి దుఃఖంతో ఇలా చెప్పాడు.

తనకాపురం సరిగా లేదని, తనభార్య చండి తనకను కూలవతి కాదని, ఎడ్డెమంటే తెడ్డెమంటుందని చెప్పాడు. గురువు శిష్యుణ్ణి ఊరడించి తనకేదైనా పని సక్రమంగా జరగాలనిపించి నప్పుడు దానికి వ్యతిరేకంగా చెప్పి పని సాధించుకోమని చెప్పాడు. ఆ తర్వాత గురువు తపస్సుకై హిమాలయాలకెళ్లాడు.

ఈ క్రమంలో ఉద్ధాలకుడి తండ్రి తద్దినంరోజు దగ్గరకు వచ్చింది. గురువుగారు చెప్పిన సలహా గుర్తుకు వచ్చింది. రేపు మాతండ్రిగారి ఆబ్ధికం. కానీ, అది పెట్టదలచుకోలేదు. అందుకు చాలా డబ్బు ఖర్చవుతుందని ఉద్ధాలకుడు భార్యతో అన్నాడు. అందుకు ఆమె అదేం కుదరదు. తద్దినం పెట్టి తీరాల్సిందే. సంవత్సరానికి ఒక్కసారే కదా వచ్చేది. రోజూ వస్తుందా? అని అన్నది. మూడుకూరలు, రెండుపచ్చళ్లు వద్దు. ఏదో తేలికగా పెడదాం అన్నాడు భర్త. అలా కుదరదు. యథావిధిగా పెట్టాల్సిందే అంది భార్య. అయితే బ్రాహ్మణులను పిలవను. అనవసరంగా డబ్బు ఖర్చు అని కోపంగా అన్నాడు భర్త. అదేం కుదరదు. చేసేది నేను కదా. మీకేమి బాధ అంది భార్య.

ఉద్ధాలకుడు అనుకున్నప్రకారం తద్దినం సక్రమంగా జరిగింది. ఆ అణచుకున్న సంతోషంలో ఉద్ధాలకుడు మైమరచి చివరలో పొరపాటు చేశాడు. ఆ పిండాలు తీసుకువెళ్లి గోవుకి పెట్టు అన్నాడు. చండి ఆ పిండాలను చెత్తకుప్పలో పారవేసింది. ఆ పిండాలు చెత్తకుప్పలో పారవెయ్యి అని ఉంటే ఆ పిండాలను ఆమె ఆవుకు పెట్టేది. ఉద్ధాలకుడి పథకమంతా వృథా అయిపోయింది. కోపోద్రిక్తుడై ఉద్ధాలకుడు ఆమెను కొట్టి శిలవుకమ్మని శపించాడు. ఆమె మునిపాదాలు కన్నీటితో కడిగి శాపవిమోచనాన్ని కోరింది.

బ్రాహ్మణునికోపం తాటాకుమంట లాంటిది. ఇట్టే వస్తుంది. ఇట్టే పోతుంది. ఆమెభర్త శాంతించి ఇలా అన్నాడు. రాబోవు కాలంలో ఒకానొకసమయంలో అర్జునుడి గుఱ్ఱం నీ శిలకి అంటుకుపోతుంది. అతడు దానిని పట్టిలాగేసమయంలో నీకు యథా రూపం వస్తుందని శాపవిమోచనం చెప్పాడు.

ఆ తర్వాత అర్జునుడు రావడం, గుఱ్ఱాన్ని శిలనుండి వేరుచేయడం జరిగాయి. అలా చండికి నిజరూపం వచ్చింది.



అలా అర్జునుడు చేసిన మహోపకారానికి దంపతులు చండీఉద్ధాలకులు అర్జునుణ్ణి పెక్కువిధాల మెచ్చుకుని కీర్తించారు.

ఏ బంధంలోనైనా ఒకరికిఒకరు పరస్పరం అనుకూలంగా ఉంటేనే పనులు నిర్విఘ్నంగా విజయవంతమవుతాయన్నదే పై కథాసూక్తి.

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## కదంబం

### చతుర్దశమనువులు

01) స్వాయంభువమనువు
02) స్వారోచిషమనువు
03) ఉత్తమమనువు
04) తామసమనువు
05) రైవతమనువు
06) చాక్షుసమనువు
07) వైవస్వతమనువు
08) సూర్యసావర్ణిమనువు
09) దక్షసావర్ణిమనువు
10) బ్రహ్మసావర్ణిమనువు
11) ధర్మసావర్ణిమనువు
12) రుద్రసావర్ణిమనువు
13) దేవసావర్ణిమనువు
14) ఇంద్రసావర్ణిమనువు

## పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) బ్రహ్మ | అ) సర్వవ్యాపకుడు |
| 2) విష్ణువు | ఆ) మహాకైలాసము |
| 3) రుద్రుడు | ఇ) కైలాసము |
| 4) ఈశ్వరుడు | ఈ) వైకుంఠము |
| 5) సదాశివుడు | ఉ) సత్యలోకము |

జవాబులు: 1-(ఉ); 2-(ఈ); 3-(ఇ); 4-(అ); 5-(ఆ)

## చెప్పండి చూద్దాం!

ఈ క్రింది బొమ్మల్లో ఐదక్షరాల దేవుళ్ల పదాలు చివర 'డు' తో వస్తాయి. గుర్తించి రాయండి!







1) ............ 2) ............ 3) ............ 4) ............ 5) ............

జవాబులు: 1)గరుత్మంతుడు 2)వేంకటేశుడు 3)కార్తికేయుడు 4)ఆంజనేయుడు 5)సదాశివుడు

## కనుక్కోండి

ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆ | నా | చి | జ | లే | సో | ని | శు | శు | |
| త్మ | ద్ధి | లు | ద్ధు | వి | త్త | కి | పా | యా | |

జవాబు:
ఆత్మశుద్ధి, చిత్తశుద్ధులే
విజయానికి సోపానాలు

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

# క్విజ్ 07

01) ఉత్తరదిక్కును సూచించే లింగం పేరు? జ)..........
02) ఎనిమిదిరకాల వివాహప్రస్తావన ఎందులో ఉంది? జ)..........
03) భగవంతునిపూజలో ప్రధానఫలం ఏది? జ)..........
04) రుద్రాక్షమహిమలగురించి తెల్పిన గ్రంథం ఏది? జ)..........
05) భగవద్గీతలో రెండవఅధ్యాయం పేరు? జ)..........
06) లక్ష్మీదేవి ఎవరి కుమార్తె? జ)..........
07) తిరుమల శ్రీనివాసునికి ప్రియభక్తుడు ఎవరు? జ)..........
08) భీష్ముని ఆరాధ్యదైవం ఎవరు? జ)..........
09) ఉద్దాలకుని భార్యపేరు? జ)..........
10) 'అర్థం' అంటే ఏమిటి? జ)..........
11) 'వేదభూమి' అని దేనికి పేరు? జ)..........
12) యోగులకు మహదానందాన్ని కల్గించేది? జ)..........
13) శంఖుచక్రాల నడుమ మనకు కనిపించేది ఏది? జ)..........
14) శివభక్తి బాలకులలో అగ్రగణ్యుడెవడు? జ)..........
15) 'కైకేయి' పరిచారిక పేరు? జ)..........
16) పంచాక్షరీమంత్రం ఏది? జ)..........
17) ప్రపంచప్రసిద్ధమైన అతిపెద్ద విష్ణుదేవాలయం ఎక్కడుంది? జ)..........
18) పరమశివుడు జ్యోతిర్లింగంగా ఆవిర్భవించిన రోజు? జ)..........
19) సతీదేవి తండ్రిపేరు? జ)..........
20) కలియుగంలో మోక్షాన్నిచ్చే ఒకే ఒకమార్గం? జ)..........

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-02-2023.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. వెతికి రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........
పాఠశాల: .......... తరగతి: ..........
పేరు: ..........
చిరునామా: ..........
..........
..........
.......... పిన్‌కోడ్: ..........
ఫోను నెంబరు: ..........

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్,
కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం–** ఇతరులతో సంయమనం పాటించటం అవసరం. కుటుంబవిషయాలు, వృత్తిఉద్యోగాల్లో తగిన జాగ్రత్త అవసరం. ఇతరులను గౌరవించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

**వృషభం–** ప్రణాళికతో ముందుకు సాగుతారు. కార్యసిద్ధి, సంతోషం, అధికారవృద్ధి, గృహోపకరణవస్తువులు కొనుగోలు జేయడం, శుభవార్తలు వినడం కలసి వస్తాయి.

**మిథునం–** ఆకస్మిక ధనలాభాలు వరిస్తాయి. ధనధాన్య వస్త్రలాభాలు, ధనవృద్ధి, ఆరోగ్యం, గురుభక్తి, యత్నకార్యసిద్ధి, పుణ్యక్షేత్రసందర్శనసౌఖ్యం ఉంటాయి.

**కర్కాటకం–** గురుబలం ఉంది. సంతానం విషయంలో ఉన్నతి. బంధుమిత్రులసందడి, గృహమున కల్యాణాది శుభయోగాలపై శుభవ్యయం. పై అధికారులు, బంధుమిత్రుల ప్రోత్సాహం ఉంటుంది.

**సింహం–** దోషాలు క్రమేపీ తొలగుతాయి. ఆరోగ్యం,ఆయుర్దాయం పెంపొందుతాయి. ధైర్యంగా ప్రణాళికతో వ్యవహరించి కార్యసిద్ధి పొందుతారు.

**కన్య–** శుభయోగాలు కలసివస్తాయి. స్వబుద్ధిచే చేసే పనులు సిద్ధించి ధనవృద్ధి, పేరుప్రఖ్యాతులు కల్గుతాయి. నూతన వస్తువస్త్రలాభాలున్నాయి.

**తుల–** వ్యవహార ప్రతిబంధకాలు, కోర్టు వ్యవహారాల్లో ప్రతిష్ఠంభన ఏర్పడుతుంది. గృహనిర్మాణాలు కలసిరావు. ఇరుగుపొరుగు వారి మేలుకోరడం మంచిది.

**వృశ్చికం–** గృహనిర్మాణాలు కలసి వస్తాయి. గతంలో నిలచిన పనులన్నీ సాఫీగా సాగుతాయి. కుటుంబవృద్ధి. గ్రహస్థితి అనుకూలం. విద్యావిషయాల్లో విజయం సాధిస్తారు.

**ధనుస్సు–** గృహనిర్మాణానికి శ్రీకారం చుడతారు. ధనవిషయాల్లో శ్రద్ధ అవసరం. వాగ్భూషణమేభూషణం. ఇతరులను గౌరవించడమనే ముఖ్య ఆశయం మిమ్మల్ని ఉన్నతశిఖరాలకు చేరుస్తుంది.

**మకరం–** తార్కికమైన తెలివితేటలతో కొత్తగా ఆదాయమార్గాలను ఎంచుకుంటారు. మీ సంస్థలను సమర్థవంతంగా నడిపి అందరి మన్ననలను పొందుతారు. ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం.

**కుంభం–** విద్యార్థులు ప్రతిభ కనబరుస్తారు. గృహంలో శుభకార్యాలు కలసివస్తాయి. ప్రణాళికలతో కార్యజయం కల్గుతుంది. వ్యవసాయం అనుకూలం.

**మీనం–** శుభకార్యనిర్వహణ, అందరి మన్ననలు పొందుతారు. సమస్తైశ్వర్యాలు కల్గుతాయి. సమాజంలో మీ మాటకు గుర్తింపు వస్తుంది. స్థిరాస్తుల విలువ గణనీయంగా పెరుగుతుంది.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

తేది :

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా (12 సం॥రాలు) రూ.2400/-లు; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 85

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | ■ | 3 | | 4 | | |
| | ■ | 5 | | ■ | ■ | | ■ | ■ |
| 6 | | ■ | 7 | 8 | | ■ | 9 | ■ |
| | ■ | 10 | ■ | | ■ | 11 | | |
| ■ | ■ | 12 | | | | | ■ | ■ |
| 13 | ■ | | ■ | | ■ | 14 | 15 | |
| 16 | | ■ | 17 | | | ■ | | ■ |
| | ■ | ■ | | ■ | 18 | | ■ | 19 |
| ■ | 20 | | | ■ | | ■ | 21 | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

3)వాల్మీకితండ్రి(5); 5)మాట(2); 6)రుక్మిణిసోదరుడు(2); 7)వైకుంఠద్వారపాలకుల్లో ఒకడు(3); 11)చంద్రహాసునిభార్య(3); 12)జనకునికిగల మరియొకపేరు(5); 14)భృగుమహర్షిభార్య(3); 16)సూర్యునికుమారుడు(2); 17)ఉపనయనం. దీనికిగల మరియొకపేరు(3); 19)రౌచ్యమనువు తండ్రి(2); 21)ఒక నదము(3); 22)సరస్వతి(2)

### నిలువు

1)సూర్యుని రథసారథి(4); 2)ఒకలోహము(2); 4)స్త్రీ(2); 8)కార్తవీర్యార్జునుడి పెద్దకొడుకు(5); 9)అనిరుద్ధునిభార్య(2); 10)యయాతి కూతురు(3); 11)దానము, త్యాగము అను అర్థాలనిచ్చే పదం(3); 13)శుక్రునితల్లి(3); 15)పిసినారి(2); 17)నర్మద అను గంధర్వస్త్రీకుమార్తె(3); 18)నవగ్రహాల్లో ఒకటి(3); 20)పాముతలపై ఉండేది(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

\- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

తిరుమల తిరుపతి దేవస్థానములు





01-01-2023 నుండి 05-01-2023 వరకు
తిరుపతి, శ్రీకపిలేశ్వరస్వామివారి సన్నిధిలో
జరిగిన తెప్పోత్సవ కార్యక్రమ దృశ్యాలు



తొండమాన్‌పురం
శ్రీదేవి, భూదేవి, శ్రీవేంకటేశ్వరస్వామివారి
బ్రహ్మోత్సవాలు
2023 ఫిబ్రవరి 20 నుండి 28 వరకు

తిరుమల తిరుపతి దేవస్థానములు

**20-2-2023 సోమవారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: శేషవాహనం

**21-2-2023 మంగళవారం**
రాత్రి: హంసవాహనం

**22-2-2023 బుధవారం**
రాత్రి: సింహవాహనం

**23-2-2023 గురువారం**
రాత్రి: హనుమంతవాహనం

**24-2-2023 శుక్రవారం**
రాత్రి: గరుడవాహనం

**25-2-2023 శనివారం**
రాత్రి: కల్యాణోత్సవం
రాత్రి: గజవాహనం

**26-2-2023 ఆదివారం**
రాత్రి: చంద్రప్రభవాహనం

**27-2-2023 సోమవారం**
పగలు: తిరుచ్చి (రథోత్సవం)
రాత్రి: అశ్వవాహనం

**28 -2-2023 మంగళవారం**
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-01-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

